# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 113 | హైదరాబాద్ | సోమవారం 20-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

'జూబ్లీహిల్స్'లో ఓట్లు చీల్చేందుకే బీఆర్ఎస్ ఈ ఎత్తుగడ వేసింది: సీఎం రేవంత్ రెడ్డి

## నేటి భారతం

- రేవంత్ మాటలు వినగానే మార్పు వస్తుందనుకున్నారు.. కానీ మారింది కేవలం ప్రసంగాల శైలి మాత్రమే.
- రేవంత్ పాలనలో అభివృద్ధి అంటే.. కాగితాల మీదే కనిపిస్తోంది.
- ప్రజలకు సవరణలు కావాలి, కానీ రేవంత్ ప్రభుత్వానికి సభలో చప్పట్లు కావాలి.
- పాలనలో మార్పు కోసం ప్రజలు ఓటేశారు.. కానీ మారింది కేవలం పేరు బోర్డులు మాత్రమే.
- రేవంత్ పాలనలో ప్రగతిపథం జీ.పీ.ఎస్. సిగ్నల్ లా వుంది.. కొన్నిసార్లు కనపడుతుంది, కొన్నిసార్లు పోతుంది..
- వాగ్దానాలు ఎక్కువ, కార్యాచరణ తక్కువ..
- రేవంత్ ప్రభుత్వం మీద ప్రజలకున్న అభిప్రాయం.. అధికారంలోకి రావడం సులభం.. ప్రజల మనసు గెలవడం కష్టం.. రేవంత్ ఈ సత్యాన్ని గ్రహించాలి..
- ప్రతి ప్రభుత్వం అవినీతి నిర్మూలన చేస్తామని చెబుతుంది.. కానీ అవినీతి మాత్రం మారదు కేవలం రూపం మారుతుంది..
- రేవంత్ ప్రభుత్వం కూడా దీనికి మినహాయింపు కాదు..


– కేసారం పెంటారెడ్డి,
సీనియర్ సామాజిక విశ్లేషకులు


## ఈ దీపావళి... వెలుగులు నింపిందా..?




తెలంగాణ రాజకీయ వేదికపై కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా అవతరించడం రాష్ట్ర ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. "విప్లవాత్మక మార్పు" కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఆయన ఉత్సాహం, దూకుడు, ప్రజా మద్దతు చైతన్యం కలిగించాయి. కానీ, కాలం గడుస్తున్న కొద్దీ ఆ ఉత్సాహం కొంత తగ్గి ఆత్మపరిశీలన అవసరమైందన్న భావన ప్రజల్లో వేగంగా పుట్టుకొస్తోంది. రేవంత్ పాలన మొదట్లో ప్రజలు "ఇదే నిజమైన మార్పు" అని భావించారు. పాత పద్ధతులను మార్చి కొత్త చైతన్యాన్ని తీసుకురావాలనే ప్రయత్నం స్పష్టంగా కనిపించింది. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో కొన్ని సంస్కరణలు ప్రారంభమయ్యాయి. పాత పాఠశాలల పునరుద్ధరణ, ఆసుపత్రుల్లో సదుపాయాల పెంపు, పౌర సేవల డిజిటల్ వ్యవస్థ వంటి కార్యక్రమాలు మంచి ప్రారంభ సూచనలు ఇచ్చాయి. అయితే, ఆ చైతన్యం ప్రభుత్వ వ్యవస్థలో లోతుగా ప్రవేశించలేకపోయింది. వాగ్దానాలు ఎక్కువగా, అమలు నిదానంగా ఉన్నదన్న విమర్శలు

- రేవంత్ రెడ్డి పాలనలో ఆశలు, ఆవేదనలు..
- పాలన అంటే మాటలు కాదు.. చేతలు కనిపించాలి..
- ఆత్మపరిశీలన అవసరం అని సూచిస్తున్న విశ్లేషకులు..
- ప్రతిపక్షాలపై విమర్శలతోనే కాలం గడపడం భావ్యం కాదు..
- పరిపాలనలో మార్పు తీసుకొస్తానన్నపెద్దమనిషి ఏమీ మారలేదు.. మార్చలేదు..
- స్ఫూర్తిగా కనిపించడం వరకు సరే.. కానీ స్థిరత్వం లేదన్నది నిర్వివాదాంశం..
- ప్రజాసమస్యలకంటే.. పార్టీలో అంతర్గత సమస్యలే ఎక్కువ..
- మాట నిలబెట్టే అవకాశం ఉన్నా సమన్వయ లోపం కనిపిస్తోంది..
- కార్యక్రమాలు మంచివే కానీ, అమలు జరుగుతున్న విధానం సరిగా లేదు..
- పార్టీ సన్నిహితులకే అన్నీ జరుగుతున్నాయి..
- గత ప్రభుత్వం మాదిరిగానే కుటుంబపాలన సాగుతోంది..!
- ఈ దీపావళి సందర్భంగా రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేసి మీకు అందిస్తోంది " ఫోరం ఫార్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..

12లో

## మావోయిస్టులతో సంబంధాలు తెంచుకోండి

తెలంగాణ నేతలకు బండి సంజయ్ తీవ్ర హెచ్చరిక


11లో


11లో

## ఆర్టీఏ చెక్‌పోస్టుల్లో అవినీతి బాగోతం

- తెలంగాణవ్యాప్తంగా 12 ఆర్టీఏ చెక్‌పోస్టులపై ఏసీబీ ఆకస్మిక దాడులు
- లారీ డ్రైవర్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు పక్కా సమాచారం
- అధికారుల తరపున డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఏజెంట్లు
- సోదాల్లో రూ. 4,18,880 లెక్కచూపని నగదు స్వాధీనం

## బీఆర్ఎస్ ఓటమికి అసలు కారణం అదే!

- బీఆర్ఎస్ ఓటమికి ధరణి చట్టమే కారణమన్న సీఎం రేవంత్
- కొంతమంది దొరల కోసమే ధరణిని తెచ్చారని తీవ్ర ఆరోపణ
- ధరణిని రద్దు చేసి భూ భారతిని తీసుకొచ్చామని వెల్లడి
- ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్న ముఖ్యమంత్రి
- సర్వేయర్లు బాధ్యతగా ఉండి రైతులకు సాయం చేయాలని సూచన


11లో


11లో

## దీపావళి వేళ పారిశ్రామిక రంగానికి తియ్యని కబురు చెప్పిన సీఎం

- పరిశ్రమలకు ఏపీ ప్రభుత్వం దీపావళి కానుక
- పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాల కింద తొలి విడత నిధులు
- రూ. 1,500 కోట్లు విడుదల చేస్తున్నట్లు సీఎం ప్రకటన
- ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ పరిశ్రమలకు అండగా ఉంటామని స్పష్టీకరణ
- పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేస్తామన్న చంద్రబాబు

## 25 నుంచి కవిత జాగృతి జనం బాట

### శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు

- కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్న తెలంగాణ జాగృతి
- నాలుగు నెలల పాటు కొనసాగనున్న కార్యక్రమం
- భర్తతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కవిత
- కార్యక్రమం విజయవంతం కావాలని స్వామివారికి పూజలు


11లో


11లో

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

- ఆగ్నేయ బంగాళాఖాతంలో బలపడుతున్న ఉపరితల ఆవర్తనం
- మంగళవారానికి అల్పపీడనంగా మారే అవకాశం
- 22 నుంచి ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షా లు

భారత శక్తి

# క్రీడా సంస్కృతి వెల్లివిరియాలి

%భారత్ 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా తన శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పాలని భావిస్తోంది. అందుకోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో 2030 కామన్వెల్త్ క్రీడలకు ఇండియా వేదిక కానుండటం ఒలింపిక్స్‌కు సన్నద్ధమవడానికి అమితంగా అక్కరకొస్తుంది. బ్రిటిష్ వలస పాలనలోంచి స్వేచ్ఛ పొందిన దేశాల నడుమ నాలుగేళ్లకోసారి కామన్వెల్త్ క్రీడా పోటీలు జరుగుతుంటాయి. డెబ్భైకి పైగా దేశాలు ఇందులో భాగస్వాములవుతుంటాయి. 2010లో ఈ ఆటల నిర్వహణ బాధ్యతలను భుజాలకెత్తుకున్న ఇండియా– ఆనాటి పాలకుల అసమర్థత, నిర్వాహకుల అవినీతి మేతల మూలంగా తీవ్ర అపఖ్యాతిని మూటగట్టుకుంది. పనుల కేటాయింపుల్లో అక్రమాలు, వసతుల కల్పనలో లోపాలు భారతావని ప్రతిష్ఠకు తీరని కళంకాలయ్యాయి. ఈసారి అలాంటి అవకతవకలకు, వైఫల్యాలకు తావులేకుండా ఏర్పాట్లన్నీ పక్కాగా పూర్తికావాలి. అహ్మదాబాద్‌లో కొన్నేళ్లుగా అధునాతన క్రీడావసతులు అందుబాటులోకి వస్తుండటం ఆటలపోటీలకు ఒక సానుకూల అంశం. రాబోయే అయిదేళ్లలో ఆయా సదుపాయాలను మరింత మెరుగుపరిచి చారిత్రక శతవసంత కామన్వెల్త్ క్రీడోత్సవాన్ని ఇండియా దిగ్విజయం చేయాలి!

వివిధ కారణాల దృష్ట్యా వచ్చే ఏడాది గ్లాస్గోలో జరగనున్న కామన్వెల్త్ పోటీల్లో పది క్రీడలకే పచ్చజెండా ఊపారు. ఇండియా మాత్రం అన్ని ఆటలకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. వాస్తవానికి, 145 కోట్ల జనాభాకు నెలవైనప్పటికీ– అనేక క్రీడల్లో పతకాల సాధనలో భారత్ వెలాతెలాపోతోంది. ఒలింపిక్స్‌లో సగం ఆటలకు పూర్తిగా ముఖం చాటేస్తోంది. కామన్వెల్త్ సంరంభం కోసం ఏర్పరిచే మేలిమి వసతులు విభిన్న క్రీడల్లో ఎక్కువ పతకాలు ఒడిసిపట్టేందుకు మన ఆటగాళ్లకు ఉపయోగపడగలవు. 'కామన్వెల్త్'లో ఇండియా ఇటీవల గణనీయ సంఖ్యలో మెడళ్లు సాధిస్తున్నా– పతకాల పట్టికలో అగ్రభాగాన నిలవాలన్న కల నేటికీ నెరవేరలేదు. 2010 క్రీడల్లో అత్యధికంగా 101 పతకాలతో భారత్ రెండో స్థానంలో నిలిచింది. 2022లో నాలుగో స్థానానికి పరిమితమైంది. కామన్వెల్త్ ఆటల్లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, కెనడాల ఆధిపత్యాన్ని అడ్డుకోవాలంటే– కీలక పోటీల్లో ఒత్తిడికి లొంగిపోయి ఓటమిని కొనితెచ్చుకునే లోపాన్ని సరిదిద్దుకుని మన క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలి. అందుకు తగిన తర్ఫీదును వారికి ప్రభుత్వం అందించాలి!

పాఠశాల దశ నుంచే వ్యాయామ విద్యాబోధనను చైనా తప్పనిసరి చేసింది. మట్టిలో మాణిక్యాలను గుర్తించి అత్యున్నత శిక్షణ అందిస్తూ ఏ స్థాయి పోటీల్లోనైనా పతకాలు కొల్లగొడుతోంది. నెదర్లాండ్స్, ఫిన్లాండ్, పోలాండ్ వంటి చిన్న దేశాలూ ఇదే బాటలో సాగుతూ తమ సత్తా చాటుకుంటున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్ తదితర దేశాలు మౌలిక వసతులను బలోపేతం చేసుకుని లెక్కకుమిక్కిలిగా మెడళ్లు ఒడిసిపడుతున్నాయి. ఇండియాలో మాత్రం చాలా బడుల్లో కనీసం మైదానాలే కనిపించవు. ఇక ప్రతిభ ఉన్నా వ్యవస్థాగత తోడ్పాటు కొరవడి ఎందరో క్రీడాకారులు తెరమరుగు అవుతున్నారు. ప్రాథమిక దశనుంచే చదువుతో పాటు వ్యాయామం, ఆటల పట్ల పిల్లలకు ఆసక్తి పెంచితే వారి శారీరక, మానసిక వికాసం అద్భుతంగా ఉంటుంది. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి తమ పిల్లలు రోజూ కొంత సమయం మైదానాల్లో గడిపేలా చూడాలి. క్రీడలపై అనురక్తి ఉన్నవారిని ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు సైతం అలాంటి వారికి వెన్నుదన్నుగా నిలవాలి. అప్పుడే విశ్వక్రీడా సమరాల్లో ఇండియా విజయపతాకాన్ని ఎగరేస్తుంది!

# మోపిదేవి దారెటు

గుంటూరు, అక్టోబరు 19

మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ రాజకీయంగా తన పతనాన్ని తానే కొనితెచ్చుకున్నట్లయింది. గత కొన్ని నెలల నుంచి మోపిదేవి మాట కూడా వినిపించడం లేదు. రాజ్యసభ సభ్యుడిగా ఉండాల్సిన మోపిదేవి వెంకటరమణ రాజీనామా ఇప్పుడు ఖాళీగా గోళ్లు గిల్లుకుంటూనే ఉన్నారు. మహా అయితే.. రానున్న కాలంలో ఎమ్మెల్సీ పదవి దక్కుతుందేమో కానీ.. టీడీపీ ప్రభుత్వంలో మోపిదేవి వెంకటరమణకు మంత్రి పదవి దక్కడం మాత్రం జరిగే పని కాదు. అందులోనూ రేపల్లెలో తన చిరకాల ప్రత్యర్థి అనగాని సత్యప్రసాద్ ఉన్నప్పుడు మోపిదేవిని బొట్టు పెట్టి పిలిచి మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఎంతమాత్రం లేదు. ఇంతోటి దానికి ఎందుకు రాజీనామా చేసి పార్టీ మారారంటూ అనుచరులే ప్రశ్నిస్తున్నారు.. ఇక రేపల్లె నియోజకవర్గంలోనూ వేలు పెట్టే అవకాశం కూడా మోపిదేవి వెంకటరమణకు గాని, ఆయన అనుచరులకు గాని లేదు. అది అనగాని అడ్డా కావడంతో మోపిదేవి నామమాత్రపు నేతగానే మిగిలిపోయారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ తన పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభకు రాజీనామా చేసి ఆయన ఎమ్మెల్సీగా ఎన్నిక కావాలని భావించారు. కొన్ని నెలల నుంచి మోపిదేవి వెంకటరమణ పదవి కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకూ ఐదు ఎమ్మెల్సీ పోస్టులు భర్తీ అయినా అందులో మోపిదేవి పేరు కనిపించలేదు. మూడు టీడీపీ, జనసేన, బీజేపీ చెరొక స్థానం తీసుకున్నా మోపిదేవి వెంకటరమణకు మాత్రం ఛాన్స్ రాలేదు. .. రానున్న ఖాళీల తర్వాత ఏదైనా మోపిదేవి వెంకటరమణకు ఛాన్స్ ఉంటే ఉండవచ్చు. కానీ ఎమ్మెల్సీకి మించి మోపిదేవి వెంకటరమణ ఎదగలేరన్నది వాస్తవం. ఎందుకంటే వైసీపీ నుంచి వచ్చిన నేత కావడంతో పాటు జగన్ కు జిగిరీ దోస్త్ కావడంతో చంద్రబాబు నాయుడు అంత తేలికగా మోపిదేవిని నమ్మే అవకాశం లేదు. రాజ్యసభ పదవి త్యాగం చేసినందుకు ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశముంది. అదీ ఒక్క



ఛాన్స్ వరకూ మాత్రమే అన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. వైసీపీలో ఉన్న సమయంలో ఓడిపోయినా మంత్రిని చేసి, తర్వాత అనుకోని పరిస్థితుల్లో రాజ్యసభ పదవికి ఎంపిక చేసిన పార్టీని కాదని మోపిదేవి వెంకటరమణ సైకలెక్కి ఇప్పుడు బాధపడితే ప్రయోజనం ఏముంటుంది?

# విజయసాయిరెడ్డి యాక్టివ్ పాలిటిక్స్...



నెల్లూరు, అక్టోబరు 19

మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తిరిగి రాజకీయాల్లో యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. రాజకీయాలకు సన్యాసం చెప్పి తాను వ్యవసాయం చూసుకుంటానని చెప్పిన విజయసాయిరెడ్డికి తిరిగి పాలిటిక్స్ పై మోజు పెరిగిందంటున్నారు. ఆయన తన అత్యంత సన్నిహితుడితో కలసి మాట్లాడినప్పుడు ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిసింది. అయితే వైసీపీకి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి బీజేపీలో చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచారం జరిగింది. కానీ సాయిరెడ్డి ఇప్పటి వరకూ ఆ పార్టీలో చేరలేదు. బీజేపీ అయినా ఆయనను కాదనుకుని ఉండాలి. లేకుంటే అది ప్రచారానికే పరిమితమయి ఉండాలి. కానీ విజయసాయిరెడ్డి ఇప్పుడు ఏ పార్టీలో చేరతారన్నది ఆసక్తికరంగా మారింది. వైసీపీలో చేరే అవకాశాలు ఎంత మాత్రం లేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ మద్యం కేసులో విజయసాయిరెడ్డి ఇచ్చిన లీకులు కావచ్చు. తర్వాత వైఎస్ షర్మిలతో భేటీ అవ్వడంతో జగన్ పార్టీలోకి రీఎంట్రీ అనేది జరగని పని అని అందరూ అభిప్రాయపడుతున్నారు. అందులో వైఎస్ జగన్ విషయంలో సాయిరెడ్డిని తిరిగి చేర్చుకునేది ఉండకపోవచ్చు. విజయసాయిరెడ్డి చెప్పిన తర్వాత ఏపీ మద్యం కేసులో రాజ్ కేసిరెడ్డి పేరు బయటకు రావడంతో పాటు పలు రకాల ఆరోపణలు చేయడం, జగన్ పై కోటరీ అంటూ విమర్శలు చేయడంతో విజయసాయిరెడ్డిని జగన్ పార్టీలోకి తిరిగి చేర్చుకునే అవకాశాలుండకపోవచ్చు. ఇక విజయసాయిరెడ్డి టీడీపీలో చేరాలనుకున్నప్పటికీ బహుశా చంద్రబాబు నాయుడు అంగీకరించే అవకాశం ఉండకపోవచ్చు. ఎందుకంటే వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్ తో పాటు పార్టీపైన చేసిన విమర్శలను క్యాడర్ ఎవరూ మర్చిపోలేదు. సాయిరెడ్డిని పార్టీలో చేర్చుకుంటే క్యాడర్ నుంచే అసహనం వ్యక్తమయ్యే అవకాశముంది. ఇక ఆయనకు ఏపీలో మిగిలిన పార్టీలు ఒక రెండే రెండు. ఒకటి జనసేన రెండు కాంగ్రెస్. జనసేనలో చేరాలనుకున్నప్పటికీ అది కూడా సాయిరెడ్డికి సాధ్యం కాకపోవచ్చు. చేరినా నామమాత్రపు నేతగానే మిగిలిపోవచ్చు. ఇకపోతే మిగిలింది కాంగ్రెస్ ఒక్కటే. ఏపీలో ఏమీ లేని కాంగ్రెస్ కు వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ గా ఉండటంతో కీలకంగా మారే అవకాశముంటుంది. షర్మిలకు రాజకీయంగా వెన్నుదన్నుగా ఉంటారన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తుంది. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# సేనతో సేనాని..

విజయవాడ, అక్టోబరు 19

రాజకీయ వ్యవస్థలో నవతరం యువతను భాగస్వామ్యం చేసేందుకు, సమాజంలో మార్పు కాంక్షించే ప్రతీ ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం కల్పించేందుకు "సేనతో సేనాని – మన నేల కోసం కలిసి నడుద్దాం" అంటూ ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని జనసేన పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక యువతీ, యువకులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని సేవలు అందించే అవకాశాన్ని ఈ వేదిక కల్పించనుంది. మార్పు కోరుకుంటే రాదు – మార్పు కోసం ప్రయత్నిస్తే వస్తుంది. ఈ ప్రయత్నంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు రిజిస్టర్ చేసుకునే అవకాశాల్ని కల్పించారు. సేనతో సేనాని కార్యక్రమం ఆగస్టు 28 నుంచి 30 వరకు విశాఖపట్నంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో విస్తృత స్థాయిలో జరిగింది. జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తలు, యువత వేలాదిగా పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ ప్రసంగంలో పార్టీ భవిష్యత్ ప్రణాళికలు, ఉత్తరాంధ్ర అభివృద్ధి, సమాజ సేవలు చర్చించారు. పోరాటం చేసేవాడే వీరుడు కాదు, అండగా నిలబడిన ప్రతి ఒక్కరూ వీరులే అని ఆయన అన్నారు. ఆ సమావేశం స్ఫూర్తిని కొనసాగించేందుకు ఈ ఏర్పాటుచేశారు. పాల్గొనాలనుకునే యువత ఖీఖీ కోడ్ స్కాన్ చేసి లేదా లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. పార్టీ అధికారిక సోషల్ మీడియా పోస్ట్‌లలో ఖీఖీ కోడ్ అందుబాటులో ఉంది.

# ఫ్యూచర్ లీడర్ లోకేష్ నా...

విజయవాడ, అక్టోబరు 19

చంద్రబాబు తర్వాత ఎవరు.. ఈ ప్రశ్నకు టీడీపీలో అయితే ఆన్సర్ వెంటనే వస్తుంది నారా లోకేష్ అని..! మరి కూటమి ప్రభుత్వంలో ఎవరు..? అది చెప్పడం కొంచం కష్టం.. అయితే ఆ కష్టాన్ని ప్రధాని మోదీ ఈజీ చేస్తున్నారా.. ? నారా లోకేష్‌ను ఫ్యూచర్ లీడర్‌గా రెడీ చేస్తన్నారా..?ఏపీలో ఎన్నికలు కొత్త 'సన్‌రైజ్'ను తీసుకురావచ్చు, కానీ 'సన్ సెట్' కూడా జరుగుతుంది" అని మోదీ చంద్రబాబు, లోకేష్‌లను ఉద్దేశించి విమర్శించారు. ఇక్కడ సన్‌సెట్ అంటే నారా లోకేష్ రాజకీయ భవితవ్యం ఆ ఎన్నికలతో ముగిసిపోతుందన్నది మోదీ మాటల అంతరార్థం అదే నరేంద్రమోదీ .. అదే కర్నూలులో ఇప్పుడు ప్రధానిగా అధికారిక హోదాలో నారా లోకేష్ కు ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారు. అవసరానికి మించి ఎలివేషన్ ఇస్తున్నారు. చిన్నబాబుతో ప్రత్యేక సమావేశాలు.. ఆయన్ను ప్రత్యేకంగా పొగడటాలు.. ట్వీట్‌లలో ప్రత్యేక ప్రస్తావనలు..వీటన్నింటి ద్వారా ప్రధాని మోదీ నారా లోకేష్ ఫ్యూచర్ లీడర్ అన్న సంకేతాలు ఇస్తున్నారా..?ప్రస్తుతానికి ఇది అప్రస్తుతమే కానీ? ఓ చర్చ అయితే పార్టీలో నడుస్తుంటుంది కదా.. టీడీపీలో అయితే దీనిపై పెద్దగా ఆలోచించడానికేం ఉండదు.. చంద్రబాబు తర్వాత లోకేషే.. ! అయితే పార్టీలో పొజిషన్ కాకుండా.. ప్రభుత్వంలో పొజిషన్ గురించి మాట్లాడుకున్నప్పుడు దీనికి ఆన్సర్ చెప్పడం అంత సులభం కాదు. పైగా చంద్రబాబు యాక్టివ్‌గా ఉన్నంత కాలం ఆయన నాయకత్వమే ఉండే అవకాశం ఉంటుంది. ఏపీలో బీజేపీ మైనర్ పార్టీ కాబట్టి.. ఈ కూటమిలో కీలకంగా ఉన్న జనసేన, బాగా పాపులారిటీ ఉన్న జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా లోకేష్ కు పోటీదారు అవుతారు. అయితే ఈ డిస్కషన్ రాకుండా చేసేందుకు రెండు పార్టీల నేతలు ఈ చర్చను రానివ్వరు. పైగా పవన్ కల్యాణ్ చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వంలో ఇంకో 15 ఏళ్లు ఉండాలని పలు సందర్భాల్లో చెప్పారు. లోకేష్ కూడా తన రాజకీయ భవితవ్యంపై చర్చ రాకుండా జాగ్రత్త పడతారు.. కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకారం జరిగిన విషయాన్ని గుర్తుచేసుకుంటే.. అప్పట్లో పవన్ కల్యాణ్‌కు ప్రధాని మోదీ ఇచ్చిన ప్రాధాన్యత తెలుస్తుంది. ప్రమాణ స్వీకార వేదికపై పవన్‌ను ప్రత్యేకంగా పక్కకు పిలవడం? ఆ తర్వాత అమరావతి 2.0 కార్యక్రమంలోనూ పవన్ కు ప్రాధాన్యత ఇవ్వడం? మరో సందర్భంలో ఆయన్ను పెనుగాలిగా అభివర్ణించారు. ఇప్పటికీ పవన్ కల్యాణ్ పట్ల ఆ ప్రత్యేకమైన అభిప్రాయం ఉంది. అయితే ఈ మధ్య కాలంలో లోకేష్ ఢిల్లీ స్థాయిలో రైజ్ అయ్యారు.

కూటమిలో కీలకంగా ఉన్నప్పటికీ జాతీయ స్థాయిలో మాత్రం లోకేష్ లో ప్రొఫైల్ మెయింటెయిన్ చేసేవారు. అయితే విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం తర్వాత లోకేష్ రేంజ్ పెరిగింది. గిన్నీస్ రికార్డ్ స్థాయిలో దాని నిర్వహణ విషయంలో లోకేష్ చూపిన చొరవను ప్రధాని గుర్తించారు. వేదిక మీదనే ప్రత్యేక స్థానాన్నిచ్చారు. ఆ తర్వాత వచ్చి తనను కలవాలంటూ పిలిచారు. ప్రధాని ఆహ్వానం మేరకు లోకేష్ కుటుంబంతో సహా వెళ్లి మోదీని కలిశారు. ఆయనతో కలిసి దాదాపు గంటన్నర సేపు డిన్నర్ మీటింగ్ చేశారు. అప్పటి నుంచే మోదీతో లోకేష్ అటాచ్‌మెంట్ పెరిగింది. ఆ తర్వాత లోకేష్ ఢిల్లీ వెళ్లడం కూడా పెరిగింది. చాలామంది కేంద్రమంత్రులను తరుచూ కలుస్తున్నారు. గుగూల్ ను విశాఖకు రప్పించడంతో ఆయన ఖ్యాతి అమాంతం పెరిగిపోయింది. ప్రధాని సహకారం లేకుండా ఇది జరిగే అవకాశం లేదు. యోగాంధ్ర సక్సెస్ గురించి ఆయన కేంద్ర కేబినెట్‌లో మాట్లాడారు. నిన్న కర్నూల్ పర్యటన తర్వాత.. ట్వీట్ చేసిన ప్రధానమంత్రి? ప్రత్యేకంగా లోకేష్‌ను మెన్షన్ చేశారు. దీనిని బట్టే ఆ ట్వీట్‌కు ఉన్న ప్రాధాన్యత తెలుసుకోవచ్చు. ప్రత్యేకంగా చెప్పడానికి లోకేష్ ఏమీ ముఖ్యమంత్రి కాదు కదా? లోకేష్‌కు ఆ స్థాయి ఎలివేషన్ ఇవ్వడానికి ప్రధానికున్న ప్రధానమైన కారణం ఏంటి. ఈ ఎన్నికల్లో అప్రతిహత విజయంతో కూటమి ఏపీలో తిరుగులేని స్థానంలో ఉంది కానీ.. 2019కి ముందు పరిస్థితి వేరు. ప్రధాని హోదాలో నరేంద్ర మోదీతో సహా.. బీజేపీ మొత్తం లోకేష్‌ను కూడా టార్గెట్ చేసింది. అంటే 2019కి ముందు నారా లోకేష్ పై ప్రధాని మోదీకి తీవ్రమైన వ్యతిరేకత భావం ఉంది. వారసత్వంగా వచ్చి ప్రజలపై పెత్తనం చేయాలనుకుంటున్నారని భావనకు వచ్చారు. సమర్థత ఉన్న వారసులను ప్రోత్సహించడానికి మోదీ వెనుకాడరు. కానీ ప్రజలపై బలవంతంగా రుద్దితేనే వ్యతిరేకిస్తున్నారు. లోకేష్ విషయంలో అప్పట్లో ఆయన అదే ఫీల్ అయ్యారని ప్రచారసభల్లోని మాటలను బట్టి అర్థమైపోతుంద ఆ తర్వాత ఐదేళ్లకు పరిస్థితులు మారాయి. 2024లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఈ కూటమి కట్టడంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపారని.. బీజేపీని టీడీపీని కలపడానికి తన వంతు కృషి చేశారని జనసేన నేతలు .. పవన్ కల్యాణ్ కూడా చెబుతుంటారు. దానికి తగ్గట్లుగా ప్రధాని ఆయనకు ప్రాధాన్యం కూడా ఇచ్చారు. "రాష్ట్రవ్యాప్తంగా 'సూపర్ జీఎస్టీ , సూపర్ సేవింగ్స్' ప్రచారాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ గారికి అభినందనలు తెలియజేస్తున్నాను. సృజనాత్మక పోటీల ద్వారా, యువతలో జీఎస్టీ పట్ల అవగాహన పెంచగలిగారు.." అని అభినందించారు. ప్రత్యేకంగా ట్వీట్ కూడా చేశారు. ఇటీవలి కాలంలో ప్రధాని మోదీ .. నారా లోకేష్ పై ప్రత్యేకమైన అభిమానం చూపిస్తున్నారు. వ్యక్తిగత అంశాలపైనా సలహాలు ఇస్తున్నారు. కర్నూలులో



హెలికాప్టర్ వద్ద ఆహ్వానం పలికినప్పుడు బాగా బరువు తగ్గావు అని లోకేష్‌ను అభినందించారు. లోకేష్ పై ప్రధాని మోదీ.. కూటమిలో పార్టీ నేత అయినందునే అభిమానం చూపిస్తున్నారని అనుకోలేము. వారసుడు అనే వ్యతిరేకతను మోదీ తుడిచేసుకున్నారని ఆయన సామర్థ్యాన్ని గుర్తించారని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. చంద్రబాబు తర్వాత లోకేష్ నాయకత్వాన్ని అన్ని రకలుగా మోదీ గుర్తిస్తున్నారా అన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. జరుగుతన్న సంఘటనలు దానిని బలపరుస్తున్నాయి కూడా..,!ఇక్కడ ఇంకో విషయం జాగ్రత్తగా చూడాలి. పొత్తులతో పార్టీలను నడుపుతున్నప్పుడు.. మిత్రుల మనోభావాలను పట్టించుకోవాలి. పవన్ కల్యాణ్ నిర్ద్వందంగా చంద్రబాబు నాయకత్వాన్ని సమర్థిస్తున్నారు. ఇంకో 15 ఏళ్లైనా ఆయన నేతృత్వంలో పనిచేయడానికి సిద్ధమే అన్నట్లు మాట్లాడుతున్నారు. పవన్ కల్యాణ్ అలా అంటున్నారుని కానీ.. ఆయన పార్టీ క్యాడర్ మాత్రం ఆయన్ను ఎప్పుడు సీఎంగా చూద్దామా అన్న ఆతృతలో ఉంది. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు వారికి నచ్చడం లేదు కూడా .. ఇక్కడ ఇంకో విషయం జాగ్రత్తగా చూస్తే.. పవన్ చంద్రబాబు నాయకత్వాన్ని అన్నారు కానీ.. టీడీపీ నాయకత్వం అనలేదు. అంటే టీడీపీలో ఎవరైనా అని చెప్పలేదు. అదే సమయంలో లోకేష్‌పైన వ్యతిరేకత కూడా వ్యక్తం చేయలేదు. ఆయనతో చాలా సోదర, సుహృద్భావ రిలేషన్‌ను కొనసాగిస్తున్నారు. అంతేకాదు.. మరికొన్ని మంత్రిత్వ శాఖలను లోకేష్ నిర్వహించగలరు అని చెప్పడం ద్వారా ఆయన కూడా లోకేష్‌కు ఎలివేషన్ ఇస్తున్నట్లే అనుకోవచ్చు. ప్రస్తుతానికి అమరావతి, పోలవరం, విశాఖ ఆర్థిక రాజధాని, రాయలసీమ ఇండస్ట్రియల్ కేపిటల్ అనే స్పష్టమైన ఫోకస్‌తో కూటమి నడుస్తోంది. చంద్రబాబు నాయకత్వం విషయంలో కూటమిలో వాళ్లకు ఇసుమంతైనా వ్యతిరేకత లేదు. కాకపోతే.. ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనలు.. ప్రధాని స్థాయి వాళ్లు స్పందనలు లోకేష్ ప్రాధాన్యతను పెంచాయి. అందుకే ఆయన ఫ్యూచర్ లీడర్ అనే చర్చకు దారితీశాయి.

## నల్గోండలో బస్సులు బంద్

నల్గోండ అక్టోబరు 19

బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బంద్ కొనసాగుతుంది. శనివారం ఉదయాన్నే అన్ని ఆర్టీసీ బస్సు డిపోల ముందు బీసీ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టడంతో ఒక్క ఆర్టీసీ బస్సు కూడా రోడ్లమీదకి రాలేదు. దీంతో పలుచోట్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు వ్యక్తిగత వాహనాలతో రోడ్లమీదకు వచ్చిన వాహనదారులను నకిరేకల్ బైపాస్ రోడ్డులో టిఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఈ కారణంగా చాలాసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నిరసనకారులు హైవే మీద టైర్లను వేసి కాల్చివేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు.

## హోటళ్లపై కమ్యూనిస్టుల ప్రతాపం

కరీంనగర్ అక్టోబరు 19

కరీంనగర్ లో ఓపెన్ చేసిన హోటళ్ళ పై కమ్యునిస్టులు తమ ప్రతాపం చూపారు. బస్ స్టాండ్ సమీపంలోని కల్పన హోటల్, శ్వేతా హోటల్లో సిపిఐ కార్యకర్తలు ప్లేట్లు పగలగొట్టి సామాగ్రిని కింద పడేసారు. బలవంతంగా బంద్ చేయించారు.

## చెరువులో మహిళ మృతదేహం లభ్యం

సిద్దిపేట అక్టోబరు 19

ములుగు మండలం తునికిబొల్లారం అయ్యప్ప చెరువులో అనుమానాస్పద స్థితిలో మహిళా మృత దేహం లభ్యం అయింది. మృతురాలు వర్గల్ మండలం మీనాజీ పేట్ కి చెందిన మంకని బాలమణి(50) గా గుర్తించారు పోలీసులు. నల్లటి కవర్ తో కప్పి ఉన్న మృత దేహం ను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హత్య చేసి చెరువులో పడవేసినట్లుగా అనుమానిస్తున్నారు. ములుగు ఎస్సై విజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

=============================

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బంద్

కరీంనగర్ అక్టోబరు 19

శనివారం వేకువజామున్నే రోడ్లపైకి వచ్చిన బీసీ సంఘాలు, కాంగ్రెస్ వామపక్ష పార్టీల నేతలు బంద్ నిర్వహించారు. బంద్ సందర్భంగా 11 డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు కదలలేదు. బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పలేదు. వేములవాడ లో బైక్ పై తిరుగుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బంద్ ను పర్యవేక్షించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకై బంద్ కు సహకరించాలని వర్తక వ్యాపార సంస్థలను ఆది శ్రీనివాస్ కోరారు. వ్యాపార సంస్థలు, హోటళ్ళు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. అత్యవసర సేవలు మినహా అన్ని బంద్ అయ్యాయి. కరీంనగర్ బస్ స్టేషన్ వద్ద ఇన్ గేట్, ఔట్ గేట్ వద్ద కాంగ్రెస్ వామపక్ష పార్టీల నాయకులు బైఠాయించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేసారు.

## నవీన్ యాదవ్ విజయం ఖాయం

హైదరాబాద్అక్టోబరు 19

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 50 వేల మెజార్టీతో గెలవడం ఖాయమని పీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. పార్టీ విజయానికి రేపటినుండి జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించనున్నట్టు ఆయన ప్రకటించారు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద శాతం అమలు చేసి తీరుతామని ఆయన అన్నారు నియోజవర్గానికి చెందిన పార్టీ యువ నాయకుడు శివ చౌదరి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం రాత్రి కేపీహెచ్బీ కాలనీ ఫోర్త్ ఫేస్ లో పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ఇన్చార్జి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై శివ చౌదరికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు అభినందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవస్థలను ధ్వంసం చేసి అభివృద్ధి అన్నది లేకుండా చేశారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు వీరందరికీ రమేష్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ రిజర్వేషన్ కు తాము కట్టుబడి ఉన్నామన్నారు బీసీ బంధుకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు.

# డ్రోన్ హబ్ గా కర్నూలు

కర్నూలు, అక్టోబరు 19



కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో 300 ఎకరాల్లో ఈ డ్రోన్ హబ్ ఏర్పాటు కానుంది. ఇక్కడ విమానశ్రయం, ఫ్లై జోన్ ఉండటం కారణంగానే ప్రభుత్వం ఓర్వకల్లులో ఈ హబ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. అయితే, అందరూ అనుకున్నట్లు ఇది కేవలం డ్రోన్ తయారీ కేంద్రం కాదు. ఇది డ్రోన్‌కు సంబంధించి అన్ని విషయాలకు సమగ్ర కేంద్రంగా నిలవనుంది. ఈ హబ్‌లోనే తయారు చేస్తారు. తయారు చేసిన డ్రోన్లను అన్ని విధాలా పరీక్షించే సదుపాయాలు కల్పిస్తారు. అంతే కాకుండా, వివిధ రకాల సాంకేతికతలను కలబోసి కొత్త తరం డ్రోన్ల తయారీ కోసం పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాలను ఈ డ్రోన్ హబ్‌లో ఏర్పాటు చేస్తారు. దీంతో పాటు డ్రోన్ల మరమ్మతులు స్టేషన్స్ ఉంటాయి. ఇక డ్రోన్లకు అవసరమైన సర్టిఫికేషన్ (ధృవీకరణ) వంటి సదుపాయాలన్నీ ఇక్కడ లభిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్ అందించడమే ఈ డ్రోన్ హబ్ ముఖ్య లక్ష్యం. కర్నూలులోని ఓర్వకల్లులో ఏర్పాటు చేసే డ్రోన్ హబ్‌కు ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే, ప్రపంచంలోనే అతిపెద్ద కామన్ డ్రోన్ టెస్టింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇది తయారయిన డ్రోన్ల నాణ్యతకు హామీకి, సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుంది. ఇక్కడ డ్రోన్లను తయారు చేయడమే కాదు. వీటిని ఆపరేట్ చేసే డ్రోన్ పైలట్‌లు, టెక్నీషియన్లు, ఇంజనీర్లను తయారు చేయడానికి శిక్షణా అకాడమీలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు నెలకొల్పుతారు. దీని ద్వారా పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఓర్వకల్లు ప్రాంతం కర్నూలు విమానాశ్రయం, జాతీయ రహదారులకు అనుకూలంగా ఉండటమే కాకుండా, హైదరాబాద్–బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు దగ్గరగా ఉండటం వల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా అనుకూలంగా ఉంటుంది. డ్రోన్ హబ్ ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోనున్నాయి.

కర్నూలులో ఈ డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలవుతుంది. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన డ్రోన్ పాలసీ ద్వారా సుమారు వేయి కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రానున్న ఐదేళ్లలో దాదాపు 3 వేల కోట్ల రాబడి వస్తుందని అంచనా. అయితే, ఈ డ్రోన్ సిటీలో ఇప్పటికే డ్రోన్ రంగంలో మంచి పేరున్న సంస్థ గరుడ ఏరోస్పేస్ వంద కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. డ్రోన్ల తయారీ, మరమ్మతులకు సంబంధించిన డ్రోన్–యాజ్–ఎ–సర్వీస్ అందించే అనేక దేశీయ, విదేశీ కంపెనీలను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. దీంతో అనేక దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ పెట్టుబడులను ఈ డ్రోన్ సిటీలో పెట్టేందుకు చర్చలు ప్రారంభించాయి.

పెరగనున్న ఉపాధి అవకాశాలు

డ్రోన్ హబ్ ద్వారా భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగానూ 40 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవచ్చని అంచనా వేస్తున్నారు. అంతే కాకుండా, ఇక్కడ ఏర్పాటు చేసే నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా 25 వేల మందికి డ్రోన్ పైలట్‌లుగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున యువతకు ఉపాధి లభిస్తుందని ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు.

# వైజాగ్ లో రహేజ పెట్టుబడులు

విశాఖపట్టణం, అక్టోబరు 19

విశాఖలో ఇదివరకే గూగుల్, టీసీఎస్ డేటా సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాయి. పలు కొత్త సంస్థలు, ఐటీ కంపెనీలు నగరానికి వస్తే త్వరలోనే విశాఖ రూపురేఖలో మారనున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ నిర్మాణ సంస్థ కె.రహేజా కార్పొరేషన్ విశాఖలో ఇన్వెస్ట్ చేయడానికి నిర్ణయం తీసుకుంది. విశాఖలో త్వరలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లు, ఐటీ సంస్థలకు అవసరమైన వాణిజ్య, నివాస భవనాల సముదాయాలు నిర్మించేందుకు రహేజా సంస్థ పెట్టుబడులు పెట్టనుంది. దీని ద్వారా దాదాపు 28.65 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి వస్తుందిఈ ప్రాజెక్టు విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి, ఉత్పాదకత పెరుగుదలకు, అలాగే ఉద్యోగ అవకాశాలు సృష్టించడానికి వీలుంటుంది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ రూ.2,172.26 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. మధురవాడ ఐటీ హిల్ నంబరు–3లో 27.10 ఎకరాలు భూమిని ప్రాజెక్టు కోసం కేటాయించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 9,681 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని రహేజా సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనలో పేర్కొంది. విశాఖలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఇటీవల ఢిల్లీలో సంస్థ ప్రతినిధులతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. గూగుల్ సంస్థ ఏపీలో ఏకంగా 1.33 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ప్రాజెక్టు ప్రారంభంతో పలు ఐటీ, దాని అనుబంధ సంస్థలు నగరానికి రాబోతున్నాయి. ఈ సంస్థల ఏర్పాటుకు ఆఫీసు స్థలాలు కావాలి. ప్రస్తుతం మిలీనియం టవర్ 1, 2లో సుమారు 6 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలం టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలకు కేటాయించారు. విశాఖకు కొత్తగా రాబోతున్న కంపెనీలకు కార్యాలయ స్థలాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రహేజా సంస్థ చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 28.65 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఆఫీసు కార్యాలయాల కోసం అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టు విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి, ఉత్పాదకత పెరుగుదలకు, అలాగే భారీ ఉద్యోగ అవకాశాలు సృష్టించడానికి దోహదపడనుంది. మొదటి దశలో 2028 నాటికి వాణిజ్య భవనాలను, నివాస సముదాయాలను 2030 నాటికి పూర్తి చేయాలని రహేజా సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టు పనుల కోసం రూ.663.42 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఫస్ట్ ఫేజ్ ప్రాజెక్టు పనులతో 9.59 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి రానుందిరెండో దశలో 2031 నాటికి వాణిజ్య భవనాలను, 2035 నాటికి నివాస సముదాయాలను పూర్తిచేసేందుకు రహేజా సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రెండో దశలో రూ.1,418.84 కోట్లు వెచ్చించనుంది. తద్వారా 19.06 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి తెస్తామని సంస్థ ఏపీ ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనల్లో పేర్కొంది.

# అమెరికాకు భారీగా తగ్గిన ఎగుమతులు

హైదరాబాద్, అక్టోబరు 19

ఒకప్పుడు అమెరికా ప్రయాణం అంటే ఎంతో ఇష్టపడిన వారు.. ఇప్పుడు భయపడి పోతున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాల భయంతో అక్కడికి వెళ్లి ఎందుకు చాలామంది నిరాసక్త వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే భారత్ నుంచి ఎగుమతి అయ్యే వస్తువులపై 50% టాక్స్ విధించినట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ టాక్స్ బాధ ఎందుకు అని.. కొందరు ఎగుమతులు చేయడం లేదు. ఇందులో భాగంగా గత ఏడాది కంటే ఇప్పుడు ఎగుమతుల శాతం భారీగా పడిపోయింది. భారత్ నుంచి అమెరికాకు ఆభరణాలు, ఔషధ ఉత్పత్తులు, టెక్స్టైల్ అండ్ గార్మెంట్లు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, వ్యవసాయ ఆహార ఉత్పత్తులు వంటివి ఎగుమతి అవుతూ ఉంటాయి. అయితే గత ఏడాది కంటే ఇప్పుడు ఎంతవరకు తగ్గింది? అనేది తెలుసుకుందాం..2024 సంవత్సరంలో భారత్, అమెరికాల మధ్య 79.44 మిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగినట్లు సమాచారం. అయితే గత ఏడాది కంటే ఇప్పుడు అమెరికాకు ఎగుమతుల శాతం తగ్గినట్లు తెలుస్తోంది. 2024 ఆగస్టు నెలలో భారత్ నుంచి అమెరికాకు 6.86 మిలియన్ డాలర్లు ఉండగా.. 2025 ఆగస్టు నెలలో 6.86 డాలర్లు కొనసాగింది. అయితే ఎగుమతుల శాతం గత ఏడాది కంటే ఇప్పుడు 7.15 శాతం పెరిగింది. 2024 సెప్టెంబర్ నెలలో భారత్ నుంచి అమెరికాకు 5.46 బిలియన్ డాలర్లు ఉండగా.. 5.46 బిలియన్ డాలర్గా నమోదయింది. అయితే గత ఏడాది సెప్టెంబర్ తో పోలిస్తే ఈ ఏడాది సెప్టెంబర్ 11.7 శాతం ఎగుమతులు తగ్గాయి. ఆగస్టు 27 నుంచి డోనాల్డ్ ట్రంప్ ఎగుమతులపై 50 శాతం సుఖాలు విధించిన నేపథ్యంలో ఎగుమతుల శాతం తగ్గిపోయింది. భారత్ నుంచి అమెరికాకు అనేక రకాల వస్తువులు ఎగుమతులు అవుతూ ఉంటాయి. భారత ఔషధ కంపెనీలో సుమారు 40 శాతం వరకు అమెరికాకే వెళ్తాయి. అమెరికా రిటైల్ మార్కెట్లో భారత టెక్స్టైల్ కు స్థిరమైన డిమాండ్ ఉంది. అందుకే ఇక్కడ ఉత్పత్తి అయిన రెడీమేడ్ వస్త్రాలు, కాటన్, సిల్కు ఉత్పత్తులు ఎక్కువగా అమెరికాకు వెళ్తుంటాయి. అలాగే భారతదేశానికి చెందిన ఇన్ఫోసిస్, టిసిఎస్, విప్రో వంటి సంస్థలు అమెరికా కంపెనీలకు భారీగా సేవలు అందిస్తూ ఉంటాయి. సాఫ్ట్వేర్ తో పాటు ఐటీ కన్సల్టింగ్ సేవలను కూడా అమెరికా వినియోగించుకుంటుంది. ఇక భారత్లో ఉత్పత్తి అయిన ఆటోమొబైల్ భాగాలు, యంత్రాలు, విద్యుత్ పరికరాలు అమెరికాకు ఎక్స్పోర్ట్ అవుతూ ఉంటాయి. భారత్ వ్యవసాయ ఆధారిత దేశం అని తెలిసిన విషయమే. దీంతో ఇక్కడ ఉత్పత్తి అయిన వ్యవసాయ ఆధారిత వస్తువులు అమెరికాకు ఎక్కువగా వెళుతుంటాయి. వీటిలో బాస్మతి బియ్యం, మసాలాలు, మిరియాలు, టీ కాఫీ వంటి వాటితోపాటు సముద్రపు చేపలు, ఫ్రాన్స్ ఎక్కువగా ఎక్స్పోర్ట్ అవుతూ ఉంటాయి. అలాగే మొబైల్ భాగాలు, సర్క్యులేట్ బోర్డులు కూడా అమెరికా భారత్ నుంచి తెప్పించుకుంటుంది. అయితే భారత్కు చెందిన అన్ని వస్తువులపై అమరిక 50% సుంకాలు విధించిన తర్వాత వీటి ఎగుమతులు తగ్గిపోయాయి.

## నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ లో స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహణ....

నంద్యాల అక్టోబరు 19

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ప్రతీ మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “స్వచ్ఛ్ ఆంధ్ర– స్వచ్ఛ్ దివస్” కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఐపిఎస్ ఆదేశాలమేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ లు సర్కిల్ ఆఫీస్ ఎస్ డి పి ఓఆఫీసుల యందు మరియు హెడ్ క్వార్టర్ నందు గల జిల్లా పోలీస్ కార్యాలయ పరిసరాలు,మోటర్ వెహికల్ విభాగం, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కార్యాలయాలు, ఆయుధ విభాగం, కాన్ఫరెన్స్ హాల్ పరిసరాలు, డి సి ఆర్ బి, స్పెషల్ బ్రాంచ్, పాస్పోర్ట్ కార్యాలయం, సైబర్ క్రైమ్ కార్యాలయం ఇలా అన్ని విభాగాల నందు గల సిబ్బంది ఈ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. పారలు, గుణపం చేతపట్టి పిచ్చి మొక్కలను తొలగించి చిన్న చిన్న గుంతలు పూడ్చారు. మన ఇల్లు లాగానే మన కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ను పరిశుభ్రపరచడంలో సహాయ పడుతుందని నమ్ముతూ నేటి నుండి నాతోటి వారికి స్వచ్ఛతపై అవగాహన కల్పించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు.

# ప్రతీ పనికి ఓ రేటు... ఆ జిల్లాకే సపరేట్...

## దొరకని దొరలు చాలా శాఖల్లో అనేక మంది..?

కాకినాడ, అక్టోబరు 19 కోనసీమ జిల్లాల పునర్విభజన తరువాత వేగంగా అభివృద్ధి చెందుతోంది కోనసీమ ప్రాంతం.. ఈక్రమంలోనే ఇక్కడ భూముల రేట్లకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి.. దీంతో ముఖ్యంగా రెవెన్యూ శాఖలో లంచావతారాలు మితిమీరిపోయి ఆర్జీదారుల నుంచి దండుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. వీఆర్ఏ స్థాయి నుంచి తహసీల్దార్ స్థాయి వరకు అన్నిచోట్ల లంచాలు లేనిదే ఏ పని అవ్వడం లేదంటున్నారు దరఖాస్తుదారులు. అటు జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాంతాలు ఇప్పడిప్పుడే అభివృద్ధి అవుతుండగా ఈ గ్రామాల పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు కూడా ఇదే తరహా అవినీతి లీలలు సాగిస్తున్నారంటున్నారు. ఇక జిల్లా కేంద్రమైన అమలాపురం టౌన్ ప్లానింగ్, అర్బన్ డెవలప్‌మెంట్, రూరల్ డెవలప్‌మెంట్ ఇలా అనేక శాఖల్లో అవినీతి జోరందుకుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి బలం చేకూరుస్తూ ఇటీవల కాలంలో ఒక్క అంబేడ్కర్ కోనసీమ ప్రాంతంలోనే ఏసీబీ అధికారుల దాడుల్లో అడ్డంగా బుక్కయిపోతున్నవారు కోనసీమ ప్రాంతం వారే ఉండడం విస్మయానికి గురిచేస్తోంది. ఏసీబీ అధికారులు వలకు ఓ పెద్ద అవినీతి చేప చిక్కింది. అమలాపురం తహసీల్దార్ గా పనిచేస్తున్న పి.అశోక్ ప్రసాద్ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికి పోయాడు.. రాజమండ్రి సమీపంలోని రాజవోలుకు చెందిన గంథం దుర్గా కొండలరావు తండ్రి గంథం సత్యనారాయణ అమలాపురం రూరల్ జనుపల్లిలో 15 సెంట్లు భూమిని గతంలో కొనుగోలు చేశారు. ఈ భూమిని విక్రయించేందుకు కొలతలు అవసరం కాగా దీని నిమిత్తం దుర్గా కొండల రావు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే కొలతలు నిర్వహించాలంటే రూ.లక్ష ఇవ్వాలంటూ తహసీల్దార్ డిమాండ్ చేశాడు. చివరకు రూ.50 వేలు ముందస్తుగా ఇవ్వాలని, కొలతలు పూర్తయ్యాక మిగిలిన రూ.50 వేలు ఇవ్వాలని సూచించడంతో లంచం ఇవ్వడం ఇష్టంలేని ఫిర్యాదుదారుడు దుర్గా కొండలరావు రాజమండ్రి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.

దుర్గా కొండలరావు నుంచి ఇదే తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తోన్న వీఆర్ ఏ రాము రూ.50 వేలు తీసుకుని తహసీల్దార్ అశోక్ ప్రసాద్‌కు ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా ఇద్దరూ దొరికి పోయారు. లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్ అశోక్ ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ రాముపై కేసు నమోదు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ కిషోర్ కుమార్ తెలిపారు. ఈ విషయం స్థానికంగా పెద్ద సంచలనం అయ్యింది.. లంచాలకు రుచి మరిగిన అవినీతి అధికారుల్లో వణుకు మొదలయ్యింది.. ఇటీవల కాలంలోనే తనకున్న పొలాన్ని మ్యుటేషన్ చేసి ఇచ్చేందుకు ఉప్పలగుప్తం మండలం చల్లపల్లికి చెందిన ఓ రైతు నుంచి అదే గ్రామ వీఆర్వోగా పనిచేస్తున్న వీఆర్వో రూ.20 వేలు డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేను. ఎంతో కొంత ఇస్తాను అని చెప్పినా రేపు రా.. మాపు రా.. అంటూ కాలం గడుపుతున్న వీఆర్వోపై విసుగెత్తని సదరు ఫిర్యాదుదారుడు రాజమండ్రి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సదరు వీఆర్వో తన స్వగ్రామం అయిన సామంతకుర్రు తీసుకువచ్చి లంచం ఇవ్వాలని డిమాండ్ చేయడంతో నేరుగా ఏసీబీ అధికారులు ఫిర్యాదుదారుడ్ని తీసుకుని వెళ్లి లంచం ఇస్తున్న సమయంలో అడ్డంగా బుక్ చేశారు.రెండు నెలల క్రింతం ఆలమూరు మండలంలో మహిళా సబ్ రిజిస్టర్ ఒకరు ఇలానే లంచం సొమ్ము తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా బుక్కయ్యాడు. మూడు నెలల క్రితం రావులపాలెం పోలీస్ స్టేషన్‌లో సీఐ, అంతకుముందు ఏడాది క్రితం ఎస్సై ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. రాజోలు నియోజకవర్గం పరిధిలోని సఖినేటిపల్లిలో వీఆర్వో రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని కాట్రేనికోన మండలంలో ఓ వీఆర్వో లంచం సొమ్ము తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కాడు.. ఇలా మొత్తం మీద అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రాంతంలో వరుసగా లంచావతరాలు దొరికిపోవడం చర్చనీయాంశం అవుతోంది.. లంచం ఇస్తేనే కానీ ఫైల్‌ను పక్కకు కూడా జరపని లంచావతరాలు ప్రభుత్వ శాఖలో తిష్టవేసుకుని ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.. అందులోనూ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా ఏర్పడ్డాక భూముల రేట్లు ఆకాశంలోకి ఎగబాకడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పన విషయంలోనూ అభివృద్ధి పథంగా ముందుకు వెళ్తున్న పరిస్థితి కనిపిస్తోందని, ఈక్రమంలోనే అవినీతివైపు ప్రభుత్వ ఉద్యోగులు అర్రులు చాస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో అయితే కొంతమంది రెవెన్యూ శాఖలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పట్టణంలోని టౌన్ ప్లానింగ్ శాఖ అధికారులు, కొంతమంది సబ్ రిజిస్ట్రార్ ఇలా భూ సంబందిత వ్యవహారాలు చూసే శాఖల్లోని అధికారులు చాలా మంది లంచాల సొమ్ముకు అలవాటు పడి ప్రతీ పనిలోనూ బల్లకింద చేయిచాపే పరిస్థితి కనిపిస్తోందంటున్నారు.

# రేవంత్‌కు అగ్ని పరీక్ష

హైదరాబాద్, అక్టోబరు 19

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ జోరు పెంచింది. అధికారంలో ఉన్నాం కాబటి తమ ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. హస్తం పార్టీకి ఇది సామాన్య పోరు కాదు, స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టకు సంబంధించిన యుద్ధరేఖగా రూపుదిద్దుకుంది. పార్టీ అంతర్గత విభేధాలు, అసంతృప్తిని కట్టడి చేసిన రేవంత్ ఈ ఎన్నికను నాయకత్వ సమర్థతకు నిదర్శనంగా చూపించాలని భావిస్తున్నారు.రేవంత్‌రెడ్డి "ఎట్టి పరిస్థితుల్లోనూ గెలుస్తాం" అన్న ధీమాలో ఉన్నా, పార్టీ లోపల కొంత అనిశ్చితి స్పష్టంగా ఉంది. ఆయన రాజకీయ చాణక్యంతో తాత్కాలికంగా విభేదాలను అణగదొక్కారు. కానీ ఓటమి సంభవిస్తే, ఆ అసంతృప్తులు మళ్లీ



తలెత్తే అవకాశం ఉంది. జూబ్లీహిల్స్ ఫలితం ప్రతికూలంగా వస్తే, దానిని ఆధారంగా చేసుకుని అంతర్గత వర్గాలు రేవంత్ నాయకత్వంపై ప్రశ్నలు లేపే సూచనలు ఉన్నాయి.ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి రేవంత్‌రెడ్డికి ధైర్యం రాలేదని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించగలిగితే మాత్రమే ఆయన రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు మార్గం సుగమమవుతుందని భావిస్తున్నారు. వీటిలో రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ పరికరంగా ఉపయోగించే వ్యూహం కూడా దృష్టిలో పెట్టుకున్నారు. ఈ ఉపఎన్నికలో కాంగ్రెస్ బీసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దింపింది. అదే సమయంలో ఎంఐఎం పార్టీ పూర్తి సహకారం ఇవ్వడం కాంగ్రెస్ లెక్కల్లో కీలక పాత్ర పోషిస్తోంది. "బీసీ ప్లస్ ముస్లిం మైనారిటీ కాంబినేషన్ ప్లస్ అధికారం" అనే రేవంత్ వ్యూహం జూబ్లీహిల్స్‌లో ఎన్నికా సమీకరణాన్ని మార్చగలదని ఆయన విశ్వసిస్తున్నారు. ఈ రెండు వర్గాలు చురుకుగా మద్దతిస్తే వైపు కాంగ్రెస్‌కే లాభమని పార్టీ అంచనా.బీఆర్ఎస్ ఇప్పటికే తన అభ్యర్థిని ప్రకటించినా, ఆ అభ్యర్థికి పెద్దగా ప్రజా స్పందన లభించకపోవడంతో ఆ పార్టీ యంత్రాంగం నిశ్శబ్దంగా ఉంది. భాజపా మరింత ఆలస్యంగా అభ్యర్థిని ప్రకటించడం వల్ల, తమ వద్ద బలమైన నాయకత్వం లేకపోవడానికే సంకేతమని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. ఈ రెండు పార్టీలు మౌనంగా ఉండటమే కాంగ్రెస్‌కు దూకుడు పెంచే అంశంగా మారింది.జూబ్లీహిల్స్‌లో విజయం సాధిస్తే రేవంత్‌రెడ్డి నాయకత్వం మరింత బలపడుతుంది. అదే ఓటమి వస్తే అంతర్గత వ్యతిరేక శక్తులు తిరిగి మేల్కొని, ఆయన అధికార కుర్చీని సవాలు చేసే అవకాశం ఉంది. అందుకే ఈ ఉపఎన్నిక ఫలితం కేవలం నియోజకవర్గ స్థాయి వ్యవహారం కాదు రాష్ట్ర కాంగ్రెస్ భవిష్యత్తును నిర్ణయించే మలుపు. జూబ్లీహిల్స్ ఓటు రేవంత్‌రెడ్డి వ్యక్తిగత నాయకత్వంపై ప్రజా తీర్పుగా మారబోతోంది. గెలిస్తే ఆయనకు కొత్త ఆరంభం, ఓడితే పార్టీ దిశను సవాలు చేసే మలుపు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర-స్వచ్ఛమైన గాలి కార్యక్రమం

శ్రీశైలం ప్రాజెక్ట్‌సుండీపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. పద్మా నాయకత్వంలో విద్యార్థిని, విద్యార్థులకు స్వచ్ఛమైన గాలి పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. అలాగే విద్యార్థినీ విద్యార్థులు మరియు అధ్యాపకులచే ప్రతిజ్ఞ చేయించారు, మొక్కలు నాటడం మరియు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె. రాజన్న, ఎస్. మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఎస్. శివ నాగిరెడ్డి, ఎస్. పూర్ణేశ్వర్ రెడ్డి, టి. ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ వై. కిరణ్ కుమార్, కుమారి షాహిదా, మీనాక్షి మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు

## పిడుగురాళ్లలో "స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర" ప్రతిజ్ఞ ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా హాజరు

పిడుగురాళ్ల, "స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర" "స్వచ్ఛమైన గాలి మనందరి హక్కు" అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించటం, వాతావరణ కాలుష్యం నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అనే కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంనికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా పాల్గొని జెండా ఊపి భారీ ర్యాలీని ఆర్ అండ్ బి బంగ్లా సెంటర్ నుండి ప్రారంభిచారు. అనంతరం ర్యాలీగా వెళ్లి స్థానిక ఐలాండ్ సెంటర్ లో "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం మీద ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో గురజాల రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) మురళి కృష్ణ, పిడుగురాళ్ల ఎమ్మార్వో మధుబాబు, పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పిడుగురాళ్ల రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ మోహన్ పాల్గొన్నారు.

# కొండాను కాపాడిన బీసీ నినాదం

వరంగల్, హైదరాబాద్, అక్టోబరు 19

తెలంగాణ దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వరుస వివాదాల్లో ఇరుక్కోవడం, తర్వాతా ఆ వివాదం సద్దుమణగడం కొంతకాలం నుంచి రివాజుగా మారింది. అయితే, మాజీ ఓఎస్టీ సుమంత్ వ్యవహారం ఆమె పదవీ గండం వరకు దారి తీసింది. సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వదవి నుండి సురేఖ ను తప్పించాలన్న గట్టి పట్టుదలతో ఉన్నారన్న వార్తలు వచ్చాయి. ఇదే పరిస్థితుల్లో కొండా సురేఖ ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ పిలిచి మాట్లాడడం జరిగింది. మాజీ ఓఎస్డీ సుమంత్ దక్కన్ సిమెంట్ ప్రతినిధులను గన్ పెట్టి బెదిరించారన్న ఆరోపణలు వచ్చాయి. ఇదే క్రమంలో సుమంత్ ను విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకునేందుకు టాస్క్ ఫోర్స్ పోలీసులు కొండా సురేఖ నివాసానికి రావడం, అక్కడ సురేఖ కుమార్తె సుష్మిత వారిని అడ్డగించడం జరిగింది. ఈ సందర్భంలో సుష్మిత సీఎం రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలు చర్చాంశనీయంగా మారాయి. గతంలోను సినీ ప్రముఖుడిపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, మంత్రులతోను, వరంగల్ జిల్లా నేతలతోను ఉన్న విబేధాలు కారణంగా ఆమెను పదవి నుండి తొలగిస్తారన్న ప్రచారం బాగా సాగింది. ఏకంగా తనపైన, తన కుటుంబ సభ్యులపైన క్యాబినెట్ మంత్రిగా ఉండి కొండా సురేఖ, ఆమెతో పాటు సుష్మిత ఎలా వాఖ్యలు చేస్తారని సీఎం ఇతర మంత్రుల వద్ద వాపోయినట్లు సమాచారం. ఏ చర్య తీసుకోకుండా ఉంటే అది తన సమర్థత పైన, తన విశ్వసనీయతపైన అది ప్రభావం చూపిస్తుందని హై కమాండ్ తో కూడా వాదించినట్లు తెలిసింది.హైకమాండ్ సైతం పలు మార్లు వివాదాల్లో కొండా సురేఖ పేరు వినపడటం తమకు తలనొప్పిగా ఉందన్న అభిప్రాయంలో ఉన్నట్లు గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. కొండా సురేఖ ఇంటి వద్ద భద్రత తగ్గించడం, ఆమె శాఖ ఫైళ్లన్నింటిని సీఎం తెప్పించారన్న వార్తలు వచ్చాయి. ఇక వేటు మంత్రి పదవి నుండి కొండా సురేఖ ను తొలగించడం ఖాయమన్న వార్తలు వచ్చాయి. అయితే ఆ తర్వాత సీన్ మారిపోయింది. కొండా వివాదం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ ల వద్దకు చేరింది. క్యాబిటెన్ మీటింగ్ ఉన్నప్పటికీ కొండా సురేఖను పార్టీ అధిష్టానం పిలిచి ఈ వివాదంపై చర్చించింది. ఈ వివాదాన్ని తాను హైకమాండ్ కే వదిలేస్తున్నానని, వారే దీన్ని పరిష్కరిస్తామని హమీ ఇచ్చినట్లు ఆ సమావేశం ముగిసాక మీడియా ముందు తెలిపింది. వేటు తప్పదన్న తరుణంలో కొండా సురేఖను రెండు కారణాలు కాపాడాయని తెలుస్తోంది.హిందుత్వ ఎజెండాతో బీ?జేపీ దేశంలో తన అధికారాన్ని సుస్థిరం చేసుకుంటుంటే, దానికి విరుగుడుగా కాంగ్రెస్ పార్టీ బీసీ నినాదం ఎత్తుకుంది. అందుకు తొలి ప్రయోగ శాల తెలంగాణ రాష్ట్రం అయింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు చేపట్టింది. కోర్టుల్లో ఇది నానుతున్నా ప్రజల్లోకి మాత్రం బీసీ రిజర్వేషన్ల



అంశాన్ని పెద్ద ఎత్తును ఆ పార్టీ తీసుకెళ్తోంది. రానున్న రోజుల్లో జరిగే ఎన్నికల్లో ఈ బీసీ మంత్రం తమ పార్టీని కేంద్రంలోను, అధికారంలోను తీసుకువస్తుందన్న ఆశతో హస్తం నేతలు ఉన్నారు. ఈ క్రమంలో క్యాబినెట్ లో బీసీ మహిళా మంత్రి అయిన కొండా సురేఖను తొలగిస్తే పార్టీకి చెడ్డ పేరు వస్తుదన్న ఆలోచనతో రేవంత్ రెడ్డి పట్టుబట్టినా అధిష్టానం మాత్రం నో చెప్పినట్లు సమాచారం.బీసీ నినాదంతో కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా చర్చ లేవనెత్తుతుంటే క్యాబినెట్ లో ఉన్న బీసీ మహిళా మంత్రిని తొలగిస్తే అది మరింత వివాదం అవుతుందన్న ఆలోచనలో హైకమాండ్ పెద్దలు ఉన్నట్లు అర్థం అవుతుంది. కొండా సురేఖను తొలగిస్తే రాష్ట్రంలో అతిపెద్ద సామాజిక వర్గం బీసీలే. ఈ తొలగింపు వ్యవహారం వారికి పార్టీపై నెగిటెవ్ సంకేతాలు పంపుతుందన్న నిర్ణయానికి కాంగ్రెస్ పెద్దలు వచ్చినట్లు సమాచారం. కొండా సురేఖను పదవి నుండి తొలగిస్తే బీసీలపై ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అన్న విమర్శను బీసీ సంఘాల నుండి అటు ప్రతిపక్షాల నుండి ఎదుర్కోకక తప్పని పరిస్థితి వస్తుందన్న భయంతోనే కాంగ్రెస్ హైకమాండ్ రేవంత్ రెడ్డి పట్టుబట్టినా వద్దని వారించినట్లు సమాచారం.మరో వైపుఈ వివాదాన్ని ఇప్పటికే కొండా సురేఖ వర్గీయులు బీసీ వర్సెస్ రెడ్ల మధ్య పోరుగా అభివర్ణించడాన్ని కూడా అధిష్టానం దృష్టికి వచ్చి కొండా సురేఖపై ఎలాంటి చర్యకు పచ్చజెండా ఊపలేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. దాంతో పాటు మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రతీ చోట మాట్లాడుతోంది. అలాంటిది క్యాబినెట్ నుండి మహిళను తప్పించడం కూడా మహిళలకు తప్పుడు సంకేతాలు పంపుతుందన్న ఆలోచన పార్టీ పెద్దలు చేసినట్లు హస్తం ముఖ్య నేతలు చెబుతున్నారు. ఇన్ని మైనస్ పాయింట్లు ఉండటంతో ఈ వివాదానికి ప్రస్తుతం ఫుల్ స్టాప్ పెట్టాలని పార్టీ హైకమాండ్ సీఎం రేవంత్ కు, మంత్రి కొండా సురేఖకు సర్దిచెప్పినట్లు చెబుతున్నారు.బీసీ మంత్రి కావడం వల్ల కొండా సురేఖను పదవి నుండి తప్పించకపోవడానికి ప్రధాన కారణం అయితే, రెండో కారణం కొండా సురేఖ కుమార్తె సుష్మిత వ్యాఖ్యలు కూడా ప్రధాన కారణంగా మారింది. మాజీ ఓఎస్టీ సుమంత్ గన్ పెట్టి బెదిరించారన్న ఆరోపణలపై ఆమె మీడియా ముందు మాట్లాడుతూ ఈ వివాదంలోకి సీఎం రేవంత్ రెడ్డిని లాగడం ఇక్కడ కీలక మలుపుగా చెప్పవచ్చు. పోలీలుసులు చెబుతున్నట్లు సుమంత్ గన్ తో బెదిరించిన వ్యవహారం అంతా సీఎం సన్నిహితుడైన రోహిన్ రెడ్డి కార్యాలయంలోనే జరిగింది మీడియా ముందు చెప్పడంతో దీంట్లో సీఎం ను భాగస్వామ్యుడ్ని చెసినట్లయింది. సీఎం రేవంత్ రెడ్డినే గన్ ఇచ్చి పంపారు అన్న వ్యాఖ్యలు తెలంగాణ వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. అంతే కాకుండా సీఎం సోదరులు దందాలు చేస్తున్నారని, వారికి పోలీస్ భద్రత ఎందుకన్న సుష్మిత వ్యాఖ్యలు సీఎంను ఇరకాటంలో పడవేశాయి. అంతే కాకుండా ఢిల్లీలో తన తల్లిని పార్టీ అధ్యక్షుడు ఖర్గే ముందే అవమానించారని చెప్పడం కూడా కొన్ని వర్గాల్లో కొండా సురేఖకు సింపతీని అందిచాయి.సుమంత్ వ్యవహారం సాగదీసి విచారణ జరిపితే అక్కడ రోహిన్ రెడ్డి పైన కూడా విచారణ జరపాలన్న డిమాండ్ కొండా వర్గం నుండి రావచ్చు. ఇది రాజకీయంగా సీఎంకు ఇబ్బదికరంగా మారవచ్చు అన్న కారణంతో హై కమాండ్ కూడా దీన్ని ఇంతటితో వదిలేయాలని ఇరు వర్గాలకు చెప్పినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డే తన తల్లిపై కుట్రకు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించడంతో అటు ప్రజల్లోను సీఎం రేవంత్ వ్యవహారంపై ఆలోచించక తప్పని పరిస్థితి ఏర్పడింది. మరో వైపు మంత్రి పదవి నుండి తప్పించడానికి రెడ్డి మంత్రులు కుట్ర చేస్తున్నారన్న మరో ప్రధాన ఆరోపణ రాష్ట్రంలో కుల పంచాయతీకి తెరలేపినట్లయింది. ఇదే కాకుండా టెండర్ల విషయంలోను తమ వర్గానికి అప్పగించడంలో మంత్రులు జోక్యం చేసుకుంటున్నారన్న అంశాన్ని కూడా సుష్మిత మీడి?య ముందు చెప్పడం పార్టీకి ఇబ్బంది కలిగించేలా పరిణమించాయి. ఈ క్రమంలోనే కొండా సురేఖ మీడి?య ముందు మాట్లాడుతుందని సమాచారం బయటకు రాగానే దీన్ని ఇంతటితో ఆపకపోతే పార్టీకి చెడ్డపేరు రావడం ఖాయమన్న ఆలోచనలతో హైకమాండ్ రంగంలోకి దిగింది. పార్టీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ ఇరు వర్గాలకు సర్దిచెప్పి ప్రస్తుతానికి వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టడం జరిగింది.అయితే ఏది ఏమైనా కొండా సురేఖ వర్సెస్ సీఎం రేవంత్ రెడ్డి మధ్య తగాదా ప్రభుత్వంలోని లుకలుకలను బయటపెట్టింది. మంత్రుల మధ్య విబేధాలు ఈ వ్యవహారంతో రచ్చకెక్కాయి. అవినీతి, బెదిరింపులు జరుగుతున్నాయన్న మచ్చ కాంగ్రెస్ సర్కార్ పై పడింది. అయితే రానున్న కాలంలో ఈ వివాదాలు, సమస్యలకు రేవంత్ సర్కార్ ఎలా ముగింపు ఇస్తుందో వేచి

# బాత్ రూమ్ లైట్ లో కెమెరా అడ్డంగా చిక్కిన ఓనర్

హైదరాబాద్, అక్టోబరు 19

: హైదరాబాద్‌లో షాపింగ్ మాల్స్ ట్రైల్ రూమ్‌లో సీసీ కెమెరాలు పెట్టి అడ్డంగా దొరికిపోయిన ఘటనలు అనేకం, ఆ తరువాత లేడిసీ హాస్టల్స్ , కాలేజి హాస్టల్స్ బాత్ రూమ్ లో సైతం సీసీ కెమెరాలు పెట్టి బుక్కైన సందర్భాలు అనేకం. అయితే తాజాగా హైదరాబాద్ లో అద్దె ఇంటి ఓనర్లు కొందరు బరితెగించి, ఏకంగా టెనెంట్స్ బాత్ రూమ్ లో సీసీ కెమెరాలు పెడుతున్నారు. తాజాగా మధురానగర్ పీఎస్ పరిధిలోని జవహార్ నగర్ లో వెలుగు చూసిన ఘటన హైదరాబాద్ నగరంలో పెను సంచలనంగా మారింది. జవహార్ నగర్ లోని అశొ?క్ యాదవ్ అనే ఇంటి యజమాని తన ఇంట్లో అద్దెకు ఉంటున్నవారి బాత్ రూమ్ లో సీసీ కెమెరాలు అమర్చిన తీరు టెనెంట్స్ లో ఆందోళన కలిగిస్తోంది. జవహార్ నగర్‌లోని అశోక్ యాదవ్ అనే ఇంటి యజమాని తన ఇంట్లో అద్దెకు ఉంటున్న ఫ్యామిలీని టార్గెట్ చేశాడు. వారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లి బాత్ రూమ్ లో సీసీ కెమెరా పెట్టాలని ఫిక్స్ అయ్యాడు. భార్య భర్తలిద్దరూ ఉదయం ఉద్యోగాలకు వెళ్లి, సాయంత్రం ఇంటికి రావడం గమనించాడు. ఈనెల 4వ తేదీన బాత్ రూమ్ లో హోల్డర్స్ మార్చాలి కొత్త హోల్డర్స్ వేయాలంటూ చెప్పి , ఇంటి తాళం తీసుకున్నాడు అశోక్. బాత్ రూమ్ లో లైట్ లోపల సీసీ కెమెరా అమర్చేందుకు ఎలక్ట్రీషియన్ చింటూ సహాయం తీసుకున్నాడు. హోల్డర్ మార్చి, బోల్డర్ లోపల సీసీ కె?మెరా అమర్చారు. సీసీ కెమెరా అమర్చడంతో స్క్రూలు పట్టకపోవడంతో , చుట్టూ టేప్ వేశారు. ఒక్క స్క్రూ మాత్రం బిగించి వదిలేశారు. అలా బాత్ రూమ్ లో ఉన్న బల్బుకు అమర్చిన సీసీ కె?మెరాను ఫోన్ కు అనుసంధానం చేసి, బాత్ రూమ్ లో మహిళ స్నానం చేసే సమయంలో వీడియోలు ఫోన్ లో చూసేవాడు. అలా ఫోన్ లో చూసిన వీడియోలను రికార్డ్ చేసేవాడు. ఇలా బాత్ రూమ్ లో సీసీ కెమెరా ద్వారా అద్దెకు ఉంటున్న వివాహిత వీడియోలను గుట్టుచప్పుడు కాకుండా రికార్ట్ చేసేవాడు ఇంటి యజమాని అశోక్ యాదవ్.ఈనెల 4వ తేదీ నుంచి బాత్ రూమ్ బల్బులో సీక్రెట్ గా అమర్చిన సీసీ కెమెరా ద్వారా వీడియోలను ఎలక్ట్రీషియన్ చింటూకు సైతం షేర్ చేసేవాడని సమాచారం. ఇలా గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లో అద్దెకు ఉంటున్న వివాహిత వీడియోలను ఫోన్ చూస్తూ శునకానందం పొందేవాడు ఇంటి ఓనర్ అశోక్ యాదవ్. ఈనెల 13వ తేదీన బాత్ రూమ్ లో స్నానం చేస్తున్న సమయంలో సీసీ కెమెరా అమర్చిన బల్బు హోల్డర్ నుంచి లైట్ బ్లింక్ అవ్వడం గమనించిన టెనెంట్ ఫ్యామిలీ వెంటనే ఈ విషయాన్ని ఓనర్ కు చెప్పారు. ఇందులో సీసీ కెమెరా పెట్టినట్లు నాకు తెలియదు, ఎలక్ట్రీషియన్ చింటూను అడుగుతానిని చెప్పడంతో, అనుమానం వచ్చిన టెనెంట్ ఫ్యామిలీ షీటీమ్ ను ఆశ్రయించారు. షీటీమ్ రంగంలోకి దిగడంతో బాత్ రూమ్ కెమెరా బాగోతం వెలుగు చూసింది. ఇంటి ఓనర్ అశోక్ ను అదుపులోకి తీసుకున్న షీటీమ్ తమదైన స్టైల్ లో విచారిస్తున్నారు.కేసును మధురానగర్ పిఎస్ కు బదిలీ చేయడంతో ,కేసులో మరో నిందితుడు ఎలక్ట్రీషియన్ చింటూ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగి, మొత్తానికి పాత్రదారి చింటూని సైతం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాత్ రూమ్ లో సీసీ కెమెరా ద్వారా రికార్డ్ చేసిన వీడియోలను ఏదైనా వెబ్ సైట్ లో అప్ లోడ్ చేస్తున్నారా, వివాహిత ప్రైవేటు వీడియోలను ఏం చే?సేవారు అనే విషయాలనను రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు మధురానగరక్ పోలీసులు. ఇలా ఇంటి ఓనర్ కదా అని నమ్మి ఇంటి తాళాలు ఇస్తే ,ఏకంగా బాత్ రూమ్ బల్బులో సీసీ కెమెరాలు పెట్టిన తీరు అద్దెకు ఉండే కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తోంది.

# వాసన్ ఆసుపత్రిలో ప్రత్యేక డ్రైవ్

సికింద్రాబాద్.. అక్టోబరు 19

దీపావళి పండుగ అంటేనే టపాసుల మోత..అందులోనూ చిన్నారులు, పిల్లలు దీపావళి వేళ వివిధ రకాల టపాసులు పేలుస్తూ సందడిగా జరుపుకుంటారు. అదే సమయంలో జాగ్రత్తలు పాటించక కళ్లలో నిప్పురవ్వలు పడి చిన్నారులు,గాయాలపాలవుతుంటారు. దీపావళి పండుగ నేపథ్యంలో టపాసులు పేల్చే క్రమంలో 15 ఏళ్ల లోపు చిన్నారులకు కళ్లలో నిప్పురవ్వలు పడి గాయాలైతే ఉచితంగా కంటి చికిత్స అందించేందుకు ముందుకొచ్చి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సికింద్రాబాద్ వాసన్ కంటి ఆస్పత్రి వైద్యులు ఆశిష్ తెలిపారు. ఈనెల 15 నుండి 24 వరకు ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చిన్నారులకు చికిత్స అందించనున్నట్లు తెలిపారు. గత ఏడాది దీపావళి పండుగ సందర్భంగా కళ్లలో నిప్పురవ్వలు పడి గాయపడ్డ చిన్నారుల సంఖ్య గణనీయంగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మొదటిసారిగా ఇలాంటి ఉచిత కంటి చికిత్స చేస్తున్నామని, చిన్నారులు టపాసులు పెంచే క్రమంలో తప్పనిసరిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు.

## శబరిమలై పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని

సికింద్రాబాద్ అక్టోబరు 19

అయ్యప్ప స్వామి మాలధారణ ఎన్నో జన్మల పుణ్యఫలం అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ లోని గణేష్ టెంపుల్ వద్ద నుండి శబరిమల వరకు 120 మంది అయ్యప్పలు నిర్వహించే పాదయాత్ర ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ముందుగా ఆలయ పండితులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం వినాయకుడిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అయ్యప్ప స్వాముల పాదయాత్ర ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. గత 18 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం పాదయాత్ర గా శబరిమల కు వెళ్ళి అయ్యప్పస్వామి ని దర్శించుకోవడం జరుగుతుందని శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి పాదయాత్ర బృందం సభ్యుడు వెంకటేష్ యాదవ్ జాదవ్ తెలిపారు. నవంబర్ 23 వ తేదీన శబరిమల కు చేరుకుంటారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, ఆకుల హరికృష్ణ, నాగులు, ఓదెల సత్యనారాయణ, హన్మంతరావు తదితరులు ఉన్నారు.

==========================

## ట్రాఫిక్ పోలీసుల అవగాహనా కార్యక్రమం

సికింద్రాబాద్ అక్టోబరు 19

పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం ను పురస్కరించుకోని ప్రత్యేక అవగహన కార్యక్రమం ను ట్రాఫిక్ పోలీసులు నిర్వహించారు.ట్రాఫిక్ నియమ నిబందనలు,వాటిని పాటించకపోతే విదించె చాలన్ల తో పాటు,ట్రాఫిక్ విభాగంలో ఉపయోగించే పరికరాల పై ప్రత్యేక అవగహన కార్యక్రమంను సికింద్రాబాద్ బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్ స్ట్యూట్ లో నిర్వహించారు..వందలాది మందిగా విద్యార్ధిని విద్యార్ధులు ఈ అవగహన కార్యక్రమంలో పాల్గొనగా..ట్రాఫిక్ సిబ్బంది వారు వినియోగించే వాహనలు,ట్రాఫిక్ లెజర్ కెమెరాలు ,బాడి కెమెరాలతో పాటు చాలన్ జనరేట్ అయ్యే విధానం నుతెలియజేప్పారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకోని ఉన్నత అధికారుల ఆదేశాలతో ప్రత్యేకంగా ఈ కార్యక్రమంను నిర్వహించమని టిటిఐ ఎసిపి లక్ష్మణ్ తెలిపారు.

# ఏడాది నుంచి జీతాల కోసం ఎదురు చూపులు

ఖమ్మం, అక్టోబరు 19

దాదాపు ఏడాది నుంచి ప్రభుత్వం జీతాలు ఇవ్వకపోయినా గెస్ట్ లెక్చరర్లు అవేమి పట్టించుకోకుండా పాఠాలు చెబుతున్నారు. నేడు కాకపోతే, రేపైనా జీతం అందిస్తుందన్న ఉద్దేశంతో తమ బాధ్యతలను విస్మరించలేదు. తమను గెస్ట్ లెక్చరర్లుగా గుర్తించింది కాబట్టి జీతాలు విడుదల చేసే సమయంలో అన్యాయం చేయదని భావించారు. ఇప్పుడు అదే వారి కొంపముంచింది. జిల్లాలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల జాబితాలో కొంతమంది పేర్లు లేకపోవడంతో అవాక్కవటం వారి వంతయింది. ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందా? లేక ప్రభుత్వం కొంతమంది గెస్ట్ లెక్చరర్లకు మాత్రమే అనుమతినిచ్చిందా? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత జిల్లా అధికారులు మాత్రం జీతాలు రాని గెస్ట్ లెక్చరర్లకు అన్యాయం జరగనివ్వబోమని, అందరికీ న్యాయం చేస్తామని చెబుతోంది. జిల్లావ్యాప్తంగా ఆయా జూనియర్ కళాశాలలో దాదాపు 34 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. సంబంధిత శాఖ విడుదల చేసిన జీతాల జాబితాలో వీరందరి పేర్లు లేకపోవడం గమనార్హం! ఇలా ఎందుకు జరిగిందనే విషయం పై భిన్న రకమైన వాదనలు వినిపిస్తున్నాయి. జాబితా రూపొందించే క్రమంలో సీనియర్ గెస్ట్ లెక్చరర్లను తొలి జాబితాలో, జూనియర్ గెస్ట్ లెక్చరర్లను మలి జాబితాలో చేర్చిందని తెలుస్తోంది. అందుకే మొదట విడుదలైన జీతం జాబితాలో అందరి పేర్లు లేవని సంబంధిత అధికారులు చెబుతున్నట్లు సమాచారం. అధికారులు చెబుతున్న ప్రకారం జీతాలు అందుకున్న జాబితాలో సీనియర్ల పేర్లు ఉండాలి. కానీ జాబితా చూస్తే ఏడెనిమిది ఏళ్ల నుంచి బోధన చేస్తున్న వారి పేర్లు సైతం లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇక కొత్తగా మొదలైన జూనియర్ కళాశాలలో బోధనకు నియమితులైన గెస్ట్ లెక్చరర్ల పేర్లను కూడా మలి జాబితాలో చేర్చామని, అందుకే ప్రస్తుత జాబితాలో వీరి పేర్లు లేవని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన చూసుకున్నా, కొత్తగా ఏర్పడిన కళాశాలలో సైతం ఒకరి పేరు ఉండి మరొకరి పేరు లేకపోవడం విస్మయానికి గురిచేస్తుంది. మొత్తానికి అధికారుల నిర్లక్ష్యం వల్ల గెస్ట్ లెక్చరర్లు జీతాలు అందుకోకుండా నానా ఇబ్బందులు పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాది వరకు 1654 మంది గెస్ట్ లెక్చరర్లు పని చేసేవారు. ఆ తర్వాత ప్రభుత్వం 1256 జూనియర్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేసింది. భర్తీ చేయగా మిగిలిన పోస్టులకు మాత్రమే గెస్ట్ లెక్చరర్లకు అనుమతిస్తామని నిర్ణయం తీసుకుంది. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా 398 మంది గెస్ట్ లెక్చరర్లు మాత్రమే ఈ ఏడాది మళ్లీ రెన్యువల్ చేసుకునేందుకు అవకాశం దక్కించుకున్నారు. అయితే ప్రభుత్వం భర్తీ చేసిన పోస్టుల్లో కొన్ని సెకండ్ వేకెన్సీ, క్లియర్ వేకెన్సీల్లో సర్దుబాటు అవటంతో రాష్ట్రవ్యాప్తంగా మరో 185 పోస్టులకు ఖాళీ ఏర్పడింది. ఇక దీనికి తోడు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన కొత్త కళాశాలకు కూడా లెక్చరర్ల అవసరం ఏర్పడింది. దీంతో ఆయా కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల ద్వారానే బోధన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా బోధన చేయాలంటే మరో వెయ్యి గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అవకాశం ఇవ్వాలని సంబంధిత శాఖ కమిషనర్ ప్రభుత్వానికి తెలియజేశారు. అందుకు అంగీకరించని ప్రభుత్వం 398 మంది తోడు మరో 494 మంది గెస్ట్ లెక్చరర్లకు మాత్రమే అనుమతిని ఇచ్చింది. ఇందుకు ఇంటర్మీడియట్ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు అంగీకారం తెలిపారు. జిల్లాలో ఉన్న గెస్ట్ లెక్చరర్లను 398 మందికి సంబంధించిన జాబితాలో, అలాగే 494 మందికి సంబంధించిన జాబితాలో చేరుస్తూ తమకు పంపించాలని సంబంధిత శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లా అధికారులను ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా జిల్లా అధికారులు జాబితా పంపించారు.

అంతకుముందు జిల్లాలో పనిచేసిన 70 మందికి గాను 34 మంది గెస్ట్ లెక్చరర్లు మాత్రమే అవకాశం దక్కించుకున్నారు. వీరే పాత, కొత్త కళాశాలల్లో సర్దుబాటు అయ్యారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో జాబితాను పంపే క్రమంలో సంబంధిత శాఖ జిల్లా అధికారులు ఎవరిని ఏ జాబితాలో చేర్చిందో తేలటం లేదు. దీనివల్ల పాత కళాశాలలో పనిచేసే వారు, కొత్త కళాశాలలో పనిచేసే వారు, జూనియర్లు, సీనియర్లు అనే తేడా లేకుండా జీతాలు అందుకునే వారి జాబితా గందరగోళంగా తయారయింది. దీంతో కొంతమంది జీతాలు అందుకోకుండా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై సంబంధిత శాఖ జిల్లా అధికారిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం సాధారణంగా రెండు మూడు నెలలకు ఓసారి జీతాలను అందిస్తుంది. అలాగే గెస్ట్ లెక్చరర్లకు కూడా అందిస్తూ ఉండి ఉంటే, ప్రస్తుతం విడుదల చేసిన జీతం జాబితాలో తమ పేరు లేకపోయినా వీరంతా పెద్దగా అసహనానికి గురి అయ్యేవారు కాదు. గెస్ట్ లెక్చరర్లు దాదాపు పది నెలలుగా జీతాలు అందుకోవటం లేదు. వీరంతా జీతం ఎపుడు వస్తుందా? తమ ఇబ్బందులు, అప్పులు ఎపుడు తీరుతాయా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి సమయంలో అసలు జాబితాలో తమ పేరే లేదని తెలిసి తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. కొంతమందికి ఇచ్చి తమకు ఎందుకు ఇవ్వటం లేదని, అసలు జాబితాను తప్పులతడకగా ఎందుకు రూపొందించారని? ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం అవకాశం కోల్పోయిన లెక్చరర్ల కోసం మరో జాబితాను తయారు చేస్తామని, తమ శాఖ కమిషనర్ కు వెంటనే పంపిస్తామని సంబంధిత జిల్లా అధికారులు చెబుతున్నారు. గతంలో పంపించిన జాబితాలోని వారికే ఇంకా జీతాలు అందలేదని, ఇక ఇప్పుడు తమ పేర్లను జత చేసి, జాబితాను రాష్ట్రస్థాయి అధికారులకు పంపిస్తే వారి నుంచి ఆమోదం లభించేది ఎన్నడో, తమకు జీతాలు అందేది ఎపుడోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గెస్ట్ లెక్చరర్ల జీవితానికి ఉద్యోగ భద్రత ఉండదని, దీనికి తోడు అధికారులు, ప్రభుత్వ తీరు వల్ల తాము జీతానికి కూడా నోచుకుని పరిస్థితి ఏర్పడిందని వీరంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సరైన చర్యలు తీసుకొని తమ పేర్లను జాబితాలో చేర్చాలని, తమకు జీతాలు సక్రమంగా అందించాలని పేర్లు గల్లంతయిన గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారుహిస్టరీ లెక్చరర్ గా నాకు దాదాపు 9 ఏళ్ల అనుభవం ఉంది. ప్రస్తుతం కూసుమంచి జూనియర్ కళాశాలలో బోధన చేస్తున్నాను. నేను పనిచేసిన ప్రతిచోట పూర్తి నిబద్ధతను చూపిస్తూ 100% ఫలితాలను రాబడుతున్నాను. జీతం లేని వేసవి రెండు నెలలు కూడా కళాశాల తరఫున ప్రచారం చేస్తూ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు దోహద పడుతున్నాను. ఇక తొమ్మిది నెలల నుంచి జీతం కూడా అందుకోవటం లేదు. ప్రస్తుతం జీతం అందుకునే జాబితాలో నా పేరు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వం మాలాంటి వారికి న్యాయం జరిగేలా చూసి వెంటనే జీతాలు అందించాలి. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే ముందు సంబంధిత అధికారుల ఆమోదంతోనే బోధన చేసేందుకు రెన్యువల్ చేయించుకున్నాను. ఇప్పుడు జాబితాలో మా పేరు లేదంటే తప్పు ఎక్కడ జరిగిందోననే అనుమానాల వ్యక్తం అవుతు న్నాయి. ఖాళీగా ఉండి నిరుద్యోగులుగా అనిపించుకోవడం కంటే, ఇలా ఉద్యోగం చేసుకుంటూ మా కాళ్ళ మీద మేము నిలబడుతున్నామని భావనలో ఉన్నాం. సంబంధిత శాఖ విడుదల చేసిన జాబితాలో మా పేరు లేకుండా ఉండటం చూస్తే మేము ఉద్యోగులమో, నిరుద్యోగులమో అర్థంకాని పరిస్థితి. మా లాంటివారికి అన్యాయం చేయడం ప్రభుత్వానికి తగదు. జరిగిన పొరపాటున సరిచేసి మాకు వెంటనే జీతాలు అందేలా చూడాలి.

## మాటల మంటలు

కరీంనగర్, అక్టోబరు 19

కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల మధ్య సోషల్ మీడియా వేదికగా మాటల యుద్ధం సాగుతోంది. రసమయి బూతు పురాణంతో కూడిన అసహ్య ఆడియో లీక్ గురువారం కలకలం రేపగా తాజాగా శుక్రవారం ఎమ్మె ల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడిన ఆడియో ఒకటి రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది.'మీడియా ప్రతినిధులు అంటే గౌరవంగా ఉండాలి.. మీరు వాడు ఏ ది చెబితే అది రాస్తారా? మీరేమైనా పోస్ట్‌మన్ ఉద్యోగం చేస్తున్నారా? అంటూ ఆడియోలో ఎమ్మెల్యే ఘాటుగా ప్రశ్నించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల వాయిస్‌తో ఉన్న ఈ రెండు ఆడియోలు సోషల్ మీడియా వేదికగా కలకలం రేపుతున్నాయి. రసమయి ఏకంగా కవ్వంపల్లిపైనే కాకుం డా కుటుంబ సభ్యులపై కూడా అసభ్యపదజాలంతో విరుచుకుపడటం కాంగ్రెస్ వర్గీ యుల ఆగ్రహానికి కారణమైంది. ఈ క్రమంలోనే మానకొండూర్ నియోజకవర్గం తి మ్మాపూర్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నేతలు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై తీవ్రంగా స్పందించిన కవ్వంపల్లి అనుచరులు కరీంనగర్ సీపీ తో పాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంతోపాటు మానకొండూర్, శంకరపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం, ఇల్లంతకుంట, బెజ్జంకి మండ ల కేంద్రాల్లో రసమయి బాలకిషన్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించి ఆయన దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అలాగే బెజ్జంకి మండలం గుండారంలోగల రసమయి బాలకిషన్ ఫాంహౌజ్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. రెండు గంట లపాటు ఇక్కడ ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి.

## ఆలయంలో దొంగలు పడ్డారు

పెదవేగి అక్టోబరు 19

మండలం ముండూరు గ్రామంలో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో, కోదండ రామాలయంలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి ఒకటిన్నర కాసు బంగారు ఆభరణాలు,17వేల నగదు అపహరించుకు పోయినట్లు ధర్మకర్తలు తెలుపుతున్నారు ఘటన స్థలానికి చేరుకున్న పెదవేగి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. రెండు పురాతన దేవాలయాల్లోనూ ఒకేసారి ఇలా జరగడంతో గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

========================

## చెట్టును ఢీకొని కారు బోల్తా

నిర్మల్ అక్టోబరు 19

జిల్లా కేంద్రంలోని కంచరోని చెరువు వద్ద శనివారం ఉదయం కారు అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తా పడింది. వరంగల్ కు చెందిన భక్తులు షిరిడి యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణమవుతుండగా ఈ ఘటన జరిగింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ఐదుగురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం ఈ సంఘటన చోటుచేసుకుంది.

========================

## కదిరి పోలీస్ స్టేషన్ లో మహిళ ఆత్మహత్యయత్నం

శ్రీ సత్య సాయి అక్టోబరు 19

తన కొడుకు పై కేసు పెట్టొద్దంటూ కదిరి పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణంలో మహిళ చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కదిరిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఘటనలో ఒక విద్యార్థికి తీవ్రగాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు మరో విద్యార్థి పై కేసు నమోదు అయింది. తన కొడుకుపై కేసు నమోదు చేయవద్దంటూ విద్యార్థి తల్లి ముబీనా బ్లేడుతో చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. గాయపడిన మహిళను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

==========================

## నరసరావుపేట శివారు స్వర్గపురి2 లో మర్డర్.

పల్నాడు అక్టోబరు 19

స్వర్గపురి 2లో కాటికాపరిగా పనిచేస్తున్న గాడిపర్తి ఎఫ్రాన్(31)నీ గుర్తు తెలియని వ్యక్తులు అతి కిరాతకంగా గొడ్డలితో నరికారు. 18 నెల నుంచి స్వర్గపురిలో కాటికాపరిగా గాడిపర్తి ఎఫ్రాన్ పని చేస్తున్నాడు. ఎఫ్రాన్ ది నరసరావుపేట క్రిస్టియన్ పాలెంలో నివసిస్తాడు. పాతకక్షల నేపథ్యంలో మర్డర్ జరిగుంటదని బంధువులు ఆరోపించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అంబాజీపేట మండలం మాచవరంలో ఫుడ్పాయిజన్

కోనసీమ జిల్లా అక్టోబరు 19

అంబాజీపేట మండలం మాచవరంలో ఫుడ్పాయిజన్ జరిగింది. ఘటనలో 20 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించారు. వాంతులు, విరేచనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఆందోళనలో పడ్డారు. రెండు రోజుల క్రితం అంబాజీపేటలోని ఓ హోటల్లో బాధితులు టిఫిన్ చేసినట్లు సమాచారం. ఫుడ్ సేఫ్టీ అధికారులు. గ్రామంతో పాటు హోటల్లో తనిఖీలు చేస్తున్నారు.

# జూబ్లీహిల్స్ పోల్స్ ఆసక్తికరం

హైదరాబాద్, అక్టోబరు 19

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం రసవత్తరంగా సాగుతుంది. ఇప్పటికే నామినేషన్లు వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో తాము ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రజల వద్దకు వెళుతున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత, బీజేపీ అభ్యర్థిగా దీపక్ రెడ్డిలు పోటీ చేస్తున్నారు. అయితే ఈ ఉప ఎన్నికల్లో గెలుపు రెండు పార్టీలకు ఎక్కువ అవసరంగా కనిపిస్తుంది. ప్రధానంగా అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ లకు ఈ గెలుపు అవసరం అని ఆ మేరకు నాయకులు శక్తివంచన లేకుండా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.... బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం కావడంతో ఉప ఎన్నికల్లోనూ తమ స్థానాన్ని నిలబెట్టుకోవాలని ఆ పార్టీ ప్రయత్నిస్తుంది. అందుకే మరణించిన మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు లభించకపోతే తాము ప్రభుత్వం చేసే ఆరోపణలకు విలువ ఉండదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ నే కోరుకుంటున్నారన్న సంకేతాలు వెళతాయని భావించి అది కొంత వేగంగానే ప్రచారాన్ని నిర్వహిస్తుంది. బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందంటూ వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇంటింటికీ తిరుగుతున్నారు. మాజీ మంత్రులందరూ రంగంలోకి దిగారు. ఇప్పటికే బస్తీల్లో సభలు పెడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బుల్ డోజర్ వస్తుందంటూ కేటీఆర్ హెచ్చరిస్తున్నారు... మరొకవైపు కాంగ్రెస్ పార్టీకి కూడా ఇది సవాల్ గా మారింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బాధ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముగ్గురు మంత్రులకు అప్పగించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు విస్తృతంగా పర్యటిస్తున్నారు. నవీన్ యాదవ్ కుటుంబానికి బస్తీల్లో ఉండే పట్టుతో గెలుపు ఖాయమని భావిస్తున్నప్పటికీ సెంటిమెంట్ భయం కాంగ్రెస్ ను వెంటాడుతుంది. మంత్రులతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఎన్నికల వేళ రెండు మూడు సభల్లో పాల్గొనే అవకాశముందని అంటున్నారు. కాంగ్రెస్ కు ఈ ఉప ఎన్నిక ప్రతిష్టాత్మకం. ఎందుకంటే ప్రజల్లో ఏ మాత్రం ఆదరణ చెక్కు చెదరలేదని చెప్పుకోవడానికి ఈ ఎన్నికల్లో గెలుపు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఇక బీజేపీ కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను సీరియస్ గా తీసుకుంది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు ప్రచారంలో పాల్గొంటున్నారు. కిషన్ రెడ్డి ఎలాగైనా తన సన్నిహితుడైన దీపక్ రెడ్డిని గెలిపించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. కిషన్ రెడ్డితో పాటు కేంద్ర మంత్రులు మరికొందరు కూడా రానున్న కాలంలో ప్రచారానికి వచ్చే అవకాశముందని అంటున్నారు. ఈ ఉప ఎన్నికల్లో గెలిచి కేంద్ర ప్రభుత్వ సాయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని, తమను గెలిపిస్తే ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతామని చెపుతున్నారు. మరి మూడు పార్టీల్లో చివరకు గెలుపు ఎవరిదన్నది వచ్చే నెల 14వ తేదీన తేలనుంది

భారీగా పట్టుబడుతున్న నగదు

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక నేపథ్యంలో కట్టుదిట్టంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీలను ఎన్నికల అధికారులు ముమ్మరం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి నేటి వరకూ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న కోటి రూపాయలకు పైగా నగదు పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. టోలి చౌకీ వద్ద 10 లక్షల రూపాయల నగదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం స్వాధీనం చేసుకుంది. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో నేడు నామినేషన్ ల స్వీకరణ కార్యక్రమం నాలుగో రోజు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకూ ప్రధాన పార్టీల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత నామినేషన్ వేశారు.

# రోడ్లపైనే మొక్కజొన్న

వరంగల్, అక్టోబరు 19 రోడ్లపై మొక్కజొన్న పంటలు ఏంటి అనుకుంటున్నారా... నిజమే పంట పొలాల్లో పండించిన మొక్కజొన్న పంట రోడ్లపై కి ఎక్కుతుంది. మహమ్మదాబాద్ మండల పరిధిలో ఎన్ హెచ్ 167 రోడ్డు పక్కనే ఉన్న సర్వీస్ రోడ్లపై కొందరు రైతులు పండించిన మొక్కజొన్న పంట రోడ్లపై ఆరబెడుతున్నారు. ఇక్కడ వర కు బాగానే ఉన్నప్పటికీ రాత్రి సమయంలో న లుపు రంగు గల టార్పలిన్ కవర్లను మొక్కజొన్నపై కప్పి పెడుతున్నారు. రాత్రి స మయం కావడంతో కొంతమంది వాహనచోదకులు బ్లాక్ కవర్ కనిపించకపోవడంతో మొక్కజొన్న కుప్పలు కు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటువంటి ఘటనలు మండల పరిధిలో ఇప్పటికే చోటుచేసుకుని ఆసుపత్రి పాలు అయ్యేంద్రు. ఆరబెట్టేందుకు సర్వీస్ రేట్లను ఉపయోగించుకుంటున్న కొం తమంది రైతులు వారు వాహన చోదకులకు ఎంత మేరకు ఇబ్బందులు పెడుతున్నారో వారికి తెలియకుండానే ప్రమాదాలకు కారణమవుతున్నారు. వేగంగా వాహనాలు... అ సలే ఎన్ హెచ్ 167 రాత్రి సమయంలో వాహనాలు కొంత వేగం గానే ఉంటాయి. ఈ తరుణంలో కొంత మేరకు పక్కకు జరిగిన ప లు ప్రాంతాలలో పక్కనే ఉన్న మొక్కజొన్న కుప్పలకు తలి తీవ్ర ప్రమాదాలు చోటు చే సుకుంటున్నాయి. వాహన చోదకులు మొరపెట్టుకుంటున్నప్పటికీ ఎవరికి చెప్పాలి ఎవ రు తీస్తారులే అనుకుంటూ లోలోపలనే మ దిన పడుతుంద్రు. మహబూబ్ నగర్ నుంచి తాండూర్, కోస్గి, చించోలి ముంబై తో పాటు పలు ప్రాంతాలకు ఈ రోడ్డు మీదుగా వాహనాలు వెళుతుంటాయి. ఎలాగైనా రైతులకు రోడ్లపై మొక్కజొన్నలు ఉంచకుండా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు చెబుతున్న మాట.

## బంద్ ప్రశాంతం మంత్రి పొన్నం

హైదరాబాద్ అక్టోబరు 19

తెలంగాణ ప్రభుత్వం బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి రాష్ట్ర వ్యాప్తంగా కుల సర్వే నిర్వహించి శాసన సభ లో చట్టం చేసి గవర్నర్ దగ్గర ఆమోదం నుండి రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

మార్చి 30 నుండి గవర్నర్ దగ్గరకు వెళ్ళిన బిల్లులు ఇంత వరకు ఆమోదం పొందలేదు. గ్రామ పంచాయతీ ఎన్నికలు లేక రెండు సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వం నిధులు రాక ఇబ్బందులు ఉంది. అన్ని రాజకీయ పార్టీల. మద్దతు బిల్లులు పాస్ చేసుకోవడం జరిగింది. నిర్ణయం తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం, తదుపరి చర్యలు తీసుకపోవడం వల్ల అమలు జాప్యం జరుగుతుంది. న్యాయ స్థానాల్లో పోరాటాలు చేస్తాం.. హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తాం. అన్ని రకాల పోరాటాలు జరిగే సందర్భంలో. తెలంగాణ బలహీన వర్గాలు జాయింట్ యాక్షన్ కమిటీ గా ఏర్పడి మాదిగ దండోరా ,మాల మహానాడు ,బీసీ సంఘాలు ఐక్య సమితిగా బంద్ కి పిలునిచ్చారు..వారికి అభినందనలు. బంద్ ప్రశాంతంగా జరుగుతుంది. రవాణా శాఖ మంత్రి గా అన్ని రాజకీయ పార్టీల విజ్ఞప్తి మేరకు బస్సులు కూడా బంద్ చేసుకోవడం జరిగిందని అన్నారు. ప్రజలకు అసౌకర్యం అయినప్పటికీ బంద్ ప్రభుత్వాల పై ప్రభావం పడడానికి ఉంటుంది. ముఖ్యంగా బండి సంజయ్,కిషన్ రెడ్డి లు ,బీజేపీ ఎంపిలంత తెలంగాణ బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు కేంద్రానికి చెప్పే ప్రయత్నాలు చేయండి. రిజర్వేషన్లు అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా బలహీన వర్గాలకు న్యాయం చేసిన రాష్ట్రంగా మీ నాయకత్వంలో ఇచ్చే ప్రయత్నం చేయండి. తెలంగాణ ప్రజల ముందు దోషిగా నిలబడే పరిస్థితి వస్తుంది. కేంద్రంలో బాధ్యత మీది..రాష్ట్రంలో మా బాధ్యత నిర్వహించాం. నిర్ణయం తీసుకోవాల్సిన కేంద్రం ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

## బీసీలకు న్యాయం కోసం అన్ని పక్షాలు కలిసి రావాలి

### ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్

నిజామాబాద్ అక్టోబరు 19,

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కాలని ఈ రోజు చేపట్టిన రాష్ట్ర బంద్ కు అన్ని పక్షాలు సంఘీభావం తెలపాలని ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ కోరారు.

రిజర్వేషన్ల విషయంలో కేంద్రం తీరుకు నిరసనగా....

నిజామాబాద్ లో బీసీ నాయకులతో కలిసి బంద్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది. జనాభాలో ఎవరి సంఖ్య ఎంత ఉంటుందో...వారికి ఆ మేరకు రిజర్వేషన్లు ఉండాలన్న రాహుల్ గాంధీ ఆశయాన్ని ఇక్కడ అమలు చేసే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.

అయితే రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ నేతలు పైకి సహకరించినట్లు ఇక్కడ చెబుతున్న కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మాత్రం సహకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించి పంపిస్తే.. చట్టబద్ధత కల్పించకుండా కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అడ్డుపడుతోంది. నిజంగా బీసీలపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే....రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు చొరవతీసుకుని....రాష్ట్రపతిని అఖిలపక్షంతో కలవడానికి ముందుకు రావాలని కోరారు.

## ఆత్మకూరులో ఆనం రామనారాయణ రెడ్డి పర్యటన

ఆత్మకూరు అక్టోబరు 19,

స్వర్ణాంధ్ర...స్వచ్ఛ ఆంధ్ర ... కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు ఆంజనేయ స్వామి గుడి సమీపంలోని మున్సిపల్ డంపింగ్ యార్డ్ ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం పరిశీలించారు. ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర.. ఈవారం క్లీన్ ఎయిర్ (స్వచ్ఛమైన గాలి) థీమ్ తో కార్యక్రమాలు జరుగుతున్నాయి.

మంత్రి మాట్లాడుతూ చెత్తరహిత ఆత్మకూరు సాధనే లక్ష్యం. ప్లాస్టిక్ నిషేధం, కాలుష్య నివారణ, పరిసరాల పరిశుభ్రతతోనే ఆహ్లాదకరమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి లభ్యం అని అన్నారు.

ప్రతిఒక్కరూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని అన్నారు.

==============================

## మధ్యవర్తులను సంప్రదించకండి

తిరుమల అక్టోబరు 19

శ్రీవారి భక్తులకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేసారు. భక్తులు టీటీడీ వెబ్సైట్లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలి.. దర్శనం లేదా వసతి కోసం ఏ మధ్యవర్తులను సంప్రదించవద్దు. భక్తులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.. భక్తులను మోసం చేస్తున్న దళారీలపై చర్యలు తీసుకోవడానికి టీటీడీ ప్రత్యేక డ్రైవ్ కూడా ప్రారంభించింది. తిరుమలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచడానికి మనమంతా కలిసి కృషిచేద్దామని అన్నారు.

మరోవైపు, ఒక దళారీ తెలంగాణ భక్తులను మోసం చేసిన ఉదంతం బయటపడింది. ఆశోక్ అనే దళారీ శ్రీవారి సేవా టికెట్లు ఇప్పిస్తానని భక్తుల నుంచి రూ.4 లక్షలు వసూలు చేసాడు. డబ్బులు ఆన్లైన్ ద్వారా వేయించుకున్న అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేసాడు. దళారీ అశోక్ ఫోన్ పనిచేయకపోవడంతో విజిలెన్స్ అధికారులకు భక్తుడు ఫిర్యాదు చేసాడు. భక్తుడి ఫిర్యాదు మేరకు తిరుమల పోలీసులు కేసు నమోదు చేసారు.

## బీసీ బంద్ లో పాల్గోన్నకవిత కుమారుడు

హైదరాబాద్ అక్టోబరు 19,

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన కుమారుడిని రాజకీయ




ప్రవేశం చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈరోజు ఖైరతాబాద్ లో నిర్వహించిన బీసీ రిజర్వేషన్ల నిరసనకు కుమారుడు ఆదిత్యను కూడా తీసుకువచ్చారు. జాగృతి నేతలతో కలిసి ఆదిత్య ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేస్తూ నిరసనలో చురుకుగా పాల్గొన్నారు.

మొత్తం మీద తండ్రి కేసీఆర్ ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో తండ్రి స్థాపించిన గులాబీ పార్టీ నుండి బయటకు వచ్చిన కవిత తన జాగృతి సంస్థ ద్వారా రాజకీయాలు కొనసాగిస్తున్నారు.. తాజాగా ఆమె తన ఇరవై ఏళ్ల కుమారుడిని కూడా రాజకీయాల్లోకి దింపుతున్న పరిణామాలను బట్టి చూస్తే సొంతంగా పార్టీని స్థాపించడం వైపు మొగ్గు చూపుతున్నట్లు భావించాలి..!

## సికింద్రాబాద్ బంద్ లో పాల్గోన్న మంత్రి కొండా సురేఖచ ఎమ్మెల్యే శ్రీ గణేష్

సికింద్రాబాద్.. అక్టోబరు 19,

తెలంగాణ బీసీ జేఏసీ ఇచ్చిన బిసి బంద్ పిలుపులో భాగంగా సికింద్రాబాద్ రేతి ఫైల్ బస్ స్టాప్ వద్ద మంత్రి కొండా సురేఖ, కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీ గణేష్ బంద్ లో పాల్గొన్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ లో తీర్మానం చేసి అసెంబ్లీలో ఆమోదించిందని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు పై గవర్నర్ సంతకం చేయకపోవడం మూలంగానే బీసీల రిజర్వేషన్ అంశం మరుగున పడిందని అన్నారు. గవర్నర్ నిర్ణయం తీసుకుని ఉంటే ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలు 42% బీసీ రిజర్వేషన్లతో జరిగేవని అన్నారు. భాజపా కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ బీసీల పట్ల చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తుందని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు అడ్డుపడి ఆమోదం పొందకుండా చేసింది భాజపా అని దుయ్యబట్టారు. కోర్టులలో కేసులు వేసి బీసీ లకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గోన్న మంత్రి నారాయణ



విజయవాడ... అక్టోబరు 19

న్యూ ఆర్టీసీ కాలనీలో స్థానిక ఎమ్మెల్యే గద్దె రామమోహన రావు తో కలిసి స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గోన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీని ప్రారంభించారు.

మంత్రి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర సాధన కోసం ప్రతి నెలా తప్పకుండా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఒక్కో నెల ఒక్కొక్క థీమ్ తో స్వచ్ఛ ఆంధ్ర కొరకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. గాలి కాలుష్యం వల్ల ప్రతి ఏటా ప్రపంచంలో 70 లక్షల మంది చనిపోతున్నారు. శ్వాసకోశ వ్యాధులు,గుండె సంబంధిత రోగాలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు.

గాలి కాలుష్యం తగ్గింపునకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి. ప్రజా రవాణాను ప్రోత్సహించాలి,చెట్లను నాటడంతో పాటు సోలార్ విద్యుత్ కు ప్రాధాన్యత ఇవ్వాలి. సూపర్ జీఎస్టీ లో సోలార్ విద్యుత్ పై జీఎస్టీ భారీగా తగ్గించారు. సూపర్ జీఎస్టీ వల్ల రాష్ట్రానికి 8 వేల కోట్లు నష్టం జరుగుతున్నా... ప్రజల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం కేంద్ర నిధులకు రాష్ట్ర వాటా ఇవ్వకపోవడం తో అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో డ్రింకింగ్ వాటర్,పారిశుధ్యం,డ్రైనేజీలు,రోడ్లకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో ఇంటింటికీ కుళాయి ద్వారా మంచి నీరు అందిస్తామని అన్నారు

# గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం - నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

నంద్యాల అక్టోబరు 19

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖకు రావడం నవ్యాంధ్రప్రదేశ్ కు శుభపరిణామమని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఓ ప్రకటన ద్వారా తెలుపుతూ ఉమ్మడి రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు తీసుకువచ్చి హైదరాబాద్ ను ఏ విధంగా అభివృద్ధి చేశారో నేడు విశాఖపట్నంకు గూగుల్ ను తీసుకువచ్చి నవ్యంద్రాప్రదేశ్ ముఖచిత్రాని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్చనున్నారు.రాష్ట్రాభివృద్ధికి దోహదపడే విధంగా సీఎం చంద్రబాబు పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారించి గూగుల్ సంస్థను విశాఖకు తీసుకువస్తున్నారనీ, ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలతో భేటీ అయ్యి, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చి, స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు సృష్టించి, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా చంద్రబాబు చేస్తున్న కృషి ఫలితాలను ఇస్తున్నాయని ఆమె వివరించారు.విశాఖకు గూగుల్ రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచేలా ఉందనీ, దేశంలోనే అత్యుత్తమమైన 26 పాలసీలను రూపొందించి సంస్థల నిర్మాణానికి వేగంగా అనుమతులు, భూముల కేటాయింపు నుంచి పవర్ సప్లై వరకు ఒక్క అడ్డంకి లేకుండా సింగిల్ విండో క్లియరెన్స్ ఉమ్మడి ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, సమర్థవంతమైన నాయకత్వం ఉండడంతో రాష్ట్రానికి గూగుల్, టీసీఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఐదేళ్లలో వచ్చిన పెట్టుబడులు కంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిని 16 నెలలోనే వచ్చిన పెట్టుబడులు అధికంగా రావడం జరిగిందిని, ఈ 16 నెలల్లో రాష్ట్రానికి రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 9.5 లక్షల ఉద్యోగావకాశాలు లభించాయని, గూగుల్ కంపెనీ రాకతో యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందనున్నాయని, యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా, వారి అభివృద్ధికి బాటలు వేసేలా, యువతను ఒక బలమైన శక్తిగా మార్చేందుకు ఇటువంటి సంస్థలను రాష్ట్రానికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ తీసుకువస్తున్నారని, అధునాతన టెక్నాలజీని విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు అందించాలని నైపుణ్య శిక్షణ కేంద్రాలతో పాటు వచ్చే విద్య సంవత్సరం నుండి పాఠ్యాంశాల్లో ఏఐ పాఠ్యాన్ని చేర్చనున్నారని, ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తూ మొన్న అమరావతికి క్వాంటం వ్యాలీని తీసుకువచ్చి, నేడు విశాఖకు గూగుల్ ను తీసుకురావడం జరిగిందని, ఇవి రాష్ట్రాభివృద్ధికి పెద్ద ఎత్తున దోహదపడతాయని, హైదరాబాద్ లో మైక్రోసాఫ్ట్ రావడంతో టెక్ అభివృద్ధికి ఎలా గేమ్ చేంజర్ అయిందో, అలా ఇప్పుడు గూగుల్ విశాఖపట్నం కు రావడం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ అభివృద్ధికి గేమ్ చేంజర్ మారనుందని, రూ.55 వేల కోట్ల పెట్టుబడితో సౌత్ ఆశియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ ను నిర్మించబోతోందనీ, ఇది రాష్ట్రాభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలిచిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.

## ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చిన కాంగ్రెస్ తలసాని

హైదరాబాద్ అక్టోబరు 19

బిసి లకు ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా భూస్థాపితం చేసేందుకు వెనుకబడిన వర్గాలు సిద్ధంగా ఉన్నాయని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. శనివారం బిసి బంద్ లో భాగంగా ఆర్టీసీ క్రాస్ రోడ్ లో నిర్వహించిన ధర్నా లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రతిపక్షంగా తాము బంద్ లో పాల్గొంటున్నామని, ఇచ్చిన హామీ అమలు చేయాల్సిన కాంగ్రెస్ పార్టీ, చట్టబద్ధత కల్పించాల్సిన బి జె పి పార్టీ ల నాయకులు సిగ్గు లేకుండా రోడ్ల పైకి వచ్చారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ లో బిల్లుకు తాము సంపూర్ణ మద్దతు తెలిపామని, దానిని గవర్నర్ కు పంపారని, గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్ లో ఉండగా నే ఆర్డినెన్స్, ఆ తర్వాత ఊ లను తీసుకొచ్చిందని విమర్శించారు. బిసి లను మోసం చేయడానికి అనేక డ్రామాలు ఆడుతున్నారని, మా ఆత్మ గౌరవం కోసం మేము పోరాడుతున్నామని స్పష్టం చేశారు. తమ ఉద్యమం రానున్న రోజుల్లో మరింత ఉదృతం అవుతుందని స్పష్టం చేశారు. 22 నెలల కాంగ్రెస్ పాలన పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పార్టీ జంతర్ మంతర్ లో నిర్వహించిన ధర్నాలో మీ అగ్రనాయకత్వం ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. పార్లమెంట్ లో బిల్లు పెట్టి 9 వ షెడ్యూల్ లో చేరిస్తేనే చట్టబద్ధత లభిస్తుందని తెలియదా? అని ప్రశ్నించారు. బిసి లకు 42 శాతం రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఇది ఆరంభం మాత్రమేనని, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్తామని వివరించారు.

## బీజెపికి ఒక మతాన్ని అంతకట్టడం కరెక్ట్ కాదు పి.వి.ఎన్.మాధవ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు

తిరుపతి అక్టోబరు 18,

బీజెపికి ఒక మతాన్ని అంతకట్టడం కరెక్ట్ కాదు. సర్వధర్మ సమభావన, హైందవ ధర్మం నిత్యనూతనమనేది బిజెపి నినాదమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్ అన్నారు. లోకాకళ్యాణార్థనీ..అన్ని వర్గాల ప్రజల క్షేమం కోసం దేశవ్యాప్తంగా యాగాలు నిర్వహిస్తాం. వివక్ష గురవుతున్న సమాజంలో వారి గుర్తింపు, గౌరవాన్ని పెంచుతాం.

క్షురకులు అంటే సమాజంలో చిన్నచూపు ఉంది. నాయిబ్రాహ్మణులు బలహీనులు కాదు, బలవంతులని తెలియచెప్పడమే బిజెపి ఉద్దేశం. సంజీవిని, స్వరం కార్యక్రమాన్ని బిజెపి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. నాయిబ్రాహ్మణులకు నాదస్వరం, ధన్వంతరి ఆయుర్వేదనీ రెండూ తెలుసనిఅన్నారు.

# పత్తికొండ మాజీ మహిళా ఎమ్మెల్యే పై దాడి చేయడం సిగ్గుచేటు

### దాడిని తీవ్రంగా ఖండించిన మండల వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు

### ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కూటమి ప్రభుత్వానికి సవాలు విసిరిన మండల వైసీపీ నాయకులు.

తుగ్గలి:` అక్టోబరు 18,

పత్తికొండ మాజీ మహిళ ఎమ్మెల్యే, ప్రస్తుత పత్తికొండ వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జి కంగాటి శ్రీదేవి వాహనాలపై తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి చేయడం చాలా సిగ్గుచేటని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్,జడ్పిటిసి పులికొండ నాయక్,ఐటీ వింగ్ నియోజకవర్గ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి,ఎంపీపీ గౌరవ సలహాదారులు శభాష్ పురంహనుమంతు, వైసీపీ మండల అధ్యక్షుడు అట్లా గోపాల్ రెడ్డి లు తీవ్రంగా ఖండించారు.శనివారం రోజున మండల కేంద్రమైన తుగ్గలి లోని మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి నివాసం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మెడికల్ కాలేజ్ ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్సిపి శ్రేణులు ముమ్మరంగా ప్రారంభించారు.ఈ కోటి సంతకాల సేకరణలో భాగంగా ప్రస్తుత పత్తికొండ వైసీపీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి క్రిష్ణగిరి మండలం లోని అలంకొండ,కోవెలకొండ, చిట్యాల గ్రామాల యందు పోలీసుల అనుమతితో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైఎస్ఆర్సిపి శ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించారు.శుక్రవారం రోజున చిట్యాల గ్రామం నందు సాయంత్రం టిడిపి నాయకుడైన నక్క నాగరాజు వారి అనుచరులు మాజీ ఎమ్మెల్యే,ఎంపీపీ వెంకట్రామిరెడ్డి వాహనాలపై రాళ్లతో దాడి చేసి కారు అద్దాలను ధ్వంసం చేయడం సరికాదని వారు తీవ్రంగా ఖండించారు.గత వైసిపి ప్రభుత్వం లో వైఎస్సార్సీపీ శ్రేణులు టిడిపి వారిపై ఎటువంటి దాడులను చేయలేదని వారు తెలియజేశారు.గత వైసిపి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రతి గ్రామంలో బాదుడే బాదుడు అనే కార్యక్రమాన్ని నిర్వహించినప్పుడు వైయస్సార్సీపి శ్రేణులు ఎటువంటి దాడులకు పాల్పడలేదని వారు తెలియజేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చినటువంటి హామీలను పక్కాగా నెరవేర్చాలని వారు తెలియజేశారు.50 సంవత్సరాలు పైబడిన బీసీలకు పింఛను, నిరుద్యోగులకు 3000 రూపాయల నిరుద్యోగ భృతి,18?60 సంవత్సరాల మహిళలకు నెలకు 1500 రూపాయలు వంటి పథకాలను వెంటనే అమలు చేయాలని వారు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వైఎస్ఆర్సిపి శ్రేణులపై ఇటువంటి దాడులను పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,లేనిపక్షంలో ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిఎండి హుస్సేన్,రాతన మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ మల్లికార్జున,ఎంపీటీసీ ఎర్ర నాగప్ప,మాజీ జడ్పిటిసి నారాయణ నాయక్,నునుసరాల సర్పంచ్ గోపాల్ రెడ్డి,కో ఆప్షన్ నెంబర్ చాంద్బాషా, మారెళ్ళ సుధాకర్ రెడ్డి,లింగన్న,మాజీ విద్యా కమిటీ చైర్మన్ గుంత రఘు, బొందిమడుగుల ఈశ్వర్ రెడ్డి,మాజీ డైరెక్టర్ ముక్కల గిడ్డయ్య,బూత్ కమిటీ మెంబర్ రామలింగాయపల్లి హనుమంత్ రెడ్డి,చెన్నంపల్లి సుంకన్న తదితర మండల వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలి

### ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కరపత్రాలను విడుదల చేసిన వైసిపి నాయకులు.

### కోటి సంతకాల ప్రజా ఉద్యమానికి ప్రజలు మద్దతు పలకాలి.

తుగ్గలి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని మండల వైఎస్సార్సీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున తుగ్గలి నందు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్సీపి నిర్వహిస్తున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమం యొక్క కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వలన ప్రజల ఆరోగ్యం కు భద్రత లేకుండా పోతుందని వారు తెలియజేశారు. మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపడం ద్వారా పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు మరియు ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని వారు తెలియజేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ జరిగితే పెద్ద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని, ఫీజుల భరించలేక పేద ప్రజలకు భారమవుతుందని, నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులో లేకుండా పోతుందని,ప్రజా ఆరోగ్య వ్యవస్థ క్షీణిస్తుందని, లక్షల కోట్లు విలువ చేసే ప్రజల ఆస్తులు ప్రైవేటుపరం అవుతాయని, ప్రైవేటు ఆసుపత్రులు ప్రజలు దోచుకోవడం మొదలు పెడతారని వారు తెలియజేశారు. మెడికల్ కాలేజీ లను ప్రభుత్వమే నడపడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ప్రజలకు కలుగుతాయని వారు తెలియజేశారు.ప్రభుత్వ ఆధీనంలో మెడికల్ కాలేజీలు ఉంటే ప్రజలకు మెరుగైన ఉచిత విద్య,వైద్యం అందుతుందని, ప్రజా ఆరోగ్య వ్యవస్థ బలోపేతం అవుతుందని వారు తెలియజేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేటీకరణను వెనుక తీసుకొని మెడికల్ కాలేజ్లను ప్రభుత్వమే నడపాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమంతో ప్రజల ద్వారా ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్,జడ్పిటిసి పులికొండ నాయక్,ఐటీ వింగ్ నియోజకవర్గ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి,ఎంపీపీ గౌరవ సలహాదారులు శభాష్ పురం హనుమంతు,వైసీపీ మండల అధ్యక్షుడు అట్లా గోపాల్ రెడ్డి,టిఎండి హుస్సేన్, రాతన మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ మల్లికార్జున,ఎంపీటీసీ ఎర్ర నాగప్ప, మాజీ జడ్పిటిసి నారాయణ నాయక్, నునుసరాల సర్పంచ్ గోపాల్ రెడ్డి,కో ఆప్షన్ నెంబర్ చాంద్బాషా,మారెళ్ళ సుధాకర్ రెడ్డి,లింగన్న,మాజీ విద్యా కమిటీ చైర్మన్ గుంత రఘు, బొందిమడుగుల ఈశ్వర్ రెడ్డి,మాజీ డైరెక్టర్ ముక్కల గిడ్డయ్య,బూత్ కమిటీ మెంబర్ రామలింగాయపల్లి హనుమంత్ రెడ్డి,చెన్నంపల్లి సుంకన్న తదితర మండల వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిసిల నిరసన దీక్షలో పాల్గొన్న టీజీఐసీసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 19:

బిసి లకు 42 శాతం రిజర్వేషన్ లు కల్పించాలంటూ బిసి జెఏసి చేపట్టిన బంద్ కు మద్దతుగా డిసిసి అధ్యక్షురాలు,టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని నటరాజ్ థియేటర్ ఎదురుగా నిరసన దీక్ష చేపట్టారు. పెద్ద ఎత్తున పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సమావేశంలో టీజీఐసీసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లు కల్పించాలనేది రాహుల్ గాంధీ ముఖ్యోద్దేశ్యం అన్నారు. బీసీలుసామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన బిసి కులాలు అభివృద్ధి లోకి రావాలంటే బీసీ రిజర్వేషన్లు ఒక్కటే మార్గం అని రాహుల్ గాంధీ ఉద్దేశ్యం అని అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రిజర్వేషన్ లకు కట్టుబడి ఉన్నారు. చిత్త శుద్ధి తో అసెంబ్లీ లో బిల్లు పెట్టి బీసీ రిజర్వేషన్ల పై ఆర్డినెన్సు తీసుకువచ్చారు. సోనియాగాంధీ ఏవిధంగా అయితే తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం చిత్తశుద్ధి తో తెలంగాణ రాష్ట్రాన్ని



ఏర్పాటు చేశారో అదే విధంగా పార్లమెంట్ లో బిసి రిజర్వేషన్ లు పెంచుతూ బిల్లు పెట్టి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బిసి ల పట్ల తన చిత్తుశుద్ధి నీ చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూలకంటి ఆంజనేయులు, తోపాజి అనంత్ కిషన్, కూన సంతోష్, ప్రభు గౌడ్ కిరణ్ గౌడ్, రామ్ రెడ్డి

# దేవాలయాల అభివృద్ధికి కృషి

**- పెద్దమ్మతల్లి నూతన దేవాలయానికి 1,01,116 విరాళం**

**- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో నూతనంగా పెద్దమ్మతల్లి దేవాలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణానికి తమ వంతు విరాళంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి 1,01,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ

గ్రామాల్లో దేవాలయాలు ఆధ్యాత్మికతకు ప్రతీకలు. దేవాలయ అభివృద్ధి అంటే గ్రామ అభివృద్ధికే పునాది. ప్రతి గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రాలు ఏర్పడితే ప్రజల్లో ఐకమత్యం, సానుకూల దృక్పథం పెరుగుతాయి,అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కుమార్ గౌడ్, వెంకటేష్ గౌడ్, బాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భార్గవ్ చారి, విశాల్ గౌడ్, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, పద్మారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, రాజయ్య, యాదగిరి, కాంతారావు, గోపాల్ , ఆంజనేయులు, యాదిరెడ్డి,మహేష్ సాయి గౌడ్,స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ప్రమాద రహితంగా పండుగ జరుపుకోవాలి

## బాణసంచాలను బహిరంగ ప్రదేశాలలో పేల్చుకోవాలి

మార్గదర్శకాలు జారీచేసిన సిపి అలం

భారతశక్తి ప్రతినిధి, కరీంనగర్, అక్టోబర్ 19:

దీపావళి పర్వదినాన్ని ప్రజలు ప్రమాద రహితంగా జరుపుకోవాలని, బాణసంచాలను బహిరంగప్రదేశాల్లో పెంచుకోవాలని కరీంనగర్ నగర పోలీస్ కమిషనర్ గౌస్ అలం సూచించారు. ఆదివారం సిపి రక్షిత దీపావళి కోసం సమగ్ర మార్గదర్శకాలు జారీచేశారు. ముందుగా జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాబోయే దీపావళి పండుగను సురక్షితంగా, ప్రశాంతంగా మరియు ప్రమాద రహితంగా జరుపుకునేందుకు ప్రజలకు సమగ్ర భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే అగ్ని ప్రమాదాలు, గాయాలు శబ్ద కాలుష్యాన్ని నివారించడానికి బాధ్యతాయుతంగా జాగ్రత్తగా జరుపుకోవాలని కోరారు. బాణసంచా వాడకం, దీపాలు వెలిగించడం పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రజలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

బాణసంచా భద్రతా మార్గదర్శకాలు

లైసెన్స్ పొందిన విక్రేతల వద్దనే ప్రజలు టపాసులు కొనుగోలు చేయాలని కోరారు.

బహిరంగ స్థలంలో మాత్రమే కాల్చాలి

నివాస ప్రాంతాలు, భవనాలు, మండే పదార్థాలకు దూరంగా, నియమించబడిన, బహిరంగ ప్రదేశాలలో మాత్రమే పటాకులను పేల్చాలన్నారు.

కాటన్ దుస్తులు

క్రాకర్లు పేల్చేటప్పుడు వదులుగా, ప్రవహించే లేదా సింథటిక్ దుస్తులకు బదులుగా బాగా సరిపోయే, మందపాటి కాటన్ దుస్తులు ధరించలన్నారు.

పెద్దల పర్యవేక్షణ

పిల్లలపై పెద్దల పర్యవేక్షణ లేకుండా క్రాకర్లను నిర్వహించడానికి లేదా వెలిగించడానికి ఎప్పుడూ అనుమతించకూడదను చెప్పారు.

అత్యవసర సంసిద్ధతలి ఎల్లప్పుడూ ఒక బకెట్ నీరు, ఇసుక లేదా అగ్నిమాపక యంత్రాన్ని అత్యవసర పరిస్థితుల కోసం సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

దూరం పాటించండిలి పొడవైన కొవ్వొత్తి లేదా అగర్బతి ఉపయోగించి క్రాకర్లను వెలిగించి, వెంటనే సురక్షితమైన దూరానికి పారేయాలని చెప్పారు.

లిడడ్' క్రాకర్లతో జాగ్రత్త

మండని క్రాకర్‌ను తిరిగి వెలిగించడానికి ప్రయత్నించవద్దు. 15-20 నిమిషాలు వేచి ఉండి, ఆపై పారవేయడానికి ముందు నీటిలో నానబెట్టాలన్నారు.

నిషిద్ధ స్థలాలు

ఇళ్ల లోపల, టెర్రస్‌లపై లేదా మూసివేసిన ప్రదేశాలలో బాణసంచా కాల్చడం ఖచ్చితంగా నివారించాలని, బయట ప్రదేశాలలో చేసుకోవాలన్నారు.

గురిపెట్టడం వద్దు

వెలిగించిన క్రాకర్లను ప్రజలు, జంతువులు లేదా నిర్మాణాల వైపు గురిపెట్టడం లేదా విసిరేయడం చేయవద్దు.



దియా, లైటింగ్ భద్రత

స్థిరమైన ప్లేస్‌మెంట్, దియాలు , కొవ్వొత్తులను స్థిరమైన, మండని ఉపరితలాలపై ఉంచాలని, వాటిని కర్టెన్లు, కాగితపు అలంకరణలు విద్యుత్ వైర్లకు దూరంగా ఉంచాలని చెప్పారు.

గమనించకుండా వదిలివేయవద్దు

వెలిగించిన దియాలు, కొవ్వొత్తులను గమనించకుండా వదిలివేయవద్దు. పడుకునే ముందు లేదా గది నుండి బయటకు వెళ్లే ముందు వాటిని ఆర్పివేయండి, విద్యుత్ అలంకరణలు ధృవీకరించబడిన నాణ్యత కలిగిన లైట్లను మాత్రమే ఉపయోగించండి, సాకెట్లను ఓవర్‌లోడ్ చేయకుండా ఉండాలని చెప్పారు.

శబ్దం మరియు పర్యావరణ ఆందోళనలు

సమయ పరిమితులు, క్రాకర్లు పేల్చడానికి సుప్రీంకోర్టు ఆదేశించిన సమయ పరిమితులను ఖచ్చితంగా పాటించడం తప్పనిసరన్నారు .

నిశ్శబ్ద మండలాలులి ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, విద్యాసంస్థలు వంటి 'నిశ్శబ్ద మండలాలు' సమీపంలో పటాకులు పేల్చడం ఖచ్చితంగా నిషేధించడం జరిగిందన్నారు.

గాలి,శబ్ద కాలుష్యాన్ని తగ్గించడానికి తక్కువ ధ్వని, పర్యావరణ అనుకూలమైన ('గ్రీన్') పటాకులను ఉపయోగించాలని పౌరులను ప్రోత్సహించడం జరిగింది.

అత్యవసర సంప్రదింపు నంబర్లు

ఏదైనా అత్యవసర పరిస్థితి, అగ్నిప్రమాదం, ఇతర ప్రమాదం సంభవించినప్పుడు, ప్రజలు తక్షణ సహాయం కోసం వెంటనే ఈ క్రింది నంబర్లను సంప్రదించాలన్నారు.

పోలీస్ కంట్రోల్ రూమ్ 100

ఫైర్ కంట్రోల్ రూమ్, 101

ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ (%జు=రూ%): 112, కమిషనరేట్ పరిధిలో పండుగ వాతావరణాన్ని కాపాడటానికి, చట్టం శాంతిభద్రతలను నిర్వహించడానికి పూర్తిగా సంసిద్ధంగా ఉందని, పౌరులు తమ వంతు సహకారం అందించి, ఈ దీపావళిని సురక్షితమైన, సంతోషకరమైన పండుగగా జరుపుకోవాలని సీపీ కోరారు.

# ఫార్మాస్యూటికల్ పరిశోధనలో డాక్టర్ లక్ష్మీదేవికి పీహెచ్డీ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 19:

ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని జి.లక్ష్మీదేవిని డాక్టరేట్ వరించింది. రెట్రోవైరల్ వ్యతిరేక మందుల సులువుగా మింగడం కోసం సూత్రీకరణ, అభివృద్ధి, ఘన వ్యాప్తి యొక్క తులనాత్మక మూల్యాంకనం, నానోసస్పెన్షన్స్, సెల్ఫ్-నానోఎమల్సిఫైయింగ్ డెలివరీ సిస్టమ్స్ పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పాతూరి రఘువీర్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.



డాక్టర్ లక్ష్మీదేవి వినూత్న సూత్రీకరణ పద్ధతుల ద్వారా డోలుటెగ్రావిర్ (డీటీజీ) యొక్క ద్రావణీయత, జీవ లభ్యతను మెరుగుపరచడంపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. ఘన వ్యాప్తి, నానోసస్పెన్షన్స్, సీడ్స్ వంటి అధునాతన ఔషధ పంపిణీ వ్యవస్థలు డీటీజీ యొక్క కరగడం, చికిత్సా సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతాయని ఆమె పరిశోధన విజయవంతంగానిరూపించిందన్నారు. డాక్టర్ లక్ష్మీదేవి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి

-దీపాల కాంతులవలె ప్రతి ఇంటా వెలుగులు నిండాలి

-ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

-మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



సూర్యాపేట,భారత శక్తి ప్రతినిధి,అక్టోబర్ 19:

చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి అని.. దీపాల కాంతులవలె తెలంగాణలోని ప్రతి ఇంటా వెలుగులు నిండాలని ఆకాంక్షిస్తూ దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరికీ మాజీమంత్రి వర్యులు, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామన్నారు. చీకటిని పారద్రోలే వెలుగుల పండుగతో తెలంగాణ లోనూ చీకట్లు తొలగి మళ్లీ అభివృద్ధితో వెల్లివిరియాలన్నారు. అగ్ని కొలువైన దీపాల వెలుగులు మనలో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించాలన్నారు. అలాగే బాణసంచా పేల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. చిన్నపిల్లలను బాణాసంచాకు దూరంగా ఉంచాలని సూచించారు.

## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

వైయస్సార్ కడప జిల్లా, అక్టోబరు 19(భారత శక్తి) : చీకట్లపై వెలుగు సాధించే విజయానికి చిహ్నంగా హిందువులు సంప్రదాయంగా దేశవ్యాప్తంగా దీపావళిని కన్నుల పండువగా చేసుకోవడం ఆనవాయితీ. ఈ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ కలెక్టర్ అదితి సింగ్, ఎంపీ వై.ఎన్.అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఇంటింటా దీపాలు.. రంగుల వెలుగుల దీపపు కాంతులు.. శుభాలకు ప్రతిరూపాలుగా కనువిందు చేసే... దీపావళి పండుగ.. ఎన్ని కష్టాలు ఎదురైనా.. నిరాశ చెందకుండా... ఎదురునిలిచి పోరాడి విజయం వైపు నడవాలనే సందేశాన్ని సమాజానికి అందిస్తుంది. ఈ పండుగ రోజు.. పిల్లలు పెద్దల సమక్షంలో, యువత దుడుకుపాటు లేకుండా.. ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా ఈ దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. నిప్పుతో చెలగాటం ఆడరాదని, తగు జాగ్రత్తలు పాటించి పండుగను ఆనందంగా జరుపుకోవాలని వారు ఆ ప్రకటనలో తెలియజేశారు.

# కరీంనగర్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల బరిలో బీజేపీ ప్యానల్?

**పోటీకి దింపాలని కేంద్ర మంత్రిపై ఒత్తిడి తెస్తున్న బీజేపీ శ్రేణులు**

**బాస నివాసంలో బీజేపీ జిల్లా నేతల సమావేశం**

**రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకోనున్న కేంద్ర మంత్రి బండి**


భారతశక్తి ప్రతినిధి, కరీంనగర్19

కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. రేపటి నుండి నామినేషన్ల పర్వం మొదలు కానుంది. నవంబర్ 1న ఎన్నికలు జరగబోతున్నాయి. కాంగ్రెస్ తరపున ప్యానెల్ ను నిలబెట్టేందుకు ఆ పార్టీ సిద్ధం కావడంతో భారతీయ జనతా పార్టీ సైతం ప్యానల్ ను బరిలోకి దింపాలని ఆ పార్టీ శ్రేణుల నుండి ఒత్తిళ్లు వస్తున్నాయి. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై ఆయ శ్రేణులు ఒత్తిడి తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి అధ్యక్షతన జిల్లా ముఖ్య నేతలు ఆదివారం పార్టీ మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ నివాసంలో సమావేశమై అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో ప్యానెల్ ను బరిలో దింపే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. గంగాడి క్రిష్ణారెడ్డి, బాస సత్యనారాయణతోపాటు మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, జిల్లా నాయకులు కోమాల ఆంజనేయులు, ఓదెలు, బోయినిపల్లి ప్రవీణ్ రావు. కన్న క్రిష్ణలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎన్నికల్లో బీజేపీ పక్షాన ఇండిపెండెంట్ ప్యానెల్ ను బరిలో దించేతేనే బాగుంటుందనే అభిప్రాయాన్ని మెజారిటీ నేతలు వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పట్ల అర్బన్ బ్యాంక్ ఓటర్లకు సానుకూలత ఉందని, ఎన్నికల్లో ప్యానెల్ గెలుపుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వాస్తవానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయాల్లోకి వచ్చాక తొలిసారి ప్రజాప్రతినిధిగా చేపట్టిన పదవి కరీంనగర్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ మాత్రమే. అ సమయంలోనే కరీంనగర్ కోఆపరేటివ్ బ్యాంకు సహా పలు బ్యాంకులను నష్టాల సాకుతో మూసివేసేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలు చేపట్టింది. ఆ సమయంలో బ్యాంకు ఛైర్మన్ గా ఉన్న డి.శంకర్ తో కలిసి డైరెక్టర్ బండి సంజయ్ అర్బన్ బ్యాంకును కాపాడటంలో కీలక పాత్ర పోషించారు. రుణాల రికవరీలో ముందంజలో నిలిపారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా బ్యాంకు సేవలు కొనసాగించడంలో కీలక పాత్ర పోషించారు. అర్హులైన వారందరికీ రుణాలు వచ్చేలా చేశారు. సంజయ్ డైరెక్టర్ గా ఉన్న సమయంలోనే అత్యధికంగా అర్బన్ బ్యాంకు సభ్యత్వం ఇప్పించారు. ప్రస్తుతం కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో 9,600 మంది ఓటర్లున్నారు. వీరిలో అత్యధిక మంది ఓటర్ల బండి సంజయ్ పట్ల అభిమానం ఉన్నవారేనని అర్బన్ బ్యాంకు ఓటర్లు చెబుతున్నారు. అర్బన్ బ్యాంకు లో అవినీతి, అక్రమాలు తగ్గాలంటే బీజేపీ పక్షాన ప్యానెల్ ను బరిలోకి దింపాలని కోరుతున్నారు. ఈ మేరకు బండి సంజయ్ కు, బీజేపీ నాయకులకు ఫోన్లు చేసి ఒత్తిళ్లు తెస్తున్నారు. దీనిని ద్రుష్టిలో ఉంచుకుని జిల్లా బీజేపీ నాయకులు ఈరోజు సమావేశమై పోటీ చేసే అంశంపై చర్చించారు. బీజేపీ శ్రేణులు, అర్బన్ బ్యాంకు ఓటర్ల మనోభావాలను సైతం కేంద్ర మంత్రి బండి సంజయ్ ద్రుష్టికి తీసుకెళ్లారు. బీజేపీ పక్షాన ప్యానెల్ ను బరిలో దింపాలనే భావనను వారు వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. రేపు లేదా ఎల్లుండి ఈ విషయంపై తుది నిర్ణయం ప్రకటించే అవకాశాలున్నాయి.

# పారమిత ఎక్స్‌ప్లోరికా "త్విష" దీపావళి వేడుకలు ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన

భారతశక్తి ప్రతినిధి, కరీంనగర్, అక్టోబర్ 19:

పారమిత ఎక్స్‌ప్లోరికా పాఠశాల ఆధ్వర్యంలో నగరంలోని రేకుర్తి లో దీపావళి పండుగను పురస్కరించుకుని "త్విష" 'అంతర్గత వెలుగు' పేరుతో అత్యంత వైభవంగా, అర్థవంతంగా వేడుకలను నిర్వహించారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పర్వదినం సందర్భంగా, విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దీపావళి ప్రాముఖ్యతను తెలిపే నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా, విద్యార్థులు ఉపాధ్యాయులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్, ఆహార, క్రాఫ్ట్ స్టాల్స్ చేతివృత్తుల దుకాణాలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే, విద్యార్థులు గీసిన చిత్రాలతో కూడిన కళా ప్రదర్శన ఆర్ట్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి అదనపు శోభను తెచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులలో సామాజిక బాధ్యత, దాతృత్వం వంటి గొప్ప విలువలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఫుడ్,క్రాఫ్ట్ స్టాల్స్ అమ్మకాల ద్వారా సేకరించిన మొత్తాన్ని అంధ పాఠశాల, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు విరాళంగా అందించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. పర్యావరణం పట్ల శ్రద్ధ, ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తూ, వేడుకలకు హాజరైన ప్రతి తల్లిదండ్రులకు పర్యావరణ అనుకూలతను ప్రోత్సహిస్తూ మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం సంస్థ చైర్మన్ ప్రసాద్ రావు మాట్లాడుతూ ఇలాంటి పండుగ వేడుకల ద్వారా విద్యార్థులు సృజనాత్మకత, దాతృత్వం, మన సంస్కృతి పట్ల గౌరవం పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ప్రసూన ,రష్మిత, అనుకర్ రావు ,రాకేష్, ప్రాచి, వి యు ఎం ప్రసాద్, వినోద్ రావు, ప్రిన్సిపాల్ శర్మిష్ఠ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# దివ్య దీపావళి జాతి ప్రగతికి కావాలి నూతన క్రాంతి

వెలుగులు విరజిమ్మే దీపావళి
కొత్త ఆశలతో
కొత్త ఆకాంక్షలతో
కొత్త ఆలోచనలతో
కొత్త తీర్మానాలతో
కొత్త లక్ష్యాలతో
దివ్వెల వెలుగుల
సందడి సంతోషాల
సంబరాల్లో ఇల్లంతా
నూతన శోభ వర్ధిల్లేలా
దీపావళి వేడుకలు
జరుపుదాం
మనసున ఉన్న భాధలు
మరిచిపోదాం
పగలు ప్రతీకారాలను
కక్షలు కార్పణ్యాలు
మోసం ద్వేషం
కుట్ర కుయుక్తులు
మానుకుందాం
మానవత్వాన్ని
పరిమళించే జ్యోతులమై
వికసిత భారత్ లక్ష్య
సాధనకు స్వదేశీ
స్వాలంభన సాధనకు
సారధులమైజి
సుస్థిర వృద్ధికి
పాటుపడుదాం

సుఖ సంతోషాలతో
శాంతి సౌభాగ్యాలతో
ఆత్మీయత అనురాగంతో
ఆప్యాయత అభిమానంతో
ఆదరణ ఆనందంతో
ఆర్థత సౌహార్దతతో
భందాలు అనుబంధాలతో
ప్రేమ క్షమ ధయార్ధతతో
సహకారం సమన్వయంతో
సానుకూలత సోధరత్వంతో
సహనం సంఘీబావంతో
స్నేహ సౌభ్రాతృత్వంతో
సమత మమత సమైక్యతతో
సామరస్యత మానవీయత
పరిమళాల భరిత భవితకు
భద్రతకు దీపావళి బాట కావాలి
నమ్మకాలు విశ్వాసాలతో
ఆప్యాయత అనుకూలత
లతో ఆర్ధ్రత అవగాహనతో
కుటుంబ వ్యవస్థ
పునరుజ్జీవనానికి
అంకితమౌదాం
పట్టుదల త్యాగాలతో
ప్రగతి పురోగతి కై
పాటుపాడుదాం
కుట్ర కుళ్ళు కుతంత్రాల
కుయుక్తుల ఆటకట్టించాలి
పగలు పంతాలు కల్మషం
కాలుష్యం కాఠిన్యం కలహాల
కట్టడితో
సంక్షోభ రాజకీయులు వద్దు
సంక్షేమ రాజకీయాలే హద్దు
అగ్రవాదం ఉగ్రవాదం
ఉన్మాధం కుటుంబ పాలన
నేర రాజకీయాలు అంతరించి
అవినీతి రహిత భారత్
శాంతి యుత స్వచ్ఛ భారత్
స్వయం సమృద్ధ
స్వాభిమాన భారత్
నైపుణ్యాలే ఆలంభణగా
ఆత్మనిర్భరభారత్
అభివృద్ధి భారత్ గా
అవతరించాలి
వైరస్సులనుజి
ఎదుర్కోనే మనోధైర్యం
మానవాళికి కావాలి
ఆయుధం
సంపూర్ణ ఆరోగ్యం
ఆనందంతో
మనోల్లాసంతో
మానవమనుగడ
సాధిద్దాం
సమాజంలో సామరస్య
సహజీవన సమరసత
సౌందర్య వెలుగులు
విరజిమ్మే దివ్వెలమౌదాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
గ్రామం 'కల్లెపల్లి' మండలం బెజ్జంకి జిల్లా సిద్దిపేట
9440245771

## అమీన్ పీర్ దర్గా ఉర్సు మహోత్సవాలకు సీఎం చంద్రబాబుకు అహ్వానం

# ముఖ్యమంత్రిని కలిసిన కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి


అమరావతి, అక్టోబర్ 19 కడప అమీన్ పీర్ దర్గా ఉర్సు మహోత్సవాలకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆహ్వానించారు. సీఎం చంద్రబాబును కడప అమీన్ పీర్ దర్గా పిఠాధిపతి హజ్రత్ కేఎస్ఎస్ హరిఫుల్లా హుస్సేనీ కలిసి ఆహ్వానం అందించారు. జాతీయ స్థాయిలో పేరొందిన ఈ ఉర్సు మహోత్సవాలు వచ్చే నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరుగుతున్నాయని... ఈ ఉర్సు మహోత్సవాలకు తప్పనిసరిగా హజరుకావాలని ముఖ్యమంత్రిని కోరారు. ఉర్సు మహోత్సవ ఏర్పాట్లు ఏ విధంగా జరుగుతున్నాయని సీఎం వారిని అడిగి తెలుసుకున్నారు. ఉర్సు మహోత్సవాలకు సహకారం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అమీన్ పీర్ దర్గా మేనేజర్ మొహమ్మద్ అలీ ఖాన్, బాఖీ ఉల్లాఖాన్ తదితరులు ఉన్నారు.

# జలరక్షణే జన రక్షణ

"జీవ కోటికి జలమే జీవనాధారం. జలమే జీవనం అనేది నినాదం కాకుండ జాతీయ జీవన విధానం కావాలి."

దేశ ఆర్థికాభివృద్ధిలో జలవనరులు బహుముఖ పాత్ర పోషిస్థాయి. పెరుగుతున్న జనాభా విస్తరిస్తున్న పట్టణీకరణ వల్ల జల వనరులకు డిమాండ్ పెరిగింది.గృహ అవసరాలకు అనుగుణంగా జలవనరులు పెరగడం లేదు. జలవనరుల కొరత ప్రభుత్వాలకు ప్రజలకు సవాల్ గా పరిణమించింది.

లిశీగ్రతర అభివృద్ధి నీటి వినియోగంలి వేగవంతమైన అభివృద్ధి ప్రక్రియలో భాగంగా విస్తరిస్తున్న వ్యవసాయ 'పారిశ్రామిక రంగాల్లో నీటి వినియోగం పెరిగింది. పర్యావరణ' ప్రకృతి మార్పుల వల్ల వర్షాలు సమృద్ధిగా కురువడం లేదు. ఇసుక



మాఫియా 'మైనింగ్ కార్యక్రమాలు విస్తరించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. నీటి డిమాండు' సప్లైల మధ్య వ్యత్యాసం పెరిగింది. జల వనరుల కొరత వున్న స్థితిలో నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి. వర్షం నీరును రిజర్వాయర్లలో నిలువ చేసుకోవాలి. లినీరు అభివృద్ధిలి నీరు పారిశ్రామిక అభివృద్ధికి వ్యవసాయ విస్తరణకు అత్యంత ప్రధానం. "భారత్ లో తయారీ" కార్యక్రమం విజయవంతం కావాలంటే నీరు సమృదిగా లభించాలి.

పరిశ్రమలు జల వనరులులి ఎలక్ట్రానిక్ వస్తువులు' మోటార్ వాహనాలు ' ఔషధాల తయారీ' పునరుత్పాదక ఇందన వనరులు' హైవేలు ఆహార శుద్ధి మొదలగు పరిశ్రమల అభివృద్ధికి నీరు ముఖ్య వనరు .కొరతగా ఉన్న నీటి వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలి.అప్పుడు మాత్రమే ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి ఉత్పాదకత పెరుగుతుంది.

కారు తయారీలో కారుకు వేసే రంగుల్లో నీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు.

2030 నాటికి పునరుత్పాధక ఇంధన వనరుల నుండి 50 శాతం విద్యుత్తు ఉత్పత్తి చేయాలన్న లక్ష్యం నెరవేరాలంటే జలవిద్యుత్ ఉత్పత్తి కొరకు సరిపోయే నీరు లభించాలి. సోలార్ ప్లాంట్లు 'హైడ్రోజన్ ఇంధన ఉత్పత్తి ప్రత్యక్షంగా నీటి లభ్యత మీధ ఆధారపడి వుంది. నీటిని పొదుపుగా వాడుకోవాలి.

పారిశ్రామిక అభివృద్ధి జాతీయ రహదారుల నిర్మాణం లో నీటిని జాగ్రత్తగా వాడాలి. ఔషధ రంగం అభివృద్ధికి స్వచ్ఛమైన నీటి లభ్యత అవసరం.

సమాజంలో వస్తున్న జీవన శైలి మార్పులు' ఆహార పరిశ్రమ బహుముఖంగా విస్తరించి అభివృద్ధి జరుగుతుంది.

ఈ రంగంలో చాలా మందికి ఉపాధి అవకాశాలు కల్పించె అవకాశాలు ఉన్నాయని అనేక అధ్యయనాలు వెల్లడించాయి లిరైతుల ఆదాయాలు పెరుగుతాయిలి ఆహార శుద్ధి పరిశ్రమలు విస్తరించడం వల్ల. రైతుల ఆదాయాలు పెరుగుతాయి. వారి జీవన ప్రమాణాలు తలసరి ఆదాయం పెరిగి కొనుగోలు శక్తి పెరుగుతుంది.ఆహార పరిశ్రమలో నీటికి డిమాండ్ పెరుగుతోంది. ప్రభుత్వం భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని జల వనరుల సంరక్షణ మీద దృష్టి పెట్టాలి.

నీటిని శుద్ధి చేయడం

వాడిన నీటిని శుద్ధి చేసి పునర్వినియోగించడం కోసం

పరిశ్రమలు ప్రతేక ఏర్పాట్లు చెయ్యాలి. అభివృధి చెందిన దేశాలలో వాడిన నీటిని శుద్ధి చేసి వాడే విధానాల మీధ మన దేశ శాస్త్ర వేత్తలు ఇంజనీర్లు అధ్యయనం చెయ్యాలి. నీటి పునర్వినియోగించడం పట్ల సమాజంలో అవగాహన కల్పించడానికి కేంద్ర' రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు కృషి చెయ్యాలి. అందుకు కావలసిన అభివృధి వ్యూహాన్ని రూపొందించి అమలు చేయాలి.నీటి వృధాను అరికట్టాలిలి పరిశ్రమలు అవసరం ఉన్నంత మేరకే నీటిని వినియోగించాలి. నీటి వృధాను అరికట్టాలి.

వర్షపు నీరును ఇంకుడు గుంతల ద్వారా పొదుపు చెయ్యాలి.

నీరు ప్రకృతి ప్రసాదించే వనరు

కావున పొదుపుగా వాడాలి. వర్షపు నీరును పరిశ్రమలు ఒడిసి పట్టాలి. పరిశ్రమలు తమ ఆవరణలో వర్షపు నీరు ఇంకుడు గుంతల.ద్వారా సంరక్షించే ఏర్పాటు చెయ్యాలి. ఇంకుడు గుంతల మీధ లికాలుష్య నియంత్రణ మండలి నిరంతరం తనిఖీ చేయాలిలి. వ్యర్థ జలాలను విచ్చల విడిగా రోడ్ల మీదికి వదిలితే నదులు' చెరువులు కుంటలు 'జల వనరుల కాలుష్యంపెరుగుతుంది.నీటిని వృధా చేసిన వారి మీధ ఫైన్ జరిమానాలు విధించాలి.

జల సంరక్షణ సామాజిక బాధ్యతలి పరిశ్రమలు' జల సంరక్షణ చర్యలు చేపట్టాలి. నీటిని పొదుపుగా వాడుకోవాలి. నీటిని పొదుపుగా వాడుకోవడం పరిశ్రమలు సామాజిక బాధ్యతగా భావించాలి. కొరతగా వున్న నీటి వనరులతో అధిక ఉత్పత్తి సాధించే నూతన సాంకేతికత మీద ప్రభుత్వాలు పరిశ్రమ యాజమాన్యాలు దృష్టి పెట్టాలి. పర్యావరణం 'ప్రకృతి సంరక్షణ మీధ ప్రభుత్వాలు' పౌరసమాజం జాగ్రత్త పడాలి.ప్రకృతి విపత్తుల వల్ల కలిగే పరిణామాల మీద పాఠశాల స్థాయి విద్యార్థులకు అవగాహన కలిగించాలి.

జల సంరక్షణ పద్ధతుల మీద విద్యార్థులకు అవగాహన కలిగించాలి. "జల సంరక్షణే జన సంరక్షణ" అన్న స్పృహ సమాజంలో కల్పించాలి. మహిళా సంఘాలు' యువజన సంఘాలు' పౌర సమాజం' గ్రామసభలు 'నీటి యాజమాన్య సంఘాలు డ్వాక్రా స్వశక్తి పొదుపు సంఘాలు 'స్వచ్ఛంద సంస్థలు 'సామాజిక సంస్థలు ధార్మిక సంస్థలు' జల సంరక్షణ నీటి పొదుపు విధానాలు' జల వనరుల సంరక్షణ చట్టాల మీద ప్రజలకు అవగాహన చైతన్యం కలిగించాలి.జల సంరక్షణ' నీటి పొదుపు ప్రతి పౌరుని జీవితంలో అంతర్భాగం కావాలి.

జల సంరక్షణా యజ్ఞంలో ప్రతి పౌరుడు క్రమశిక్షణ గల సైనికుడిగా తన పాత్రను పోషించాలి.

మానవ మనుగడకు సామాజిక ఆర్థికాభివృద్ధికి నీరు ప్రాణాధారం జల వనరుల రక్షణే మానవ వనరుల సంరక్షణ కేంద్రంగా కేంద్ర' రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతమైన జాతీయ జల వనరుల విధానాన్ని రూపొందించి దేశాభివృద్ధికి నీటి పొదుపు ఒక ఉద్యమం గా కొనసాగించాలి .జల వనరుల స్వయం స్వమృద్ధికై సమగ్రమైన కార్యాచరణకు ప్రభుత్వాలు పూనుకోవాలి.

నేదునూరి కనకయ్య
రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ ఎకనమిక్ ఫోరమ్
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
కరీంనగర్9440245771

# కుమ్మర్లకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

"మానవ నాగరికతకు కుమ్మరి తొలి మెట్టు ఆరోగ్యానికి కుండ ఆయువు పట్టు"మానవుడికి వంట నేర్పి మానవ జాతి చరిత్ర నిర్ధారణకు సంస్కృతి' వారసత్వ విశేషాల అధ్యయనానికి దోహదపడే కుమ్మర వృత్తి అంతరించే దశకు చేరుకుంది. మానవాళికి వంట వండటానికి వంట పాత్రలు సమకూర్చి మానవ జాతికి శాస్త్రీయ పరిజ్ఞానం అందించి ప్రజారోగ్యాన్ని పర్యావరణ పరిరక్షణకు ప్రతినిధిగా నిలిచిన కుమ్మర వృత్తి కార్మికులు ఉపాధిలేక దుర్భరమైన జీవితాలను వెళ్ళ దీస్తున్నారు.


మానవ మనుగడ కుమ్మర వృత్తి మనిషి పుట్టుక 'పెళ్లి'

'చావు' .'దైవ' కార్యక్రమాల్లో కుమ్మర్ల ఉత్పతులు కుండలు' గురుగులు' వంట కొరకు ఎసులలు 'అటికెలు నీటి నిల్వకు తొట్టీలు రంజన్లు' కధువలు పెళ్ళిళ్ళలో "ఐరేని కుండలు" వినియోగిస్తారు. కుమ్మర్లవృత్తి మానవ జాతి మనుగడలో ప్రధాన పాత్ర పోషిస్తుందనడంలో అతిశయోక్తిలేదు. చారిత్రక వాస్తవం "మొహంజదారో' "హరప్పా" "మనవుటోనియా''' "సింధూ"నాగరికత అధ్యయనాలలో వెల్లడైంది. గృహ ప్రవేశం ప్రభుత్వ భవనాల భూమి పూజ 'అమ్మవారికి సమర్పించే భోనాలు' తెలంగాణ సంస్కృతిని చాటే గోల్కొండ బోనాలు''శుభ'' "దైవ"కార్యక్రమాల్లో కుమ్మరి కుండలు ఉపయోగిస్తారు. మట్టిని నమ్ముకొని పర్యావరణ పరిరక్షణకు కవచంగా నిలిచిన కుమ్మర వృత్తి ఉనికిని కోల్పోయే స్థితిలో వుంది.

కుమ్మర్లు కేంద్ర' రాష్ట్ర ప్రభుత్వాల నిరాదరణకు గురై కుల వృతుల( మట్టి పాత్రలకు) ఉత్పతులకు గిరాకీ తగ్గటం వల్ల కుమ్మర వృత్తి పై ఆధారపడిన కుమ్మర్లు వృత్తిని వదిలి పట్టణాలకు వలస పోతున్నారు. అల్పవేతనాలకు పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురౌతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 14 లక్షల జనాభా కలిగి 8 లక్షల ఓటర్లు ఉన్న కుమ్మర్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మద్ధత్తు ఇచ్చారు. కుమ్మర్లు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. స్వరాష్ట్ర సాధనలో తెగించి కొట్లాడారు. సకల జనుల సమ్మె ' మిలియన్ మార్చ్ లో కుమ్మర్లు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. చాలా మంది కుమ్మర్లు గ్రామ 'మండల జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో వివిధ హోదాల్లో కాంగ్రెస్ పార్టీకి అంకిత భావంతో సేవలు అందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను క్షేత్ర స్థాయిలో ప్రజలవద్దకు చేర్చి పార్టీ పట్ల ప్రజల విశ్వాసాన్ని సమీకరించడంలో గణనీయమైన కృషి చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 10 సంవత్సరాలు గడిచినా గత ప్రభుత్వం కుమ్మర్లకు చట్టసభల్లో నామినేటెడ్ పదవులు ఇవ్వలేదు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైనప్పటికీ కుమ్మర కులస్థులు చట్ట సభల్లో నేటికి ప్రవేశించలేదు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో చట్ట సభల్లో ప్రవేశం లేని కులాలకు నామినేటెడ్ పదవులు ఇస్తామన్న రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ' రేవంత రెడ్డి హామీతో కుమ్మర్లు కోటి ఆశలు పెట్టుకున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 యేళ్లు ఐనప్పటికీ ఏఒక్క రాజకీయ పార్టీ అసెంబ్లీ ' లోకసభకు పోటీ చేయడానికి కుమ్మర్లకు టిక్కెట్లు ఇవ్వక పోవడం వల్ల కుమ్మర్లకు చట్ట సభల్లో ప్రవేశం లభించలేదు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేఆర్థిక స్థోమత లేని నామినేటెడ్ పదవుల్లో కుమ్మర్లకు రాజకీయ పార్టీలు అవకాశం కల్పించక పోవడం వల్ల రాజ్యాధికారం లోవాటా కుమ్మర్లకు దక్కలేదు. కుమ్మర్లను బీ 'సీ "బి" జాబితాలోచేర్చినప్పటికీ ఆశించిన విధంగా కుమ్మర్ల సామాజిక 'ఆర్థిక 'రాజకీయ వికాసం జరుగలేదు. నేటి వరకు కుమ్మర్లకు రాష్ట్రం నుండి అసెంబ్లీ 'లోకసభ 'రాజ్యసభ' కౌన్సిల్ సభ్యులుగా ఒక్కరికి కూడా అవకాశం రాలేదు.

ఉత్తరాది రాష్ట్రాల్లో కుమ్మర్లను ప్రజాపతి 'కుమార్ 'కుంభార్ ' కుమావత్ ' కుంభాకార్ అనే పేర్లతో పిలుస్తారు.ఒకే దేశం ఒకే రాజ్యాంగం ఒకే చట్టం ఒకే రిజర్వేషన్ అంటూ చెబుతున్న నాయకులకు ఉత్తర' దక్షిణ 'భారత దేశ ప్రాంతాల మధ్య వివక్ష చూపడం వల్ల ప్రభుత్వాలు పార్టీలు అవలంబిస్తున్న దంద్వ వైఖరి వల్ల తెలుగు రాష్ట్రాలలో ఉన్న కుమ్మర్లు చట్ట సభల్లో ప్రవేశానికి నోచుకోలేదు.కుమ్మర్లను "ఎమ్మెల్సీ" 'కార్పొరేషన్స్ కు ఛైర్మెన్ పదవుల్లో



నామినేట్ చేయక పోవడం వల్ల రాజ్యాధికారం కుమ్మర్లకు అందని ద్రాక్ష అయ్యింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మిషన్ కాకతీయ వల్ల చెరువుల్లో' 'కుంటల్లో మట్టి తవ్వకం వల్ల కుండలు చేయడానికి ఉపయోగించే బంక మట్టి కొరత ఏర్పడింది. మట్టి లభించే చెరువులు' కుంటలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాల్లోకి వెళ్ళటం వల్ల ఉచితంగా లభించే మట్టికి డబ్బులు చెల్లించే పరిస్థితి వచ్చింది. కుంటల్లో చెరువుల్లో కుమ్మర్లకు ఉచితంగా మట్టి లభించే ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కాలేదు.కుమ్మర వృత్తికి ముడిసరుకు మట్టి కలప లభించని పరిస్థితులు దాపురించాయి.ఈ పరిస్థితి కుమ్మర వృత్తిదారులు కుల వృత్తిని వదిలి పట్టణాలకు నగరాలకు వలసకు దారితీసింది . ఉపాధి కొరకు గుల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు.ప్లాస్టిక్ 'అల్యూమినియం పాత్రలు మార్కెట్లో లభించడం వల్ల కుండలకు వంట చేసుకునే మట్టి పాత్రలకు డిమాండ్ తగ్గింది. కుమ్మర్ల రెండు రకాలుగా నష్టపోయారు.

కుండలు 'వంట పాత్రలకు కావలసిన ముడి సరుకు మట్టి కొరత ఒక వైపు మార్కెట్లో గిరాకీ తగ్గడం మరో వైపు సమస్యలుగా పరిణమించి కుమ్మర వృత్తి కుదేలైంది. "కులవృత్తిని మించింది లేదు గువ్వల చెన్న" అన్న నానుడి కుల వృత్తిని వదిలిందే మిన్న అనేది నేడు విధానమైంది.

ఉత్తరాది రాష్ట్రాల్లో కుమ్మర్లు ఎ'ఎస్సీ ఎస్ 'టి జాబితాలో వుండడం వల్ల అనేక రాజకీయ అవకాశాలు వచ్చాయి.అనేక మంది కుమ్మర్లు శాసన సభ్యులుగా ఎం'పి 'లుగా 'శాసన మండలి సభ్యులుగా 'మంత్రులుగా తమ ప్రతిభను చాటుతున్నారు.

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు చట్ట సభల్లో అవకాశం రాలేదు. ఐ 'ఎ 'ఎస్ 'ఐ'పి' ఎస్ అధికారులుగా అవకాశం రావడం లేదు. తెలంగాణ ఉద్యమంలో కుమ్మర్లు తమ "సారే "కుల వృత్తులు ప్రదర్శిస్తూ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేశారు.అరెస్ట్ అయ్యిలాఠీ దెబ్బలు తిని జైళ్లకు వెల్లారు.

తెలంగాణ ఏర్పడి 10 యేళ్లు ఐనప్పటికీ కుమ్మర కులస్థులకు చట్టసభల్లో ప్రవేశం లభించలేదు. రాష్ట్రంలోని119 నియోజక వర్గాల్లో అసెంబ్లీ అభ్యర్థుల గెలుపు ఓటములు నిర్ణయించడంలో గణనీయమైన ఓటు బ్యాంకు వున్న కుమ్మర్లు నామినేటెడ్ పదవుల్లో నియమించ బడలేదు. తెలంగాణ మాజీ ముఖ్య మంత్రి శ్రీ' కె చంద్రశేఖర్ రావు చట్ట సభల్లో ప్రవేశం ప్రాతినిధ్యం లేని కులమైన కుమ్మర్లకు "ఎమ్మెల్సీ 'పదవికి నామినేట్ చేస్తానన్న హామీ నేటికీ నెరవేరలేదు.

తెలంగాణలో కాంగ్రెస్ అద్వర్యంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఇతర కుల వృత్తులకు ఆదుకున్నట్లే కుమ్మరవృత్తి దారులను ఆదుకోవాలి. కుమ్మర్ల సంక్షేమ చర్యలు చేపట్టాలి.

కుమ్మర వృత్తికి ఆధునిక సాంకేతికతను అందించాలి.

యువతలో నైపుణ్యాభివృద్ధి కిపెద్ద పీట వేయాలి.ప్రతి మండల జిల్లా కేంద్రంలో అధునాతన పాటరీ కలంకారీ

ఉత్పత్తి కేంద్రాలను "స్కిల్ డెవలప్మెంట్ "ప్రోగ్రాం ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.కుమ్మర వృత్తి అభివృద్ధికి మౌలిక వసతులు "వాము" బట్టీల కొరకు ఉచితంగా స్థలం సమకూర్చాలి.మట్టి సేకరణ వాము కాల్చడానికి పోరుక అడవినుండి కలప ఉచితంగా పొందడానికి ప్రభుత్వం జారీ చేసిన "జీ'వో" లు అమలు చెయ్యాలి.వాము' కొరకు కుండల' బట్టి కొరకు 'షెడ్ కొరకు ప్రభుత్వం ఉచితంగా భూమి కేటాయించాలి.

ప్రభుత్వం విధించే "సీవరేజ్ సేస్ "వృత్తి పన్ను నుండి కుమ్మర వృత్తిని మినాహాయించాలి.

చాకలి 'మంగలి వృత్తులకు ఇస్తున్న "ఉచిత విద్యుత్తు" సౌకర్యం కుమ్మర్లు ఉపయోగించే "సారే" కు వర్తింప చేయాలి. కుమ్మర్లకు గ్రామ పంచాయతీ 'మున్సిపాలిటీ' మున్సిపల్ కార్పొరేషన్లలో షాపింగ్ కాంప్లెక్స్ ల్లో వసతి ఉచితంగా కల్పించాలి. కుమ్మర్ల ఉత్పత్తులకు "రైతు బజార్లలో" స్టోరేజ్ సౌకర్యం మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి. పాటరీ కోర్స్ ను విశ్వ విద్యాలయాలలో పాఠ్యాంశంగా చేర్చాలి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

కేంద్ర ప్రభుత్వ భవిష్య నిధి పథకం ఇన్సూరెన్స్ ఆరోగ్యబీమా ప్రమాద బీమా సౌకర్యం కార్మిక మంత్రిత్వ శాఖ కుమ్మర వృత్తి దారులకు లేబర్ గుర్తింపు కార్డులు ఆరోగ్య కార్డులు ఉచితంగా ఇవ్వాలి.ప్రభుత్వం ఎండోమెంట్స్ శాఖ ద్వార

గ్రామదేవాలయలలో( పోచమ్మ 'మైసమ్మ' గ్రామ దేవతలు) కుమ్మర కులస్తులను పూజారులుగా నియమిస్తూ జీ 'వో.జారీ చెయ్యాలి.కుమ్మర వృత్తిదారులు పెన్షన్ సౌకర్యం కల్పించాలి. కుమ్మర వృత్తి దారులకు ఉచితంగా విద్యుత్తుతో నడిచే సారి( ఆదునిక పరికరం) ఇవ్వాలి.

రాష్ట్ర ప్రభుత్వం కుమ్మర్ల సమగ్రాభివృద్ధికి ఆర్థిక వికాసానికి వృత్తి నైపుణ్య అభివృధి దోహదపడే "కుమ్మర / శాలివాహన ఫైనాన్స్ ఫెడరేషన్ కు రూ" "2000 కోట్ల బడ్జెట్ కేటాయించాలి. కుమ్మర ఫైనాన్స్ ఫెడరేషన్ ను పునరుద్ధరించి ఫెడరేషన్ కు ఛైర్మెన్' మరియు అన్నిజిల్లాకు ప్రాతినిధ్యం ఇస్తు పాలక వర్గాన్ని నియమించి కుమ్మర్లలో 'ఆత్మ గౌరవాన్ని" పెంపొందించాలి. కుమ్మర్ల సమస్యల పరిష్కారంకోసం కుమ్మర్లలో నాయకత్వాన్ని ప్రోత్సహించే వాతావరణం

కల్పించే చర్యలు తీసుకోవాలి.కుమ్మర్లకు కార్పొరేషన్ పదవుల్లో నామినేట్ చేసి రాజ్యాధికారంలో భాగ స్వాములను చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ' ఎ రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేయనైనది.

కొల్లూరి అనిల్ కుమార్రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 హైదరాబాద్
9440245771

# దీపం దైవీ భావనకు ప్రతి రూపం



యావత్ హిందూ సమాజం అనాదిగా జరుపుకొనే పండుగలలో దీపావళి పండుగ మిక్కిలి ప్రశస్తమైనది. వెలుగులను విరజిమ్ముతూ చీకట్లను పారద్రోలుతూ జనావళి హృదయాలలో ఆనందోత్సా హాలతో పాటు ఆరోగ్యాన్ని, అభ్యుదయాన్ని, ఆధ్యాత్మికత్వాన్ని పెంపొందించే విధంగా దీపావళి పర్వదినాన్ని తరతరాలుగా కేవలం హిందువులే కాకుండా నేపాల్, మారిషియస్, శ్రీలంక, గయానా, ఫిజి, ఇండోనేషియా, మలేషియా, బర్మా, టిబెట్, ఆస్ట్రేలియా మొద లైన దేశప్రజలు సైతం ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఉత్తేజంగా జరుపుకునే కన్నుల పండుగ దీపావళి.

ఈ పండుగ ఆశ్వయుజ బహుళ చతుర్దశి నాడు (మరునటిరోజు అమావాస్య) వస్తుంది. దీపావళి అనగా దీపముల వరుస. ఈ పండుగనాడు పడుతులు ప్రమిదలలో చమురు పోసి, వత్తి వేసి, ఇంటి ముంగిళ్ళలోనూ, అడుగుల పైన, మెడల పైన, ఇంటి ప్రహరీ గోడల పైన వరుసగా బారులు తీర్చి దీపాలు వెలిగిస్తారు. ఈ చతుర్దశిని నరక చతుర్దశి అని, మరునాడు వచ్చే అమావాస్యను దీపావళి అమావాస్య అని కూడా అంటారు.

నిత్య చైతన్య దీప్తి సత్య దేవి

సత్యా కృష్ణులు నరకాసురునితో యుద్ధం చేసి ఈరోజే అతన్ని సంహరించారు కనుక ఇది నరక చతుర్దశి అయ్యిందని భాగవతంలోనూ, హరివంశంలోనూ హృద్యమైన పద్యాలలో వర్ణించబడింది. లోక కంటకుడైన కారణంగా తమ బిడ్డ అయినప్పటికీ ఆ నరకాసురుని హతమార్చారు సత్య కృష్ణులు. నరకాసురుడు అంటే నరకము అనగా కష్టము, బాధ అని కూడా అర్థము. లోకానికి కష్టాలను, బాధను కలిగించినవాడు నరకాసురుడు. లోక సంక్షేమం కోసం తాను పుత్ర శోకాన్ని సైతం అనుభవించింది ఆ కన్నతల్లి. గర్భశోకాన్ని తన వరకే పరిమితం చేసుకొని దుర్మార్గుడైన తన పుత్రుని వలన కలిగిన అత్యాచార, అన్యాయ, అమానవీయ చీకట్లను తొలగించిన అమృతమూర్తి. నిత్య చైతన్య దీప్తి. మహిళా లోకానికి ఆదర్శ స్త్రీమూర్తి ఆ సత్య దేవి.

ఋతుచర్య, వాయుశోధనలతో ఆరోగ్యప్ర సాదిని

వైదిక సాహిత్యంలో దీపం పరబ్రహ్మస్వరూపంగా నుతించబడింది. "అగ్ని ప్రథమః" అని ఋగ్వేదం పేర్కొంది. అందుచేతనే ప్రతి పూజలోనూ ముందుగా దీపాన్ని వెలిగిస్తారు. ఋగ్వేదంలోని ప్రథమ సూక్తం లో ఇలా చెప్పబడింది.

లిదీపం జ్యోతి పరబ్రహ్మాబీ
దీపం సర్వతమోహాతే?
దీపేన సాధ్యతే సర్వంబీ
దీపలక్ష్మీ నమోస్తుతే?

(దీపం జ్యోతి స్వరూపంలోని పరబ్రహ్మము. సమస్త అంధకారాలను దూరం చేసి వెలుగులు ప్రసాదిస్తుంది. ఎంతటి కష్టతరములైన కార్యాలనైనా సాధింపబడుతుంది. ఇంతటి మహత్తరమైన శక్తి కలిగి ఉన్న దీపలక్ష్మీ దేవికి నేను నమస్కరిస్తున్నాను.) అంటూ, ప్రతి నిత్యం ప్రాతః సాయం సంధ్యల యందు నమస్కరిస్తారు హైందవులు. ఇలా అనుదినం ఉదయ సాయం సంధ్యల యందు దీపారాధన చేయడం వల్ల క్రమంగా వ్యక్తిలో దైవీభావన పెంపొందుతుంది. దానివలన వినయం, వివేకం ఏర్పడతాయి. ఇలా వినయవంతుడు తన చుట్టూ ఉన్న సమాజానికి ఎలాంటి చెడు చేయకుండా జీవిస్తాడు. అది తెలియని వాడు నరకాసురుడిలా ఈ ప్రపంచమంతా తన కోసమే ఉందని భ్రమపడి తన స్వార్థ ప్రయోజనాల కోసమే అన్నింటినీ అందరినీ ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. అందుకు పరులను బాధిస్తాడు. ఇది దానవ లక్షణం. నరక చతుర్దశి లోని 'నరక' అన్న పేరుకు నరకాసురుడు కాక నరకం అంటే 'స్వర్గం కానిది' అని అర్థాన్ని గ్రహించాల్సి ఉంటుంది.



నరకాయ ప్రదాతవ్యోబీ
దీపస్సంపూజ్య దేవతా?
చతుర్దశ్యాంతు యే దీపోబీ
నరకాయ ప్రదీయతే?
తేషాం పితృ గణాం సర్వే?
నరకాత్స్వర్గ మవాప్నుయు?

(నరకం కలుగకుండా దీపం వెలిగించాలి. చతుర్దశి నాడు ఎవరైతే ఈ దీపం వెలిగిస్తారో వారికి, వారి పితృదేవతలకు నరకం తొలగి, స్వర్గం ప్రాప్తిస్తుంద) ని పై శాస్త్ర వచనం తెలియజేస్తుంది.

ఇక దీపావళి నాడు తైలాభ్యంగన స్నానానికి విశేషమైన మహత్తు ఉన్నది. ఈ రోజున నువ్వుల నూనెలో లక్ష్మీదేవి ఉంటుందని హిందువుల ప్రగాఢ నమ్మకం. నదులు, బావులు, చెరువుల లోని నీటిలో గంగామాత కొలువుదీరి ఉంటుందని హిందువులంతా నమ్ముతారు. ఈ విషయాన్నే ఈ శ్లోకం వివరిస్తుంది.

తైలే లక్ష్మీర్జలే గంగాబీ
దీపావళి తిథౌ వసేత్?
అలక్ష్మీ పరిహారార్థంబీ
తైలాభ్యంగో విధీయతే?



ఈరోజు తలంటుకొని స్నానం చేయడం వల్ల అంతవరకు ఉన్న దారిద్ర్యం అంతా తొలగిపోతుంది. గంగా స్నానఫలం కూడా దక్కుతుంది. ఇక నరకప్రాప్తి భయం తొలగుతుంది. అయితే సూర్యోదయానికి ముందు నాలుగు ఘడియల కాలం అరుణోదయ సమయం. ఆలోగా తలస్నానం చేయడం ఎంతో శ్రేష్ఠం. ఒకవేళ అలా వీలుకాకపోతే సూర్యోదయానంతరమైన తప్పనిసరిగా తలంటు స్నానం చేయాలని శాస్త్రం చెబుతుంది.

ఈ పండగ వెనుక మరొక విశేష ఆరోగ్య ప్రయోజనం కూడా దాగుంది. ఇది శరదృతువులో వస్తుంది. కనుక ఈ ఋతువు ప్రభావంతో ప్రకృతిలో ఏర్పడిన కల్మషాలను సరిదిద్ది సకల ప్రాణుల ఆరోగ్యాలకు ఎటువంటి భంగం వాటిల్లకుండా చేసుకోవడానికి మన పూర్వీకులు మనకు ఒక అద్భుతమైన, ఆరోగ్యకరమైన, ఆనందదాయకమైన మార్గాన్ని నిర్దేశించారు. దీనికే ఋతు చర్య అని పేరు. అందులో భాగమే ఈ వాయు శోధనము. అనగా వాయు కాలుష్య నివారణము.

శరదృతువులో వర్ష ఋతువు ప్రభావం వల్ల రోగకారక క్రిములు ఎన్నో వాతావరణంలో పుడతాయి. రోగాలను వ్యాపింపజేసే క్రిములను నాశనం చేయాల్సి ఉంటుంది. ఈ రోగకారక క్రిములలో కొన్ని కాంతికి, కొన్ని వాసనకు, మరికొన్ని శబ్దానికి అంతరించడమో లేదా పారిపోవడమో జరుగుతుంది. కాబట్టి దీపావళి రోజున మతాబుల వంటి కాంతిని ఇచ్చేవి వాటిలో వాడిన గంధకం వంటి రసాయనాల వలన వచ్చే వాసన, టపాసుల వల్ల వచ్చే శబ్దం వీటన్నింటి వల్ల వాతావరణంలో వాయుశోధన జరిగి వాతావరణం కాలుష్య రహితంగా మారుతుంది.

నవ్వుల పువ్వుల తారాజువ్వల దీపావళి

ఈ దీపావళి పర్వదినం నవ్వుల పువ్వులు తారాజువ్వల వలే విరజిమ్మే సంతోషాల సంబరం అనవచ్చు. ఈ పర్వదినం సమాజంలోని అజ్ఞాన, అత్యాచార, దురాచార, అన్యాయ, అక్రమాలను పారద్రోలి లి''తమసోమా జ్యోతిర్గమయ''లి అనే వేదోక్తికి సప్రమాణికంగా జ్ఞాన, సత్య, అభ్యుదయ, ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ సంస్కారమనే దివ్య తేజోవధాన నడుపుతుంది దీపావళి పర్వదినం. ప్రతి వ్యక్తి జ్ఞాన దీపకళికగా మారి, మానవీయ విలువలను పరిరక్షిస్తూ, సనాతన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందజేయాలి. యావత్తు జగత్తును దివ్య జ్యోతిర్పథాన పయనింపజేయాలని దీపావళి సందేశంగా మనమంతా గ్రహిద్దాం! ఆ ఆలోచనతో దీపావళిని జరుపుకుందాం! 'లోకాస్సమస్తా సుఖినోభవన్తు'

వ్యాస కర్త:
"సాహిత్య కళా విభూషణ్"
చౌదూరి నరసింహారావు
ప్రవచన కర్త, ఆధ్యాత్మిక విశ్లేషకులు
భాగ్యనగరం 9705100788

## బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటుంది కేంద్ర బిజెపి ప్రభుత్వమే : సీపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 19: కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీ 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం జరిగిన రాష్ట్రవ్యాప్త బందులో సిపిఎం నాయకులు పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుంది కేంద్ర బిజెపి ప్రభుత్వమేనని రాష్ట్ర ప్రభుత్వం జీవోను తీసుకొచ్చి గవర్నర్ కు పంపినా గాని పక్కన పెట్టడం బిజెపి పని అని అన్నారు. అదేవిధంగా పార్లమెంటులో చట్టం చేసి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాల్సిన బాధ్యత బిజెపి ప్రభుత్వం మీద ఉన్నాకాని అక్కడ చేర్చకుండా నిర్లక్ష్యం చేస్తూ తెలంగాణలో మాత్రం బీసీలకు సపోర్ట్ చేస్తూ బందులో పాల్గొనడం శోచనీయమని అన్నారు. బీసీల పట్ల బిజెపి ద్వంద వైఖరి ఆవలంబిస్తూ మోసం చేస్తుందని అన్నారు. అదేవిధంగా ఈడబ్ల్యూఎస్ ప్రకారం ఓసీలకు 10 శాతం రిజర్వేషన్లు ఉన్నా కానీ కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి మళ్లీ ఓసీలకు రిజర్వేషన్లు కల్పించాలని మాట్లాడుతున్నాడని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఎవరికి వర్తిస్తాయో




కూడా ఎమ్మెల్యేకు తెలవకపోవడం అలాంటి వ్యక్తిని కామారెడ్డి ప్రజలు ఎన్నుకున్నారని అన్నారు. అలాగే కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ బీసీలను అవమాన పరుస్తూ రిజర్వేషన్లు ఇచ్చేది లేదు ఒక్క తెలంగాణలో ఇస్తే దేశమంతా అడుగుతారు అని మాట్లాడడం సిగ్గుచేటనే విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ గౌడ్, మోతి రామ్ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు ముదా%శీ% అరుణ్ నాయక్, మోహన్ నాయక్ సత్యం మంద శీను దశరథ్ రాహుల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సోలిపేటలోధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం: మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట,భారత శక్తి ప్రతినిధి,అక్టోబర్ 19:

సూర్యాపేట మండలంలోని సోలిపేట గ్రామంలో ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా కొప్పుల వేణారెడ్డి గారు మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించాలి, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైఎస్సార్, ఆర్డీఆర్ గార్ల ఆలోచన మేరకు ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి క్వింటాకు 500 బోనస్ అందిస్తున్నట్లు గుర్తు చేశారు. రైతులకు ఉచిత కరెంట్, రుణ మాఫీ, రైతు భరోసా, 500 బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని అన్నారు.దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెలిపారు. అందుకోసమే రాష్ట్రంలో సన్నాలు పండించే రైతులను ప్రోత్సహిస్తుందని అన్నారు. దీనివల్ల మన రైతుల వద్దనే సన్నాలు కొని మళ్ళీ మనకే సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందువలన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే పంటను అమ్మాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియడం లేదని కావున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. తేమ 17 శాతం ఉండాలని, బస్తా 41 కేజీలు మాత్రమే తూకం వేయాలని ఈ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బీరవోలు రవీందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బీరవోలు వీరారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలి, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ళ రమేష్, మాజీ వైస్ ఎంపిపి రామసాని శ్రీనివాస్, దండు మైసమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు గోగిరెడ్డి



వెంకటరెడ్డి, చెరుకు వెంకన్న, కందుల అశోక్ రెడ్డి, కుశలవ రెడ్డి, గొల్ల రమేష్, చందా గోపాల్, స్థానిక రైతులు బీరువాలు శేఖర్ రెడ్డి, ఉగ్గం మల్లికార్జున్, పల్స జానయ్య, సిసి యాదగిరి, సంఘం బంధం సభ్యులు, మిద్దె కిరణ్,శ్రవణ్, మాజీ ప్రజా ప్రతినిధులు,అధికారులు, గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో చిరు వ్యాపారులతో జగ్గారెడ్డి మాట ముచ్చట

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 19 :

దీపావళి పండుగ సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో ఐబి గెస్ట్ హౌస్ సమీపంలో పండుగ కోసం ఉపయోగించే బొమ్మలు, ప్రమిదలు , పూల దుకాణాలు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఐ బి నుండి వెళ్తుండగా చిరు వ్యాపారులకు చూసి కాసేపు ఆగి వారితో ముచ్చటించారు.

బొమ్మలు, ప్రమిదలు ఎక్కడి నుండి తీసుకువస్తున్నారు. రోజూ ఎంత గిరాకీ అవుతుంది. ఎంత గిట్టుబాటు అవుతోంది అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. చివరగా వారి వద్ద నుండి బొమ్మలు, ప్రమిదలు కొనుగోలు చేశారు.



# ఘనంగా జరిగిన గీత పనివారల సంఘం 68 వ వార్షికోత్సవాలు

* **దుక్కి దున్నేవాడిదే భూమి...గీత గీసే వాడిదే చెట్టు...**
* **68 ఏండ్ల క్రితమే కామ్రేడ్ ధర్మ బిక్షం స్థాపించిన గీత పనివారల సంఘం**
* **13 కోట్ల నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలనీ డిమాండ్..**

ఎల్బీనగర్, అక్టోబర్ 19 (భారత శక్తి): గీత పనివారల సంఘం తెలంగాణ రాష్ట్ర 68వ వార్షికోత్సవాలు ఆదివారం భగత్ సింగ్ నగర్ లో ఘనంగా జరిపారు.ఈ సమావేశం గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గీత పనివారల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ బొమ్మగాని ప్రభాకర్ హాజరయ్యారు..ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ మాట్లాడుతూ, గీత పని వారాల సంఘ సభ్యులకు 68వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కార్మిక, కర్షక లోకం కోసం ఎలాంటి సంఘాలు లేనప్పుడే కామ్రేడ్ ధర్మ బిక్షం1957 లోనే గీత గీసే వాడిదే చెట్టు అని ప్రత్యేకంగా కల్లు గీసే వారి కోసం గీత పనివారల సంఘం ఏర్పాటు చేశారు. తాటి చెట్ల మీద నుండి పడి ప్రమాదవశాత్తు చనిపోయిన వారి కోసం ఇచ్చే



నష్టపరిహారం13 కోట్ల రూపాయలు ఇప్పటివరకు కూడా ప్రభుత్వము మంజూరు చేయడం లేదని, వెంటనే గీత కార్మికులకు ఇచ్చే నష్టపరిహారం వారి కుటుంబ సభ్యులకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కేవిఎల్, కోఆర్డినేట్ సెక్రటరీ నాగభూషణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి రాములు, గీత పని వారల సంఘం రాష్ట్ర సభ్యులు బాల్ రాజ్ గౌడ్, సిపిఐ పార్టీ సరూర్నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ సిపిఐ పార్టీ మాజీ సర్పంచ్ ఆర్ గోపాల్, గీత సంఘం నాయకులు జెన్ను యాలాద్రి, పాపయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## జెవిఆర్ పార్క్‌లో జిహెచ్ఎంసి అధ్వర్యంలో ఇండీ కుక్క పిల్లల దత్తత శిబిరం

* **11 కుక్క పిల్లలను దత్తత తీసుకున్న పెట్ లవర్స్**

హైదరాబాద్,అక్టోబర్ 19 (భారత శక్తి): జీహెచ్ఎంసీ అధ్వర్యంలో జెవిఆర్ పార్క్‌లో ఆదివారం వెటర్నరీ అధికారులు ఇండీ కుక్క పిల్లల దత్తత శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొత్తం16 కుక్క పిల్లలను ప్రదర్శించగా,11 పిల్లలను జంతు ప్రేమికులు దత్తత తీసుకున్నారు. ప్రధాన వెటర్నరీ అధికారి డా. అబ్దుల్ వకీల్ ఇతర వెటర్నరీ అధికారులు హాజరై, దత్తత తీసుకున్న కుక్క పిల్లలను యజమానులకు అందజేశారు. దేశీ జాతి కుక్క పిల్లల దత్తతను ప్రోత్సహించడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ ఈ కార్యక్రమం చేపడుతుందని తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి..!

ఎల్బీనగర్, అక్టోబర్ 19 (భారత శక్తి): హయత్ నగర్ డివిజన్లోని సుభద్ర నగర్ సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ ఫోరం హాల్ వద్ద సుభద్ర నగర్ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరం, సుభద్ర నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సిరి వల్లబ్ హాస్పిటల్స్ వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీవాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందించవలసిన విషయమని, సీనియర్ సిటిజన్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కలిసికట్టుగా ఉంటూ ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడాన్ని వారు అభినందించారు. అదేవిధంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన సిరి వల్లబ్ హాస్పిటల్స్



వారికి కార్పోరేటర్ ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సిరి వల్లబ్ సిబ్బంది డా. రాఘవ ఆదిత్య, డా. అపూర్వ, డా. భాగ్యానంద్,కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు డా. అప్పారావు, బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ప్రారంభ మహేష్, బిజెపి సీనియర్ నాయకులు సంఘీ అశోక్, ఆకుల అరుణ్ , ఎర్ర ప్రేమ, బీజేవైఎం అధ్యక్షులు అఖిల్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..

## ఆదివారం కూడా అవిశ్రాంతంగా జీహెచ్ఎంసీ రోడ్ సేఫ్టీ డ్రైవ్

* **నగరంలో నేటి వరకూ 17,400 కు పైగా గుంతలు పూడ్చివేత**

హైదరాబాద్, అక్టోబర్ 19 (భారత శక్తి): సెలవు రోజైన ఆదివారం రోజు కూడా రోడ్ సేఫ్టీ డ్రైవ్ పనులు నగర వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగాయి.వచ్చే మంగళవారం కల్లా నగరంలోని ప్రధాన రోడ్లపై ఉన్న గుంతలను పూర్తిగా పూడ్చాలన్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ విస్పష్ట ఆదేశాలతో అవిశ్రాంతంగా పనులు కొనసాగుతున్నాయి. జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.మహా నగరంలో 19 వేల గుంతలు ఉన్నట్లు గుర్తించిన ఇంజనీరింగ్ అధికారులు వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో డ్రైవ్ ను ముమ్మరం చేశారు.ఇప్పటి వరకూ 17,400 గుంతలను పూడ్చారు. మొదట ప్రధాన రోడ్లు,ఆ తర్వాత మిగతా రోడ్లపైన ఉన్న గుంతలను సాధ్యమైనంత త్వరగా పూడ్చి ప్రయాణికులు,వాహనదారుల ఇక్కట్లు దూరం చేయాలనే లక్ష్యంతో ఇంజనీరింగ్ విభాగం పనిచేస్తుంది.



## పోలీస్ శాఖ తరపున దీపావళి శుభాకాంక్షలు:జిల్లా ఎస్పి నరసింహ

* **బాణసంచా కాల్చె సమయంలో జాగ్రత్తలు పాటించాలి.**
* **అనుమతులు లేకుండా ఎక్కడపడితే అక్కడ క్రాకర్స్ అమ్మవద్దు.**

సూర్యాపేట, అక్టోబర్ 19 (భారత్ శక్తి ప్రతినిధి): దీపావళి పండుగ పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉత్సవాలు జరుపుకోవాలని సంప్రదాయ పండుగలు అందరూ కలిసిమెలిసి నిర్వహించుకోవాలని కోరారు. ఉత్సవాల పేరుతో ఇతరులను ఇబ్బందులకు గురి చేయొద్దని,




మహిళలను గౌరవించాలని తెలిపారు. అధికారుల అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ బాణాసంచా విక్రయాలు చేయవద్దు అని కోరారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకర సంఘటనలను నివారించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ గారు పేర్కొన్నారు. బాణాసంచా తయారీదారులు, సరఫరాదారులు, విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజలందరూ కలిసిమెలిసి ప్రమాదాలకు దూరంగా ఉంటూ ఉత్సవాలు సురక్షితంగా, శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.




## రంగుల మట్టి దీపాల పెట్టెలు పంపిణీ

* **హెచ్మెం.డీ.ఏ. కార్యాలయంలో దీపావళి సందడి..**
* **సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్..**

హైదరాబాద్, అక్టోబర్ 19 (భారత శక్తి): దీపావళి పండుగ సందర్భంగా, హెచ్.ఎమ్.డి.ఏ. మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఐ ఏ ఎస్ ఆదివారం రోజు అమీరపేటలోని హెచ్.ఎమ్.డి.ఏ. కార్యాలయంలో అధికారులకు, సిబ్బందికి రంగు రంగుల మట్టి దీపాల పెట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హెచ్.ఏం.డీ.ఏ. ఉద్యోగులందరికీ ముందస్తుగా హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీవత్స కోట, ఐ ఏ ఎస్, సలహాదారు బ్రిగేడియర్ సోమశంకర్, ఎస్.ఏం. (రిటైర్డ్); చీఫ్ ఇంజనీర్ బి. రవీందర్, ఇతర సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


సంగారెడ్డి, అక్టోబర్ 19 (భారత శక్తి ప్రతినిధి): దీపాల తేజస్సుతో అంధకారాన్ని పారద్రోలే దీపావళి పండుగను ప్రజలు సంతోషంగా, సఖ్యతతో జరుపుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రతి ఇంటా వెలుగులు నిండిపోవాలని, ప్రతి హృదయం ఆనందంతో మిలమిలలాడాలని ఆకాంక్షించారు.దీపావళి పండుగ మనకు సత్సంకల్పం, సత్కార్యానికి నిదర్శనమని ఎమ్మెల్యే



పేర్కొన్నారు. మన సమాజంలో ప్రేమ, ఐకమత్యం, పరస్పర సహకారం పెంపొందించేలా ఈ పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు. పిల్లలు పటాకులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.ప్రతి ఇంటిలో ఆనందం, సుఖశాంతులు, ఐశ్వర్యం నెలకొనాలని, వెలుగు పండుగ అందరికీ కొత్త ఆశలు, విజయాలు తీసుకురావాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆకాంక్షించారు.

## దీపావళి వెలుగులు జిల్లా ప్రజల జీవితాల్లో ఆనందం నింపాలి: కలెక్టర్ పి. ప్రావీణ్య


సంగారెడ్డి, అక్టోబర్ 19(భారత శక్తి ప్రతినిధి) :సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య జిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ వెలుగులు ప్రతి ఇంటిలో ఆనందం నింపాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు దీపావళి పండుగను ఉత్సాహంగా జరుపుకుంటూ, అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.టపాసులు కాల్చేటప్పుడు ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. టపాసులు విక్రయించే దుకాణదారులు ప్రభుత్వ అనుమతులు పొందిన నాణ్యమైన పటాకులు మాత్రమే అమ్మాలని, సరసమైన ధరలకు వినియోగదారులకు అందించాలన్నారు.పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలని కలెక్టర్ సూచించారు.టపాసులు కాల్చేటప్పుడు సింథటిక్ వస్త్రాలు ధరించకుండా, కాటన్ దుస్తులు ధరించడం సురక్షితమని కలెక్టర్ తెలిపారు. పటాకులు కాల్చేటప్పుడు పెట్రోలు, డీజిల్ వంటి దహన పదార్థాల దగ్గరికి వెళ్లకూడదని, అలాగే పర్యావరణహిత పటాకులను వినియోగించడం ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చని అన్నారు. అగ్ని ప్రమాదాలు లేదా గాయాలు సంభవించిన సందర్భంలో వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని లేదా అగ్నిమాపక శాఖను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నంబర్ 101



కు సమాచారమివ్వాలని సూచించారు.శాంతి, భద్రత, ఆనందాలతో కూడిన దీపావళి పండుగ జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు.

## జిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి, అక్టోబర్ 19 (భారత శక్తి): శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆనందంగా, సురక్షితంగా దీపావళి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో తగు



జాగ్రత్తలు తీసుకోవాలని, పెద్దలు పర్యవేక్షణలో ఉండాలని కలెక్టర్ సూచించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ దీపావళి వెలుగులు ప్రతి ఇంటికి సంతోషం, ఆరోగ్యం, ఆనందాన్ని నింపాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు.

# మావోయిస్టులతో సంబంధాలు తెంచుకోండి: తెలంగాణ నేతలకు బండి సంజయ్ తీవ్ర హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్ 19 (భారత శక్తి) : తెలంగాణలోని కొందరు రాజకీయ నాయకులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. మావోయిస్టులతో ఉన్న సంబంధాలను వెంటనే తెంచుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఓ పోస్ట్ చేశారు. "తెలంగాణ రాజకీయ నాయకులు దీనిని ఒక హెచ్చరికగా పరిగణించండి. వేదికలపై ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతూ, తెరవెనుక సాయుధ గ్రూపులకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వెంటనే తమ సంబంధాలను వదులుకోవాలి. లేదంటే వారిని బట్టబయలు చేస్తాం. కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యలు కేవలం మావోయిస్టు కేడర్‌తోనే ఆగిపోవు" అని బండి సంజయ్ తన పోస్ట్‌లో గట్టిగా హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో అవినీతి, నేరాలు, తీవ్రవాద సంబంధాలను కాపాడుతున్న శక్తులను కేంద్రం కనికరం లేకుండా అణిచివేస్తుందని ఆయన తెలిపారు. "సమస్యలో భాగమైన వారు ఎంత పెద్దవారైనా సరే.. పక్కకు తప్పుకోండి. దేశ అంతర్గత భద్రత విషయంలో తప్పు వైపు నిలబడితే ఎంతటి ఉన్నత నాయకులైనా పతనం కాక తప్పదు" అని స్పష్టం చేశారు. ఇటీవల మహారాష్ట్రలో లొంగిపోయిన సీనియర్ మావోయిస్టు నేత, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బండి సంజయ్ ఈ హెచ్చరిక చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రూ.6 కోట్ల రివార్డు ఉన్న భూపతి, మరో 60 మంది కేడర్‌తో కలిసి అక్టోబర్ 15న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయారు. తెలంగాణలోని కొందరు రాజకీయ నాయకుల రహస్య అండతో మావోయిస్టు పార్టీలోని ఒక వర్గం పనిచేస్తోందని భూపతి పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. అంతర్గత కలహాల వల్లే మావోయిస్టు పార్టీ విచ్ఛిన్నమవుతోందని, గిరిజనులు, పేదల కోసం పనిచేయాలన్న ప్రాథమిక సిద్ధాంతం నుంచి పార్టీ పక్కకు జరిగిందని కూడా ఆయన పేర్కొన్నారు. నక్సలిజం పతనమవుతోందని బండి సంజయ్ గతంలోనే వ్యాఖ్యానించారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు 2,100 మంది మావోయిస్టులు లొంగిపోయారని, 1,785 మందిని అరెస్టు చేశామని, 477 మందిని మట్టుబెట్టామని ఆయన తెలిపారు. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## దీపావళి వేళ పారిశ్రామిక రంగానికి తియ్యని కబురు చెప్పిన సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 19 (భారత శక్తి) :దీపావళి పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని పారిశ్రామిక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పరిశ్రమలకు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలకు సంబంధించి తొలి విడతగా రూ. 1,500 కోట్లను విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ పండుగ చీకటిపై వెలుగు సాధించే విజయానికి ప్రతీక అని, ఈ స్ఫూర్తితోనే పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తున్నామని ఆయన తెలిపారు. ఆర్థికంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, పారిశ్రామిక రంగానికి అండగా నిలబడాలన్న తమ నిబద్ధతలో వెనకడుగు వేసేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పెట్టుబడిదారులలో విశ్వాసాన్ని బలోపేతం చేసి, రాష్ట్రాన్ని వ్యాపారానికి, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పందిస్తూ, "ఆశావహ దృక్పథమే పురోభివృద్ధికి చోదకశక్తి. ఈ నమ్మకంతోనే ఉజ్వల భవిష్యత్తు వైపు రాష్ట్రాన్ని నడిపించే మార్గాన్ని ప్రకాశవంతం చేస్తూనే ఉంటాం" అని పేర్కొన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయగలమని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేసింది. తాజా నిర్ణయంతో పారిశ్రామిక వర్గాల్లో నూతనోత్సాహం నెలకొంది.

## బీఆర్ఎస్ ఓటమికి అసలు కారణం అదే! : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 19 (భారత శక్తి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి ధరణి చట్టమే ప్రధాన కారణమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ఒక్క చట్టం వల్లే బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సర్వేయర్లకు లైసెన్సుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కొంతమంది దొరలు భూములపై పెత్తనం చెలాయించేందుకే గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తమ పార్టీ గెలుపునకు చాలా కారణాలు ఉండవచ్చని, కానీ బీఆర్ఎస్ ఓటమికి మాత్రం ధరణి మాత్రమే కారణమని ఆయన అన్నారు. తాము అధికారంలోకి వస్తే ధరణి నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామని గుర్తుచేశారు. ఆ మాట ప్రకారమే, అధికారం చేపట్టిన వెంటనే ధరణిని రద్దు చేసి 'భూ భారతి' అనే కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చామని ఆయన వివరించారు. ఉద్యోగ నియామకాల విషయంలోనూ గత ప్రభుత్వంపై సీఎం విమర్శలు గుప్పించారు. వారి హయాంలో టీజీపీఎస్సీ ఓ పునరావాస కేంద్రంగా మారిందని, ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో లీక్ అయ్యేవని ఆరోపించారు. కానీ తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. కొందరు కావాలనే కోర్టుల్లో కేసులు వేసి నియామక ప్రక్రియను అడ్డుకుంటున్నారని, అయినప్పటికీ న్యాయపోరాటం చేసి అభ్యర్థులకు ఉద్యోగాలు ఇస్తున్నామని చెప్పారు. త్వరలోనే గ్రూప్ 3, గ్రూప్ 4 నియామకాలు కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, లైసెన్సులు పొందిన కొత్త సర్వేయర్లను సీఎం అభినందించారు. చరిత్రలో భూమి కోసమే ఎన్నో యుద్ధాలు జరిగాయని, సర్వేలో చిన్న తప్పు జరిగినా ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. సర్వేయర్లందరూ బాధ్యతాయుతంగా పనిచేసి, రైతులకు అండగా నిలవాలని ఆయన సూచించారు.

* **హైదరాబాద్ అభివృద్ధికి యాదవుల చేయూత అవసరం: సీఎం రేవంత్ రెడ్డి**

తెలంగాణ అభివృద్ధిలో యాదవులకు సముచిత స్థానం కల్పించడంతో పాటు, వారికి రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు తన ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా యాదవ సోదరులు ఎదురుచూస్తున్న సదర్ ఉత్సవాన్ని తమ ప్రభుత్వం అధికారికంగా రాష్ట్ర పండుగగా గుర్తించిందని ఆయన ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించిన సదర్ ఉత్సవ వేడుకలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవ సమాజం పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని అన్నారు. వారి సహకారంతోనే నగరాన్ని మరింత ముందుకు తీసుకెళ్లగలమని అభిప్రాయపడ్డారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యాదవుల ఆకాంక్షను నెరవేర్చిందని తెలిపారు. "తెలంగాణ ప్రభుత్వంలో యాదవులది అత్యంత కీలకమైన పాత్ర. వారికి మరిన్ని అవకాశాలు కల్పించేందుకు పార్టీ అధిష్ఠానానికి సిఫార్సు చేస్తాను" అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి యాదవులకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో ముందుందని గుర్తుచేశారు. హైదరాబాద్ అభివృద్ధి, తెలంగాణ ప్రగతికి యాదవుల సహకారం ఎంతో అవసరమని, అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ప్రకటనతో సదర్ ఉత్సవ ప్రాంగణంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

## 25 నుంచి కవిత 'జాగృతి జనం బాట'.. శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు

తిరుమల, అక్టోబర్ 19 (భారత శక్తి) : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత త్వరలో ఒక కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 'జాగృతి జనం బాట' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆమె తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి 'జాగృతి జనం బాట' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కవిత వెల్లడించారు. ఈ కార్యక్రమం సుమారు నాలుగు నెలల పాటు కొనసాగుతుందని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలోనే, కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తి కావాలని శ్రీవారిని ప్రార్థించినట్లు ఆమె పేర్కొన్నారు. ఆదివారం ఉదయం తన భర్త అనిల్‌తో కలిసి తిరుమల చేరుకున్న కవిత, వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయం వద్దకు చేరుకున్న కవిత దంపతులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వారికి ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

హైదరాబాద్, అక్టోబర్ 19 (భారత శక్తి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో మరోసారి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉన్న ఈ ఆవర్తనం మంగళవారం నాటికి అల్పపీడనంగా మారనుందని తెలిపింది. రాబోయే 48 గంటల్లో ఇది పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడి వాయుగుండంగా మారవచ్చని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో 22వ తేదీ నుంచి పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేశ్ కుమార్ మత్స్యకారులకు కీలక సూచనలు జారీ చేశారు. 21వ తేదీ మధ్యాహ్నం నుంచి వాతావరణ పరిస్థితులు తీవ్రంగా మారనున్నాయని, అందువల్ల ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న జాలర్లు వెంటనే తీరానికి తిరిగి రావాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మత్స్యశాఖ లేదా స్థానిక రెవెన్యూ అధికారులను సంప్రదించాలని తెలిపారు. నేడు శ్రీకాకుళం, విజయనగరం, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు, తెలంగాణలోనూ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. నేడు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడొచ్చని తెలిపింది. రేపు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగుతో పాటు రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఈ రెండు రోజులు పలు జిల్లాల్లో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన ఉరుములతో వర్షాలు పడతాయని అధికారులు హెచ్చరించారు.

## 'జూబ్లీహిల్స్'లో ఓట్లు చీల్చేందుకే బీఆర్ఎస్ ఈ ఎత్తుగడ వేసింది

హైదరాబాద్, అక్టోబర్ 19 (భారత శక్తి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాటల యుద్ధం మరింత ముదిరింది. విపక్షాలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగబోయే ఉప ఎన్నికలో బీజేపీతో ఆ పార్టీ లోపాయికారీ ఒప్పందం చేసుకుందని తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ఓట్లను చీల్చేందుకే బీఆర్ఎస్ ఈ ఎత్తుగడ వేస్తోందని ఆయన విమర్శించారు. ఆదివారం చారిత్రక చార్మినార్ వద్ద జరిగిన రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీతో బీఆర్ఎస్ రహస్య ఒప్పందం చేసుకుందని ఆయన ఆరోపించారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు 21 శాతం బీజేపీకి బదిలీ కావడమే వారి కుట్ర రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. "ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా బీఆర్ఎస్ అదే రాజకీయ వ్యూహాన్ని అనుసరిస్తోంది" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీల మధ్య పొత్తు రాజకీయాలు కొనసాగుతాయని ఆయన జోస్యం చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓట్లను చీల్చేందుకు బీఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాజకీయాల్లో యువత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 18 ఏళ్లకు తగ్గించి దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్ఫూర్తిని బలోపేతం చేశారని గుర్తుచేశారు. దేశ సమగ్రతను కాపాడేందుకు రాజీవ్ గాంధీ చార్మినార్ నుంచి ప్రారంభించిన సద్భావన యాత్ర స్ఫూర్తిని కొనసాగించడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్‌కు రాజీవ్ గాంధీ సద్భావన పురస్కారాన్ని సీఎం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తదితర నేతలు పాల్గొన్నారు.

## ఆర్టీఏ చెక్‌పోస్టుల్లో అవినీతి బాగోతం.. ఏసీబీ దాడులతో బట్టబయలు

హైదరాబాద్, అక్టోబర్ 19 (భారత శక్తి) : తెలంగాణవ్యాప్తంగా పలు రవాణా శాఖ (ఆర్టీఏ) చెక్‌పోస్టులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శనివారం రాత్రి మెరుపుదాడులు నిర్వహించారు. ఆర్టీఏ అధికారులు ప్రైవేట్ ఏజెంట్లను నియమించుకుని లారీ డ్రైవర్లు, క్లీనర్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న పక్కా సమాచారంతో ఈ సోదాలు చేపట్టారు. ఈ దాడుల్లో లెక్కల్లో చూపని రూ. 4.18 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ వర్గాల కథనం ప్రకారం, రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని చెక్‌పోస్టుల వద్ద అధికారులు లంచాలు తీసుకుంటున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో అక్టోబర్ 18, 19వ తేదీల మధ్య రాత్రి సమయంలో ఏకకాలంలో 12 చెక్‌పోస్టులపై సోదాలు నిర్వహించారు. నల్గొండ జిల్లాలోని విష్ణుపురం (వాడపల్లి), సూర్యాపేట జిల్లా కోదాడ, నారాయణపేట జిల్లా కృష్ణా, ఆదిలాబాద్ జిల్లా భోరజ్, నిర్మల్ జిల్లా భైంసా, కొమరం భీం-ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి, కామారెడ్డి జిల్లాలోని సలాబత్‌పూర్-మద్దూర్, పెండ్యాల, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వారావుపేట, ఖమ్మం జిల్లాలోని ముద్దుగూడెం (పెనుబల్లి) చెక్‌పోస్టుల్లో ఈ తనిఖీలు జరిగాయి. ఈ చెక్‌పోస్టుల వద్దకు వచ్చే లారీ డ్రైవర్లు తమ వాహనాలను సులభంగా దాటించుకోవడానికి అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్లు ఏసీబీ విచారణలో తేలింది. అధికారులు తమ విధులను పక్కనపెట్టి, ప్రైవేట్ ఏజెంట్ల ద్వారా ఈ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఏసీబీ తమ నివేదికలో పేర్కొంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం రూ. 4,18,880 లెక్కచూపని నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అవినీతి వ్యవహారంలో పాలుపంచుకున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించినట్లు ఏసీబీ వెల్లడించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే, తమ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలను ఏసీబీ కోరింది. అలాగే, వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (తెలంగాణ ఏసీబీ), ఎక్స్ ఖాతా @TelanganaACB ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చింది.

## మాజీ ఎమ్మెల్యే జగపతి రావు వర్ధంతి వేడుకలు

కరీంనగర్, అక్టోబర్ 19 (భారతశక్తి ప్రతినిధి) :కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు యువసేన ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని వెలిచాల ప్రజా కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ తెలంగాణ ఉద్యమ కారుడు వెలిచాల జగపతిరావు తృతీయ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, జగపతిరావు అభిమానులు, సన్నిహితులు, ప్రతినిధులు వెలిచాల జగపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదల ఆత్మబంధువు గా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జగపతిరావు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో అగ్రగన్యుడు జగపతిరావు అనీ, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులోనూ ప్రముఖ పాత్ర వహించిన ఘనత జగపతిరావుకే దక్కుతుందని పేర్కొన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పనిచేసి ప్రజల మన్ననలు పొందిన ఏకైక నాయకుడు జగపతిరావు అని కొనియాడారు. పేదల పక్షపాతిగా పేదల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ వారికి ఎల్లవేళలా అండదండలు అందించిన మహానేత అని పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఒక మాడల్ గా తీర్చిదిద్దారనీ, కరీంనగర్ ప్రజలు ఇప్పటికీ వాటిని గుర్తుపెట్టుకుంటున్నారని తెలిపారు. అనేకమంది నిరుద్యోగ యువకులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించిన నేత జగపతిరావు అని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీగా మార్క్ ఫెడ్ చైర్మన్ గా ఏ పదవి చేపట్టినా పేదల పక్షపాతిగా వ్యవహరించారని పేర్కొన్నారు. నీతి నిజాయితీగా ప్రజలకు సేవలందించి వారి గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఏకైక నేత జగపతి రావు మాత్రమేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, అభిమానులు, యువసేన



ప్రతినిధులు, వెలిచాల ప్రజా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ దీపావళి వెలుగులు నింపిందా..?

**తెలంగాణ రాజకీయ వేదికపై కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా అవతరించడం రాష్ట్ర ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. "విప్లవాత్మక మార్పు" కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఆయన ఉత్సాహం, దూకుడు, ప్రజా మద్దతు చైతన్యం కలిగించాయి. కానీ, కాలం గడుస్తున్న కొద్దీ ఆ ఉత్సాహం కొంత తగ్గి ఆత్మపరిశీలన అవసరమైందన్న భావన ప్రజల్లో వేగంగా పుట్టుకొస్తోంది. రేవంత్ పాలన మొదట్లో ప్రజలు "ఇదే నిజమైన మార్పు" అని భావించారు. పాత పద్ధతులను మార్చి కొత్త చైతన్యాన్ని తీసుకురావాలనే ప్రయత్నం స్పష్టంగా కనిపించింది. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో కొన్ని సంస్కరణలు ప్రారంభమయ్యాయి. పాత పాఠశాలల పునరుద్ధరణ, ఆసుపత్రుల్లో సదుపాయాల పెంపు, పౌర సేవల డిజిటల్ వ్యవస్థ వంటి కార్యక్రమాలు మంచి ప్రారంభ సూచనలు ఇచ్చాయి. అయితే, ఆ చైతన్యం ప్రభుత్వ వ్యవస్థలో లోతుగా ప్రవేశించలేకపోయింది. వాగ్దానాలు ఎక్కువగా, అమలు నిదానంగా ఉన్నదన్న విమర్శలు సర్వసాధారణమయ్యాయి.**

- రేవంత్ రెడ్డి పాలనలో ఆశలు, ఆవేదనలు..
- పాలన అంటే మాటలు కాదు.. చేతలు కనిపించాలి..
- ఆత్మపరిశీలన అవసరం అని సూచిస్తున్న విశ్లేషకులు..
- ప్రతిపక్షాలపై విమర్శలతోనే కాలం గడపడం భావ్యం కాదు..
- పరిపాలనలో మార్పు తీసుకొస్తానన్నపెద్దమనిషి ఏమీ మారలేదు.. మార్చలేదు..
- స్ఫూర్తిగా కనిపించడం వరకు సరే.. కానీ స్థిరత్వం లేదన్నది నిర్వివాదాంశం..
- ప్రజాసమస్యలకంటే.. పార్టీలో అంతర్గత సమస్యలే ఎక్కువ..
- మాట నిలబెట్టే అవకాశం ఉన్నా సమన్వయ లోపం కనిపిస్తోంది..
- కార్యక్రమాలు మంచివే కానీ, అమలు జరుగుతున్న విధానం సరిగా లేదు..
- పార్టీ సన్నిహితులకే అన్నీ జరుగుతున్నాయి..
- గత ప్రభుత్వం మాదిరిగానే కుటుంబపాలన సాగుతోంది..!
- ఈ దీపావళి సందర్భంగా రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేసి మీకు అందిస్తోంది " ఫోరం ఫార్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..

**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, అక్టోబర్ 19 (భారత శక్తి) :** 2023లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రజల్లో కొత్త ఆశలు వెల్లివిరిశాయి. "రేవంత్ వస్తే మార్పు వస్తుంది" అన్న నినాదం కొంతమేరకు ప్రజల మనసులో నాటుకుపోయింది. ఆయన తీరులో ఉత్సాహం, ధైర్యం, స్పష్టత కనిపించిందని పలువురు అభిప్రాయపడ్డారు. అయితే, కొందరు మాత్రం "అవకాశం దొరికిన తరువాత పాలనలో అచేతనం, రాజకీయ ప్రతీకారాలు" ఎక్కువయ్యాయని విమర్శిస్తున్నారు. ఇది అక్షరాలా నిజం..

**రేవంత్ సాధించిన కొన్ని విజయాలు :**

పాత పంచాయతీ భవనాలు, గ్రామస్థాయిలో పరిపాలనా పునరుద్ధరణ.. గ్రామ స్థాయి అభివృద్ధి కార్యక్రమాలకు నూతన ఉత్సాహం తీసుకొచ్చారు. అధికారులపై నియంత్రణ చేపట్టడం మరో విజయం.. అవినీతి, నిర్లక్ష్యం చూపుతున్న అధికారులపై చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. విద్యా, వైద్య రంగాలపై దృష్టి సారించారు.. పాత పాఠశాలల పునరుద్ధరణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాల పెంపు వంటి ప్రయత్నాలు చేశారు.

ఉచిత విద్యుత్, రైతు పథకాల కొనసాగింపు జరిగింది.. రైతుల కోసం పాత పథకాలను కొనసాగించి కొత్త చొరవలు తీసుకొచ్చారు. అలాగే జీ.హెచ్.ఎం.సి., పౌర సేవల డిజిటల్ పారదర్శకత ఒక అంశం.. ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థ, పౌర సదుపాయాలపై సమీక్షలు పెంచడం ప్రజల్లో చైతన్యం పెంచింది.




**అపజయాలు చాలానే ఉన్నాయి :**

రైతు బాండ్లు, రుణమాఫీ వాయిదాలు ఒక పెద్ద ఫెయిల్యూర్.. ఎన్నికల హామీల్లో చెప్పిన వాగ్దానాలు పూర్తి స్థాయిలో అమలు కాలేదని విమర్శలు ఉన్నాయి.. ఉద్యోగ నియామకాల ఆలస్యం మరో అపజయం.. నిరుద్యోగులలో అసంతృప్తి పెరిగింది. కొత్త నోటిఫికేషన్లు తక్కువగా రావడం పట్ల ఆందోళనలు. ఇదే విధానం గత ప్రభుత్వంలో కూడా జరిగింది.. మరి మార్పు ఏమి జరిగిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.. మౌలిక వసతుల సమస్యలు ఎన్నెన్నో ఉత్పన్నం అయ్యాయి.. హైదరాబాద్ సహా పలు పట్టణాల్లో డ్రైనేజ్, రోడ్ల సమస్యలు పరిష్కారం కాని దుస్థితి ఇప్పటికీ నెలకొని ఉంది..



ఇక ముఖ్యంగా చెప్పుకోవలసింది పార్టీలో అంతర్గత అసంతృప్తి.. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తుండటం పార్టీ స్థిరత్వంపై ఎన్నెన్నో అనుమానాలకు తెరలేపింది..

**ప్రభుత్వంపై ఆరోపణలు కోకొల్లలు :**

కొంతమంది కాంట్రాక్టర్లతో అనుచిత సంబంధాలు ఉన్నాయని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నారు. టెండర్లలో పారదర్శకత లోపించిందని వ్యాపార వర్గాలు విమర్శిస్తున్నాయి. పోలీస్ ట్రాన్స్ ఫర్లు, అధికార నియామకాల్లో రాజకీయ జోక్యం ఉందనేది బహిరంగ రహస్యమే.. ఇక అవినీతి ఆరోపణలు కూడా ఉన్నాయి.. జీ.హెచ్.ఎం.సి. కాంట్రాక్టులలో లంచాలు, కమీషన్లు కొనసాగుతున్నాయనే అభియోగాలు ఉన్నాయి.. పబ్లిక్ వర్క్స్, రోడ్లు, టాయిలెట్స్ నిర్మాణాల్లో భారీ అవకతవకలు వెలుగులోకి వచ్చాయి.. కొంతమంది ఎమ్మెల్యేల సన్నిహితులు ప్రభుత్వ కాంట్రాక్టులు పొందుతున్నారని ప్రతిపక్ష ఆరోపణలు.

**ప్రజల అభిప్రాయాలు స్పష్టంగా ఉన్నాయి:**

ప్రశంసలు విషయానికి వస్తే.. మాట నిలబెట్టే ధైర్యం ఉంది, కానీ సమన్వయం లోపిస్తోంది. కార్యక్రమాలు మంచివే కానీ, అమలు నిదానంగా జరుగుతోందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.. అలాగే విమర్శలు.. మార్పు కోసం వాగ్దానం చేసిన రేవంత్, అదే పాత రాజకీయ పద్ధతులు కొనసాగిస్తున్నాడు. ప్రజా సమస్యల కంటే పార్టీ అంతర్గత తగాదాలు ఎక్కువగా వున్నాయి..

మొత్తం మీద చూస్తే ..రేవంత్ రెడ్డి పాలనలో స్ఫూర్తి ఉంది, కానీ స్థిరత్వం లోపిస్తోంది. నిష్కళంకత, పారదర్శకత సాధిస్తే ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుంది. ప్రతిపక్షాల విమర్శలకంటే సాధనలతో సమాధానం ఇవ్వడం ఈ ప్రభుత్వానికి అత్యవసరం.

పాలన అంటే మాటలు చెప్పడం కాదు.. ప్రభుత్వం చేస్తున్న చర్యలు ప్రజలకు కనపడాలి. కుటుంబపాలనకు చరమగీతం పాడాలి.. నిరంకుశత్వం విడనాడాలి.. పక్కరాష్ట్రం ఏదో చేస్తోందని గురువైన ఆరాష్ట్ర ముఖ్యమంత్రిని అనుసరించకుండా.. ఇక్కడి తెలంగాణ ప్రజలకు అనుగుణంగా పాలన సాగించాలి.. అంతే కాకుండా రేవంత్ రెడ్డికి పరిపాలనా అనుభవం లేకపోవడంతో చాలా అనర్థాలు జరుగుతున్నాయి.. అనుభవం ఉన్న నాయకుల సహాయం తీసుకోవడంలో మొహమాటం పడకూడదు.. ఈగోను వదిలేస్తే మంచిది.. పైగా కోట్లు కుమ్మరించి సీఎం పదవి కొనుక్కున్నాడనే తీవ్రమైన అపవాదు కూడా వుంది.. అలాగే మూసీ నదిని సుందరీకరించే ప్రయత్నంలో సోనియా అల్లుడు, రాహుల్ గాంధీ బావ అయిన రాబర్ట్ వాద్రాకు సంబందించిన కంపెనీకి దాదాపు రూ. 6000 కోట్ల కాంట్రాక్ట్ కట్టబెట్టబోతున్నాడనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.. వీటన్నిటికీ తన సుపరిపాలనతో రేవంత్ సమాధానం చెప్పాల్సి ఉంది.. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ఆత్మవిమర్శ చేసుకుని ముందుకు సాగాలని ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు..

ప్రజలు వెలిబుచ్చిన అభిప్రాయాలను రేవంత్ రెడ్డి పరిగణలోకి తీసుకుంటాడని భావిస్తోంది "ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "




## అనాథ విద్యార్థి గృహంలో ఉచిత చర్మ వ్యాధుల శిబిరం

ఎల్బీనగర్, అక్టోబర్ 19 (భారత శక్తి): వనస్థలిపురం డివిజన్ సహారా రోడ్డులోని యంఇ రెడ్డి ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న డెర్మకూర్ స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ చర్మ వ్యాధుల నిపుణులు డా. మణికుమారి ఆధ్వర్యంలో ఆర్కే పురం చిత్రా లేఅవుట్ లో ఉన్న అనాథ విద్యార్థి గృహంలో ఉన్న 110 మంది విద్యార్థులకు ఉచితంగా చర్మ వ్యాధుల పరీక్షలు చేశారు. గృహ విద్యార్థులు అందరికీ చర్మ వ్యాధుల పరీక్షలు చేసి, సమస్యలు ఉన్న వారికి రిపోర్ట్ లను అందచేశారు. విద్యార్థులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అంతేకాకుండా కొందరి విద్యార్థులకు పరీక్షలు చేయుటకు వారిని డెర్మకూర్ స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ కు పంపించాలని గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ కు సూచించారు.ఈ సందర్భంగా డాక్టర్ మణికుమారి మాట్లాడుతూ, అనాథ విద్యార్థి గృహం విద్యార్థులకు ఎనలేని సేవలు అందిస్తున్న విషయం తెలిసి, చాలా మంది విద్యార్థులు ఉన్న హాస్టల్ లో చర్మ వ్యాధులు ఉండే అవకాశం ఉంది కాబట్టి చర్మ వ్యాధుల మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశామని, అన్ని రకాల చర్మ వ్యాధుల గురించి, రెగ్యులర్ గా అత్యవసరమైన అన్ని పరీక్షలు కూడా మా స్కిన్ క్లినిక్ లో ఉచితంగా చేస్తామని గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ కు మాట ఇచ్చారు. అలాగే చర్మ వ్యాధులు రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తలు, తీసుకోవల వలసిన తగిన చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గృహ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, విద్యార్థులు, కళ్యాణ్, క్లినికల్ సిబ్బంది భూక్య మీను హాజరయ్యారు..

## హైడ్రాలో "ఆట" విడుపు.. క్రికెట్ తో సేదదీరిన హైడ్రా

హైదరాబాద్, అక్టోబర్ 18 (భారత శక్తి) : నగర ప్రజలకు మెరుగైన జీవనాన్ని అందించడానికి నిత్యం శ్రమించే హైడ్రా క్రికెట్ ఆటతో శనివారం సేదదీరింది. వర్షాకాలం వరద కష్టాలు తీర్చడంలో తలమునకలైన హైడ్రా క్రికెట్ ఆడి సందడిగా గడిపింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో క్రికెట్ ఆటతో ఎంజాయ్ చేసింది. ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువులు, నాలాలు, రహదారులతో పాటు ప్రజావసరాల ఉద్దేశించిన స్థలాలను కాపాడడంలో క్షణం తీరిక లేకుండా వున్న హైడ్రా సిబ్బంది క్రికెట్ ఆటలో బ్యాటుతో సిక్సర్ల వర్షం కురిపించారు, బౌలింగ్లో పిడుగులాంటి బాల్స్ వేసి వికెట్లు పడగొట్టారు. హైడ్రాలో అసెట్స్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్మెంట్ విభాగాలు రెండు జట్లుగా రంగంలో దిగి నువ్వా నేనా అనేట్లు క్రికెట్లో పోటీ పడ్డాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ , హైడ్రా అదనపు కమిషనర్ శ్రీ ఎన్. అశోక్ కుమార్ , హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల.పాపయ్య , హైడ్రా అదనపు కమిషనర్ అడ్మిన్ శ్రీ ఆర్. సుదర్శన్, ఈ జట్లకు నాయకత్వం వహించారు. వీరి నేతృత్వంలోని క్రికెట్ జట్లు నువ్వ నేనా అనేట్లు పోటీ పడ్డాయి. హైడ్రా అదనపు కమిషనర్ అడ్మిన్ శ్రీ సుదర్శన్ బౌలింగ్ చేయాగా హైడ్రా కమిషనర్ శ్రీ రంగనాథ్ , అడిషనల్ డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్య చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేసి పరుగుల వర్షం కురిపించారు. హైడ్రా అదనపు కమిషనర్ శ్రీ అశోక్ కుమార్ అంపైరింగ్ చేసారు. ఫతుల్లగూడలోని హైడ్రా క్రీడమైదానంలో ఫ్లడ్ లైట్ల కాంతిలో హైడ్రా క్రికెట్ ఆట సందడిగా సాగింది. హైడ్రా పీఆర్వో వేణుగోపాల నాయుడు క్రికెట్ కామెంట్రీ ఆటగాళ్లతో పాటు ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని నింపింది. శనివారం అర్ధరాత్రి వరకు జరిగిన క్రికెట్ ఆటలో హైడ్రాలో పని చేస్తున్న సిబ్బంది మొత్తం సేదదీరింది. చక్కటి సమన్వయంతో కలసికట్టుగా పని చేసేందుకు క్రీడలు దోహదం చేస్తాయని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు అన్నారు. నిత్యం యిదే స్ఫూర్తితో, ఉత్సాహంతో పని చేసి నగర ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.





## అంధకారాన్ని జయించి వెలుగును ఆహ్వానించే పండుగ దీపావళి

- **ఈ దీపావళి ప్రతి ఇంట్లో వెలుగు, సంతోషం, శాంతి నింపాలని ఆకాంక్షిస్తున్నాం.**
- **జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల.**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 19 (భారత శక్తి) : నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ప్రజలందరికీ, పోలీసు అధికారులకు, సిబ్బందికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



## అక్రమ మొరం దందా చేస్తున్న అధికార పార్టీ నాయకులు, సహకరిస్తున్న అధికారులు

**: ఎలుకటి రాజయ్య మాదిగ.**

భూపాలపల్లి, అక్టోబర్ 19 (భారత శక్తి) : ఆదివారం చిట్యాల మండలంలోని నవాబ్ పేట గుట్టల్లో అక్రమ మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలు గా విలసిల్లుతుందని, ఈ దందా అధికార పార్టీ నాయకులు చేస్తున్నారని ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికార పార్టీకి చెందిన కొంతమంది అక్రమంగా మొరం తవ్వుతున్న నవాబ్ పేట గుట్టలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సహజ సిద్ధంగా ఏర్పడిన గుట్టలపై కొంతమంది అధికార పార్టీ నాయకుల కన్ను పడిందని,వారి అక్రమ సంపాదన కోసం మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు.ఇట్టి విషయమై సంబంధిత అధికారులు స్పందిస్తే అధికార పార్టీ నాయకులమని, ఎమ్మెల్యే అనుచరులమని అధికారులను బెదిరిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరులు ఇష్టారీతినా వ్యవహారిస్తూన్నారని, అందువల్ల సంబంధిత అధికారులు చూసి చూడనట్లువ్యవహరిస్తున్నారని ఈ దందా ఇలాగే కొనసాగితే పర్యావరణం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తతంగం జరుగుతున్న సంబందిత మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని,ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ మొరం తరలిస్తున్న వ్యక్తులపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో ఎం ఆర్ పి ఎస్ మండలం అధ్యక్షులు రేణుకుంట్ల రాము మాదిగ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.